మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 104 • పేజీలు:12+16 • వెల: రూ.5 | బుధవారం • 14-3-2018 | www.manamnews.com | /manamnews

వేటు..దీక్ష

ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు

మరో ఇద్దరిపై కూడా వేటుపడే అవకాశం



- మైకులు విసిరింది మొత్తం నలుగురు
- వీడియో ఫుటేజీ పరిశీలనలో గుర్తింపు
- 11 మంది ఎమ్మెల్యేల సస్పెన్షన్
- ఆరుగురు ఎమ్మెల్సీలపైనా అదే చర్య
- తెలంగాణ అసెంబ్లీ సంచలన నిర్ణయం
- దుర్మార్గం.. దురదృష్టకరం: స్పీకర్
- స్పీకర్ చర్యను ఖండించిన కాంగ్రెస్
- సస్పెన్షన్‌కు సీఎం కేసీఆర్ సమర్థన
- ఆయనకు ఎంఐఎం నేత మద్దతు
- కిషన్‌రెడ్డి.. ముఖ్యమంత్రి వాగ్వాదం
- 48 గంటల దీక్షకు దిగిన 'ఆ ఇద్దరు'





6లో..

ఇద్దరు సభ్యుల ఆవేశం.. మండలి చైర్మన్ కంటికి గాయం.. సభాపతి ఆగ్రహం.. ఇద్దరి శాసనసభ్యత్వాల రద్దు! మరో 11 మంది ఎమ్మెల్యేలు, ఇంకో ఆరుగురు ఎమ్మెల్సీలపై సమావేశాలు ముగిసేవరకు సస్పెన్షన్ వేటు!! శాసనసభ చరిత్రలోనే ఇంతవరకు ఎన్నడూ లేనంత తీవ్ర నిర్ణయం తీసుకున్నారు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి. స్వామిగౌడ్ కంటి గాయానికి కారణం అయ్యారని.. సభలో అలజడి సృష్టించారని ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్ కుమార్‌ల శాసన సభ్యత్వాన్ని రద్దుచేశారు. రాజ్యాంగంలోని 194(3) అధికరణ ప్రకారం ఈ చర్య తీసుకున్నారు. మరో 11 మంది ఎమ్మెల్యేలు.. ఆరుగురు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేశారు. అయితే, సోమవారం నాటి సభలో.. నలుగురు ఎమ్మెల్యేలు మైకు సెట్లు విసిరినట్లు మంగళవారం గుర్తించారు. సస్పెండైన వారిలో మరో ఇద్దరు సభ్యులపై కూడా వేటుపడే అవకాశం కనిపిస్తోంది. ఇద్దరి శాసన సభ్యత్వాలను రద్దుచేస్తున్నట్లు గెజిట్‌లో నోటిఫై చేసిన ప్రభుత్వం.. ఆ నోటిఫికేషన్‌ను ఈసీకి పంపింది. స్పీకర్ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. స్పీకర్ చర్యపై న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించింది. స్పీకర్ చర్యను సీఎం కేసీఆర్ సమర్థించారు. ఆయనకు ఎంఐఎం అండగా నిలవగా.. బీజేపీ నేత కిషన్‌రెడ్డి మండిపడ్డారు. స్పీకర్ తీరుకు నిరసనగా బీజేపీ, టీడీపీ మంగళవారం సభను బహిష్కరించాయి.



బహిష్కరణకు గురైన సభ్యులు

- కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- సంపత్ కుమార్


శాసనమండలిలో సస్పెండైన సభ్యులు

- షబ్బీర్ అలీ
- పొంగులేటి సుధాకర్ రెడ్డి
- దామోదర్ రెడ్డి
- ఆకుల లలిత
- కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి
- సంతోష్ కుమార్

బడ్జెట్ సమావేశాల వరకు సస్పెండైన సభ్యులు

- కె.జానారెడ్డి
- ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- జీవన్ రెడ్డి
- గీతా రెడ్డి
- చిన్నా రెడ్డి
- డి.కె. అరుణ
- మల్లు భట్టి విక్రమార్క
- పద్మావతి రెడ్డి
- రామ్మోహన్ రెడ్డి
- వంశీచంద్ రెడ్డి
- దొంతి మాధవ రెడ్డి

ఇదీలోకం!



మన మిగతా ఎమ్మెల్యేలందరూ కూడా ఎవరికి వారు రాజీనామా చేస్తారని వాళ్లు ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారట సార్..!

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి మ.3.46 తదుపరి త్రయోదశి; నక్షత్రం: శ్రవణం మ.3.04 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: సా.7.25-9.10; దుర్ముహూర్తం: మ.12.02-12.49; రాహుకాలం: మ.12.26-1.55; అమృతఘడియలు: తె.3.35-5.22; శుభసమయం: మ.1.56-3.00;

సూర్యోదయం: 6.29

సూర్యాస్తమయం: 6.22

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో బుధవారం వేడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు రెండూ స్వల్పంగా పెరుగుతాయి. పగటి పూట వేడి గాలులు వీచే అవకాశం ఉంది. రాత్రిపూట గంటకు 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 38 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 24 డిగ్రీలు

గాలిలో తేమ: 36 శాతం

సిరిసిల్లలో అప్పేరల్ పార్కు

కేఏవై వెంచర్స్‌తో ఒప్పందం.. వంద కోట్ల పెట్టుబడితో ఏర్పాటు

మూడు దశలు.. మూడేళ్లలో పూర్తి

పార్కులో 30వేల మందికి ఉపాధి

నేతన్న కష్టాలు కేసీఆర్‌కు తెలుసు

- మరమగ్గాలలో 50% సిరిసిల్లలోనే..
- 'అజాంజాహి' కార్మికుల వలస
- వారిని తిరిగి రప్పించేందుకు చర్యలు
- అందుకే కాకతీయ మెగా టెక్స్‌టైల్స్
- చేనేత యజమానులతో బైబ్యాక్ ఒప్పందం
- యూనిఫామ్ తయారీ వారికే ఇచ్చాం
- సచివాలయంలో మంత్రి కేటీఆర్



హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి):

సిరిసిల్ల జిల్లాలో అప్పెరల్ సూపర్ హబ్ ఏర్పాటు కానుంది. ఇందులో భాగంగా 20 ఎకరాల్లో ఈ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు కేఏవై వెంచర్స్ సంస్థతో ఒప్పందం కుదిరింది. మంగళవారం **మిగతా 6లో..**

ప్రతీకార దాడి



ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల మందుపాతర

- తొమ్మిది మంది సీఆర్పీఎఫ్ జవాన్ల మృతి
- కొందరికి గాయాలు.. నలుగురు విషమం
- కిష్టారం-పాలోడి రోడ్డులో దుర్ఘటన
- కూంబింగ్‌కు వెళ్లిన 212 బెటాలియన్
- వందమంది మావోయిస్టుల దాడి

రాయ్‌పూర్, మార్చి 13:

మావోయిస్టులు మరోసారి ప్రతీకార దాడికి దిగారు. మైన్ ప్రూఫ్ వాహనంలో వెళ్తున్న సీఆర్పీఎఫ్ బృందంపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. అత్యంత శక్తిమంతమైన పేలుడు పదార్థంతో వాహనాన్ని పేల్చేయడంతో పాటు తూటాల వర్షం కురిపించడంతో తొమ్మిది మంది జవాన్లు మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాజిల్లాలోని కిష్టారం-పాలోడి రోడ్డులో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఈ దాడి జరిగింది. సీఆర్పీఎఫ్‌లోని 212 బెటాలియన్‌కు చెందిన కొంతమంది జవాన్లు కూంబింగ్ ఆపరేషన్ కోసం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఒకటి **మిగతా 6లో..**



నేలకు దిగిన గాలిమోటార్లు

65 విమానాల సేవలు రద్దు

ఇండిగో 47.. గో ఎయిర్ 18

ఇంజిన్లలో సమస్యలే కారణం

ప్రయాణికులకు నరకయాతన

టికెట్ల డబ్బు రీఫండ్‌కు అవకాశం

వేరే విమానాల్లో వెళ్లేందుకు చాన్స్



7లో..



ఆధార్‌పై ఊరట

అనుసంధానం గడువు

నిరవధికంగా పొడిగింపు

సుప్రీం ధర్మాసనం ఆదేశాలు

బ్యాంకు, సిమ్‌లకు వర్తింపు


7లో..

కవితకు మోదీ జన్మదిన శుభాకాంక్షలు

- తెలుగులో లేఖరాసిన ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 13: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టీఆర్ఎస్ ఎంపీ కవితకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఇంగ్లిష్‌లో కాకుండా తెలుగులో శుభాకాంక్షలు చెబుతూ లేఖ రాయడం విశేషం.

'' జన్మదినం సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు స్వీకరించండి.. మీరు దేశ ప్రజలకు సేవలందించేందుకు కావాల్సిన ఆరోగ్యకర, ఆనందకర జీవితాన్ని ప్రసాదించాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నాను'' అని అందులో మోదీ పేర్కొన్నారు.


Prime Minister
New Delhi
March 13, 2018
Dear Smt. Kalvakuntla,
Smt. Kavitha Kalvakuntla, MP





ప్రగతి భవన్‌లో మంగళవారం సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన హైదరాబాద్ కొత్త సీపీ అంజనీకుమార్. చిత్రంలో రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

మీడియాతో చిట్‌చాట్

సభ్యత్వం రద్దు సరైనదే: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించిన సభ్యుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిందేనని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కోమటి రెడ్డి, సంపత్ కుమార్‌ల సభ్యత్వాన్ని స్పీకర్ రద్దు చేయడాన్ని ఆయన సమర్థించారు. గవర్నర్ ప్రసంగం సమయంలో కోమటి రెడ్డి, సంపత్‌లకు మిగతా కాంగ్రెస్ నేతలు సహకరించారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు స్పీకర్ కఠినంగా వ్యవహరించడం కొత్తేమీ కాదని తెలిపారు. ఈమేరకు అసెంబ్లీ లాబీలో కేటీఆర్ మీడియాతోచిట్ చాట్ చేశారు. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో 1996లో అసెంబ్లీల్లో కూడా అనుచితంగా ప్రవర్తించిన సభ్యులపై కఠిన చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. నేరానికి పాల్పడ్డ వారితో పాటు ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులేనని కేటీఆర్ తెలిపారు. 194(3) ప్రకారం అసెంబ్లీకి విశేష అధికారాలు ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఎక్స్‌పెల్ అయిన సభ్యులు మాజీలేనని మంత్రి తేల్చేశారు. గతంలో రోజా, కరుణాం బలరామ్‌లపైనా ఇదే సభలో చర్యలు తీసుకున్నారని చెప్పారు.

నిరసన తెలిపితే ఎక్స్‌పెల్ చేస్తారా: కిషన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): అధికార పక్షం ఏదైతే అనుకుందో.. ఖచ్చితంగా అది సభలో అమలుచేసిందని బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ లాబీలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కోమటి రెడ్డి, సంపత్ కుమార్‌ల సభ్యత్వాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొందన్నారు. మంగళవారం నుంచి వారికి జీతం కూడా రాదని తేల్చేశారు. సభ్యత్వాన్ని రద్దు చేసిన పత్రాలు ఎలెక్షన్ కమిషన్‌కు పంపాల్సిందేనని పేర్కొన్నారన్నారు. వచ్చే ఆరు నెలల్లో ఈ రెండు స్థానాలకు మళ్ళీ ఉప ఎన్నికలు వచ్చే అవకాశమే ఎక్కువని కిషన్ రెడ్డి అన్నారు. మొన్న బీఏసీ మీటింగ్‌లో మొదట విచారం వ్యక్తంచేసిన వ్యక్తి జానారెడ్డి అని కిషన్‌రెడ్డి తెలిపారు. కానీ ఆయనను కూడా సస్పెండ్ చేయడం బాధాకరమంటూ విచారం వ్యక్తం చేశారు. జానారెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరినట్లు తెలిపారు. ఆ సమయంలో తన మైక్ కూడా కట్ చేశారని కిషన్ రెడ్డి వెల్లడించారు.

స్వామి గౌడ్‌పై దాడి బాధాకరం: జోగు




హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): శాసన సభలో మండలి చైర్మన్‌పై దాడి బాధాకరమని మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. కాంగ్రెస్ నిరసనల స్థాయి హద్దులు దాటిందని మంత్రి మండిపడ్డారు. దాడులకు పాల్పడడం ద్వారా ప్రజాభిమానం పొందుతామనుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. సమాజానికి ఆదర్శంగా, అందరి కన్నా బాధ్యతాయుతంగా ఉండాల్సిన సభ్యులు ఇలా ప్రవర్తించడం దారుణమన్నారు. ఈమేరకు మంగళవారం నాడు సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్వామి గౌడ్‌ను మంత్రి జోగు రామన్న పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి గౌడ్ తొందరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు టీఆర్ఎస్ నేతలు సైతం స్వామిగౌడ్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

వార్ వన్ సైడే.. సిద్ధమా?: తలసాని



హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా వార్ వన్‌సైడే అవుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సాధారణ ఎన్నికలైనా, ఉప ఎన్నికలైనా ఎగిరేది టీఆర్ఎస్ జెండానేనని కుండబద్దలు కొట్టారు. ఈమేరకు మంగళవారం అసెంబ్లీ లాబీలో తలసాని మీడియాతో మాట్లాడారు. ప్రజా సంక్షేమంకోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలన్నీ ప్రజల్లోకి వెళ్లాయని మంత్రి పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీలో జరిగిన సంఘటనలపై స్పందిస్తూ.. ఉద్యమ కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సభలో జరిగిన ఘటనలను తాజా ఘటనతో పోల్చలేమని కొట్టిపారేశారు. మండలి చైర్మన్‌పై దాడిని తలసాని తీవ్రంగా ఖండించారు. దీనిపై సమావేశమైన హౌజ్ కమిటి వారిని సస్పెండ్ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించడంతో స్పీకర్ ఆమేరకు నిర్ణయం తీసుకున్నారని తలసాని వివరించారు. నేతల సభ్యత్వం రద్దు చేసినచోట ఉప ఎన్నికలు వస్తాయని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు.



మంత్రి మహేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీజేఎంయూ నేతలు

ఆర్టీసీకి 1500 కోట్లివ్వండి

- రవాణాశాఖ మంత్రికి టీజేఎంయూ వినతి


హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): టీఎస్ఆర్టీసీని ఆదుకోవాలని టీజేఎంయూ ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీకి ఈసారి బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటాయించాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డికి టీజేఎంయూ నేతలు మంగళవారం వినతిపత్రమిచ్చారు. కొత్త బస్సులు కొనుగోలు చేసేందుకు, సిబ్బంది నియామకాలకు నిధులు కేటాయించి ఆర్థికంగా నష్టాల్లో ఉన్న సంస్థను కాపాడాలని టీజేఎంయూ అధ్యక్షుడు సుధాకర్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎంయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వడ్డేమాన్ స్వాములయ్య, గోలి రవీందర్, తదితరులు ఉన్నారు.

నెక్స్ట్ ఏంటీ ?

సభ్యత్వం రద్దు, సస్పెన్షన్‌పై కాంగ్రెస్ ఆగ్రహం

- సహజ న్యాయ సూత్రాలకు దూరమని ఆరోపణ
- సభ నిర్ణయాన్ని ఖండించిన ఇన్‌చార్జి కుంతియా
- గాంధీ భవన్ వద్ద 48 గంటల నిరసన దీక్ష
- కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం, రాస్తా రోకోలు
- మూకుమ్మడి రాజీనామా యోచనలో నేతలు
- అధిష్ఠానం ఆదేశాల కోసం ఎదురుచూపు
- కేసీఆర్ తీరుపై జాతీయస్థాయిలో ప్రచారం చేయాలని నిర్ణయించిన పీసీసీ వర్గాలు

హైదరాబాద్, మార్చి 13 (మనం ప్రతినిధి): అసెంబ్లీ సమావేశాలు తొలిరోజు జరిగిన ఘటనల నేపథ్యంలో శాసన సభ స్పీకర్ కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకున్నారు. ఇద్దరు శాసన సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు, శాసనసభ, మండలిలో కాంగ్రెస్ సభ్యులందరినీ సభ నుంచి సస్పెండ్ చేశారు. స్పీకర్ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికార ప్రభుత్వ నిర్ణయం ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా ఉందని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అంతేకాక సభ్యత్వాల రద్దుపై న్యాయపోరాటానికి సిద్ధమైనట్లు తెలిసింది. ఈ తరహా కేసులో గతంలో సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందని, సభ్యత్వ రద్దు అధికారం ఉన్నప్పటికీ, అది సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా ఉండాలని ధర్మాసనం చెప్పిందని కాంగ్రెస్ నేత మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. సభ్యుల వివరణ తీసుకోకుండా సభ్యత్వ రద్దు వంటి నిర్ణయం తీసుకోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని న్యాయనిపుణులు చెప్పారని విక్రమార్క తెలిపారు. సభ్యుడి ప్రవర్తనపై ఇబ్బంది ఉంటే విషయాన్ని ఎథిక్స్ కమిటీకి నివేదించాలని, కమిటీ సూచనల మేరకు సభ్యునికి నోటీసులు ఇవ్వడంతో పాటు, సంబంధిత సభ్యునిపై సభ అభిప్రాయం తీసుకోవాలని నిబంధనలు చెబుతున్నాయని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కానీ సభలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, సభ్యత్వం ఎందుకు రద్దు చేశారో అడిగినా చెప్పలేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అకారణంగా ప్రజాప్రతినిధి సభ్యత్వాన్ని రద్దు చేశారని, దీనిపై దేశ వ్యాప్తంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మూడో ఫ్రంట్ కలలు కంటున్న కేసీఆర్ సొంత రాష్ట్రంలో అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను చాటి చెప్పాలని, ప్రజాస్వామ్య విలువల పట్ల కేసీఆర్‌కు ఉన్న నిబద్ధత గురించి జాతీయ నాయకులకు తెలిసేలా చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారు.





పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీలు ప్లకార్డులో నిరసన తెలియజేస్తున్నారని, అదే పని తాము ఇక్కడ చేస్తే సస్పెండ్ చేశారని, కేసీఆర్ అనుసరిస్తున్న ద్వంద్వ నీతికి ఇది నిదర్శనమని హస్తం నేతలు అంటున్నారు. ఈ విషయంపై ఆందోళనలు, న్యాయపోరాటంతో పాటు మూకుమ్మడిగా రాజీనామాలు చేసే ఆలోచన కూడా ఉందని పీసీసీ వర్గాలు వెల్లడించాయి. రాజీనామాల ప్రతిపాదనను ఏఐసీసీకి పంపించినట్లు తెలిసింది. అధిష్టానం నిర్ణయం ప్రకారం నడుచుకుంటామని పీసీసీ వర్గాలు వెల్లడించాయి. సభలో జరిగిన విషయాలను కుంతియాకు నాయకులు వివరించారు. పార్టీ సభ్యుల సభ్యత్వాలను రద్దు చేయడం పట్ల కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్చి కుంతియా కూడా ఖండించారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యకు నిరసగా గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ మంగళవారం సాయంత్రం నుంచి 48 గంటల దీక్షకు పిలుపు ఇచ్చింది. సభ్యత్వం రద్దయిన కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్ ఈ దీక్షలో కూర్చున్నారు. వీరికి మద్దతుగా సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దీక్షలో పాల్గొన్నారు. అంతేకాక ఎక్కడికక్కడ నిరసన ప్రదర్శనలు చేయాలని నేతలు కార్యకర్తలకు సూచించారు. సభ్యత్వాలు రద్దు అయిన వెంటనే పీసీసీ ఇచ్చి న పిలుపు మేరకు రాష్ట్రంలో అనేక చోట్ల కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో పాటు రాస్తా రోకోలు చేశారు. హైదరాబాద్‌లో యువజ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాంపల్లిలో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఏదిఏమైనా రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించిన ఈ ఘటనలపై ప్రజల్లో తీవ్ర చర్చ మొదలయ్యింది. ఇకపై కాంగ్రెస్ నేతలు ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని చర్చించుకుంటున్నారు.

ఉల్లంఘిస్తే ఊస్టే!

- ఇందిరాగాంధీకీ తప్పలేదు
- కోర్టుకెక్కినా ఫలితం లేదు

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): శాసన సభ సభ్యులనే కాదు.. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే, ఆయా సభ్యులు, వివిధ పక్షాల వివరణ తీసుకున్నాకే కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. కొన్ని కేసుల్లో సభ్యులు కోర్టులకెక్కినా ఫలితంలేకపోయింది. గతంలో జరిగిన ఈ తరహా ఘటనలు..



వివాదం.. బహిష్కరణ

- 1966 ఆగస్టు 29న యశ్వంతరావు అనే ఎమ్మెల్యేపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం సస్పెన్షన్ విధించింది. దీనిపై మేఘూవల్ కోర్టును ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించడంతో మేఘూవాల్‌కు నిరాశ తప్పలేదు. సభ్యుల ప్రవర్తన నేపథ్యంలో ఏలాంటి చర్యలనైనా తీసుకునే అధికారం శాసన సభకు ఉందని కోర్టు స్పష్టంచేసింది. ఆర్టికల్ 194(3) ప్రకారం చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. శాసనసభ నిబంధనావళిని రూపొందించుకోకపోయినా, శాసనసభ తీర్మానం చేసి చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.
- 1976 నవంబర్ 15న రాజ్యసభ సభ్యుడు సుబ్రహ్మణ్యస్వామి అనుచిత ప్రవర్తన కారణంగా బహిష్కరణకు గురయ్యారు.
- 2005 డిసెంబరులో ఓటుకు నోటు కేసులో 11 మంది రాజ్యసభ సభ్యులను పార్లమెంటు నుంచి బహిష్కరించారు.
- ఉమ్మడి ఏపీలో 2008 మార్చిలో ఎమ్మెల్యే కరణం బలరాం ఒంగోలు జిల్లా పర్యటన సందర్భంగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో ఆరు నెలల పాటు శాసనసభ నుంచి సస్పెండ్ చేశారు.
- 1977 నవంబర్ 18న దేశ ప్రధాన మంత్రిగా పనిచేసిన ఇందిరాగాంధీని లోక్‌సభ నుంచి బహిష్కరించారు.
- 1964 జూన్ 13న అనుచిత ప్రవర్తన కారణంగా మహారాష్ట్ర శాసనసభ ఒక సభ్యుడిని బహిష్కరించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో 2015లో ఎమ్మెల్యే రోజా శాసనసభలో చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తన కారణంగా ఆర్టికల్ 194(3) ప్రకారం ఏడాదిపాటు సస్పెండ్ చేశారు.
- కేరళ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పట్ల దురుసుగా వ్యవహరించిన ఎమ్మెల్యేలపై 2015 మార్చి 15న పోలీసు కేసు నమోదైంది.



ప్రభుత్వానికి ప్రొగ్రెస్ రిపోర్టు: పల్లా

హై దరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): శాసనమండలిలో ప్రశ్నోత్తరాల అనంతరం ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ వర్నర్ ప్రసంగం ప్రభుత్వ పనితీరుకు ప్రొగ్రెస్ రిపోర్టు అన్నారు. గవర్నర్ చెప్పిన విధంగా తెలంగాణ రైతాంగానికి సాగు నీటి కోసం ప్రాజెక్టులు, సబ్సిడీలు, ఎకరాకు ఎనిమిది వేలు వంటి అమలు చేస్తున్నామన్నారు. మిషన్ కాకతీయ పథకంగా ద్వారా 8 లక్షల ఎకరాల్లో రెండు పంటలు పండుతున్నాయన్నారు. సీఎర్ కేసీఆర్ అసాధ్యాన్ని సుసాధ్యం చే శారని పేర్కొన్నారు.రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, గవర్నర్ ప్రసంగంలో ఇదే విషయం ఉందని నారాదాసు అన్నారు.

సస్పెన్షన్‌ను అందరూ ఆమోదిస్తున్నారు

- టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



హైదరాబాద్, మార్చి13 (మనం ప్రతినిధి): కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సభ్యుల శాసనసభ్యత్వాలను రద్దు చేయడాన్ని సభ్య సమాజం ఆమోదిస్తోందని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. వేటు అన్యాయమని జానారెడ్డి పేర్కొనడం దారుణమని వేముల వీరేశం, బాలసాని లక్ష్మీ నారాయణ, గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, దానిని ఎట్టిపరిస్థితిలోనూ అడ్డుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణలో నశిస్తున్న కుల వృత్తులకు సీఎం కేసీఆర్ జీవం పోస్తున్నారని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గౌడ వృత్తిని పరిరక్షించేందుకు ప్రభుత్వం నడుం బిగించిందని అన్నారు. సభలో ఏం మాట్లాడాలో తెలియకే కాంగ్రెస్ సభ్యులు గొడవకు దిగారని మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్ గొంగిడి సునీత, విప్ నల్లాల ఓదేలు పేర్కొన్నారు. అసెంబ్లీ వైద్యులు సలహా మేరకే స్వామిగౌడ్‌ను సరోజనీ ఆస్పత్రికి తరలించామని పేర్కొన్నారు.

మండలిలో సజావుగా..!

- తొలిరోజు ప్రశ్నోత్తరాలు
- సమస్యలతో ఎమ్మెల్సీలు
- మంత్రుల సమాధానాలు

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): సోమవారం అసెంబ్లీలో జరిగిన గాయం కారణంగా మండలి చైర్మన్ స్వామిగౌడ్ పెద్దల సభకు రాలేకపోవడంతో మండలి డిప్యూటి చైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు అధ్యక్షత వహించారు. మంగళవారం సభలో ఎమ్మెల్సీలు వారి వారి సమస్యలను లేవనెత్తారు. వాటికి సంబంధిత మంత్రులు సానుకూలంగా సమాధానమిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గత కొన్ని ఏండ్లు నష్టాలను ఎదుర్కొంటున విషయంపై ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పురాణం సతీష్ కుమార్, బోడకంటి వెంకటేశ్వర్లు అడుగగా రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి సమాధానమిస్తూ టీఎస్ ఆర్టీసీలో నష్టాలు వాస్తమేనన్నారు. దీనికి గల కారనాలు ఉద్యోగుల వేతనాల్లో 44 శాతం పెరుగుదలను అమలు చేసినందుకు సిబ్బంది పెరిగిందని, 2015లో 4001 మంది ఒప్పంద ఉద్యోగులను క్రమబద్దీకరించామని, వేతన స్కేళ్లలో సవరణపై బకాయిలు చెల్లించినట్టు తెలిపారు. హైస్పీడ్ డీజిల్ ఆయిల్ ధరల పెంపుదల, అప్పులపై చెల్లించిన వడ్డీలు కారణమన్నారు. నష్టాల పూరించడానికి 2013 సవరించిన పే స్కేళ్ల భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం 2015-16, 2016-17 లకు గానూ సంస్థకి సహకారంగా రూ. 428.08 కోట్లు ఇచ్చిందన్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరే షన్ ద్వారా రూ. 336.40 కోట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ విడుదల చేసిందన్నారు. 2017-18 గానూ బస్‌పాస్ రాయితీల రీయింబర్స్‌మెంట్ నిమిత్తం రూ. 520 కోట్ల మొత్తాన్ని సమకూర్చి రూ. 230 కోట్లు విడుదల చేసిందన్నారు. 2015 నుంచి 2017 వరకు బస్సుల కొనుగోలు కోసం రూ.349.93 కోట్లు విడుదల చేసిందన్నారు. 2017-18లో బస్సుల కొనుగోలుకు రూ.70 కోట్లు విడుదల చేసిందన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం అమలుచేస్తున్న కార్యక్రమాల గురించి పాటూరి సుధాకర్‌రెడ్డి, రాములు నాయక్‌లు అడుగగా మంత్రి తుమ్మల సమాధానమిస్తూ... 2017-18 గానూ వృద్ధుల పథకాల కోసం జాతీయ విధానం కింద రూ. 2.04 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పడానికి ఎస్సీ,, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూచీ లేకుండా రుణాల మంజూరుపై డీ. రాజేశ్వరరావు, రాములు నాయక్ అడుగగా మంత్రి కేటీఆర్ సమాధానమిస్తూ... ఎస్సీ ప్లాన్ నుంచి రూ. 200 కోట్లు, ఎస్టీ ప్లాన్ నుంచి రూ. 100 కోట్లు కేటాయించడం ద్వారా రూ. 5 కోట్ల వరకు టీ-ప్రైడ్ పథకంలో ప్రత్యక్ష రుణ పథకాన్ని ప్రతిపాదించిన ట్టు తెలిపారు. కరీంన గర్ పట్టణాభివృద్ధి కోసం పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయంపై పల్లా, నారదాసు లక్ష్మణరావు, భానుప్రసాదరావు అడుగగా కేటీఆర్ సమాధానమిస్తూ... కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ చుట్టు 71 గ్రామాలను వర్తింపు చేస్తూ శాతావాహన పట్టణాభివృద్ధి సంస్థ పేరుతో కరీంనగర్‌కు పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

కవయిత్రి మొల్ల తెలుగువారికి గర్వకారణం

- కుమ్మరులకు ప్రభుత్వం అండగా ఉండాలి
- బీజేపీ ఎమ్మెల్యే లక్ష్మణ్



హైదరాబాద్, మార్చి 13 (మనం ప్రతినిధి): కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్లమాంబ 16వ శతాబ్దంలో రామాయాణాన్ని రచించారని, ఆమె తెలుగు బిడ్డ కావడం మనందరికీ గర్వకారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. మొల్ల జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న మొల్ల విగ్రహానికి లక్ష్మణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి రామకృష్ణుడికి సమకాలికురాలిగా ఆమె గుర్తింపు పొందారని, రామాయణ పద్యకావ్యాన్ని ఐదు రోజుల్లో రచించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. కుమ్మరి సమాజం నేడు తమ కుల వృత్తిని కోల్పోయిందని, మట్టిని నమ్ముకుని జీవించే కుమ్మరి వాళ్లు పూర్తిగా నిర్వీర్యమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు, ఎంబీసీలకు ఈ ప్రభుత్వం ఎలాంటి మేలు చేయడం లేదని విమర్శించారు. ఫెడరేషన్ ద్వారా కుమ్మరులకు రుణాలు మంజూరు చేయాలని, గణపతి ఉత్సవాల సందర్భంగా విగ్రహాల తయారీకి అవసరమైన మట్టిని, భూమిని అందుబాటులో ఉంచాలని, కుమ్మరిల మట్టిపాత్రల తయారీని, వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలని లక్ష్మణ్ కోరారు.

ప్రశ్నోత్తరాలు


ఒకటి నుంచి ప్రజలందరికీ కంటి పరీక్షలు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ కార్యక్రమంలో శాసనసభ్యులు అజయ్, దాసరి మనోహర్‌రెడ్డి, సతీష్, మదన్‌రెడ్డి, కమలాకర్, శ్రీనివాస్ వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి పలు సమస్యలు లేవనెత్తారు. వీటికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి బదులిచ్చారు. రాష్ట్రంలో ఏప్రిల్ 1 8 నుంచి ఇంటింటికీ వెళ్లి కంటి పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు చేశామని లక్ష్మారెడ్డి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. హైదరాబాద్‌లోని నారాయణగూడలో మెడికల్ హబ్‌ను ఏర్పాటు చేశామని, దీనికి అనుబంధంగా నగరంలో మరో 8 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రాల్లోనూ మెడికల్ హబ్‌లు ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా సదరం క్యాంపులు నిర్వహణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 40 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని లక్ష్మారెడ్డి తెలిపారు.

వేసవిలో పశుగ్రాసం సమస్య ఉండదు: తలసాని



హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఇప్పటివరకు ఎన్ని గొర్రెలు పంపిణీ చేశారు, గొర్రెలు విక్రయిస్తున్న వారిపై ఎన్ని కేసులు పెట్టారు, వేసవిలో పశుగ్రాసం కొరత నివారణకు ఏ చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యేలు చెన్నయ్య, వెంకటేశ్, అంజయ్యతో పాటు పలువురు అసెంబ్లీలో ప్రశ్నించారు. ఆయా ప్రశ్నలకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ బదులిచ్చారు. వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 50,44,000 గొర్రెలను పంపిణీ చేశామని చెప్పారు. వైద్య చికిత్సల కోసం వందమొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేశామని వివరించారు.

గల్ఫ్ బాధితులను ఆదుకుంటాం: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): గల్ఫ్‌లో కష్టాలు పడుతున్న కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వంగా కొత్త ఎన్ఆర్ఐ పాలసీని రూపొందించాలని ఎమ్మెల్యే బి. గోవర్ధన్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీలో కోరారు. తెలంగాణ ఉద్యమంలో గల్ఫ్‌లోని ఉంటున్న వారి కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి కేటీఆర్ చెప్పారు.

జర్నలిస్టులకిచ్చిన హామీలేమయ్యాయి: సండ్ర



హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని సండ్ర వెంకట వీరయ్య జీరో అవర్‌లో ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. జర్నలిస్టులు నాలుగేండ్లుగా ఇండ్ల కోసం ఎదురు చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లకన్నా మెరుగైన ఇండ్లను నిర్మిస్తామని వరంగల్, ఖమ్మం జిల్లాల పర్యటనలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటలు నీటి మూటలుగా మారాయని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు.


శాసనసభ్యులు లేవనెత్తిన సమస్యలు

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): అసెంబ్లీలో మంగళవారం నిర్వహించిన జీరో అవర్, ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పలువురు శాసనసభ్యులు కొన్ని సమస్యలను ప్రస్తావించారు.

- హైకోర్టు విభజనలో జాప్యంతో ప్రజలతో పాటు న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ కోరారు.
- కొత్త మునిసిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి హైదరాబాద్ జీహెచ్ఎంసీ తరహాలో నెలకు రూ.12వేలు వేతనం ఇవ్వాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కోరారు.
- ఉప్పల్ బస్ టెర్మినల్ అభివృద్ధి, విస్తరణ విషయాన్ని గత సభ దృష్టికి తీసుకొచ్చానని పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదని ఎమ్మెల్యే ప్రభాకర్ ఆవేదనం వ్యక్తం చేశారు.
- 24 గంటల విద్యుత్‌తో నీటి వాడకం పెరిగిందని, భవిష్యత్తులో ఇది ఇబ్బందులకు దారి తీస్తుందని వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరిపోతుందని ఎమ్మెల్యేలు యాదగిరి రెడ్డి, ఆర్. కృష్ణయ్య అన్నారు.
- చెన్నూర్‌లో బస్‌డిపో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నల్లాల ఓదెలు కోరారు.
- హైదరాబాద్‌లోని మసాబ్‌ట్యాంక్, ఏసీగార్డ్స్ ప్రాంతాల్లో ఇండ్లు, స్థలాల రెగ్యులైజేషన్ విషయంలో ఆర్మీతో ఇబ్బంది కలుగుతుందని ఎమ్మెల్యే మోహినుద్దీన్ తెలిపారు.
- దుమ్ముగూడెం ప్రాంతంలోని చెరువును, ఎదిర ప్రాంతంలోని చర్లవాగును యుద్ధ ప్రాతిపాదికన అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సున్నం రాజయ్య ప్రభుత్వాన్ని కోరారు.
- జూబ్లీహిల్స్ ప్రాంతంలోని రాక్ గార్డెన్‌కు వైఎస్ హయంలో భూమి పూజ జరిగిందని, ఎవరూ పట్టించుకోకపోవటంతో ఆ స్థలం అన్యాక్రాంతమవుతోందని ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి వాపోయారు.
- తామరగద్ద మండలం కొడంగల్ కోర్టు పరిధిలో ఉంది, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నారాయణపేటకు మండలాన్ని బదిలీ చేయాలని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కోరారు.
- ఉస్మానియా వైద్యశాలలో ఖాళీ ప్రాంతంలో కొత్త వైద్యశాల నిర్మించాలని, ధనిక రాష్ట్రం అంటున్న ప్రభుత్వం ఆస్పత్రి నిర్మాణంలో జాప్యం చేస్తుందని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. డ్రైనేజీతో ప్రజలు ఇబ్బందులు పడ్తున్నారని, ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోతే చందాలు వేసి తామే నిర్మిస్తామని తెలిపారు.
- కిషన్‌రెడ్డి పలు అంశాలపై ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ప్రభుత్వం తిరస్కరించింది.

కేసీఆర్‌కు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు

- ఎథిక్స్ కమిటీ వివరణ తీసుకోరా?: చాడ



హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): కేసీఆర్ అహంకారంతో ప్రవర్తిస్తే ప్రజా కోర్టులో శిక్ష తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి, సంపత్ కుమార్‌ల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. సభలోని ఇతర సభ్యులు, ఎథిక్స్ కమిటీ వివరణను తీసుకోకుండా శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయడం సరికాదని చాడ హితవు పలికారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జానారెడ్డి లాంటి సీనియర్ నేత, శాసనసభ ప్రతిపక్షనేతను సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. చిన్న తప్పుకు పెద్ద శిక్ష సరికాదన్నారు. ఇతర పార్టీల నేతలను భయపెట్టి పార్టీలో చేర్చుకున్న కేసీఆర్ నీతిమంతుడిలా మాట్లాడుతున్నారని చాడ ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయింపుదారుల రాజీనామా లేఖలను ఎందుకు పెండింగ్‌లో ఉంచుతున్నారని చాడ ప్రశ్నించారు. స్వామిగౌడ్ కన్నుకు గాయం అయినందుకు సీపీఐ విచారం వ్యక్తం చేస్తోందన్నారు.

తప్పు చేయనివారిపై చర్యలా?


కేసీఆర్ దుర్మార్గపు పాలనకు నిదర్శనం.. పెద్దల సభను దారుణంగా అవమానించారు.. ఇది దారణం.. మండలి చరిత్రలో 'బ్లాక్ డే'

- సభ ముగిసే వరకూ బాగానే ఉన్న స్వామిగౌడ్
- సీఎం సూచిస్తేనే 20 నిమిషాల తర్వాత ఆసుపత్రికి
- కాంగ్రెస్ ఎమ్మెల్సీల ఆరోపణ.. మండలి ఎదుట నిరసన



మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న జానా రెడ్డి, ఉత్తమ్, గీతారెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 13 (మనం ప్రతినిధి): ప్రస్తుతం రాష్ట్రంలో కేసీఆర్ దుర్మార్గపు పాలన నడుస్తోందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సోమవారం జరిగిన ఉభయ సభల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయడమే ఇందుకు నిదర్శమని పేర్కొన్నారు. తమపై సస్పెండ్ వేటు వేసిన అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్సీలు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆకుల లలిత, దామోదర్‌రెడ్డి, సంతోష్‌కుమార్‌లు మీడియా పాయింట్‌లో మాట్లాడారు. తొలుత వారు మండలి భవనం ఎదుట బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్సీలను అందరినీ సస్పెండ్ చేసిన రోజును బ్లాక్ డే గా భావిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పెట్టిన భిక్ష తెలంగాణ అని, ఆ రాష్ట్రానికి సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కేసీఆర్ కాంగ్రెస్ నాయకులపైనే ఈ విధమైన చర్యలు తీసుకోవడం హేయమైన చర్య అన్నారు. సభ ప్రారంభానికంటే ముందే సభలో 200 మంది పోలీసులను మోహరించారన్నారు. సీఎం చెబితేనే ఆసుపత్రికి వెళ్లినట్టు స్వామిగౌడ్ చెప్పాడని తెలిపారు. సభ ముగిసి గవర్నర్‌ను సాగనంపే వరకు బాగానే ఉన్న స్వామిగౌడ్.. 20 నిమిషాల తర్వాత ఆసుపత్రికి పోవడం హాస్యాస్పద మన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా డిప్యూటీ సీఎం కడియం సస్పెన్షన్ తీర్మానం ప్రవేశపెట్టారని, ఏదైనా తప్పుంటే బాధ్యుల పైనా చర్యలు తీసుకోవాలి కానీ, ఏ తప్పు చేయని వారిపై చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. ఈ చర్యతో పెద్దల సభను అవమానపరిచారని, కేసీఆర్ నియంత పాలన కు ఇది నిదర్శమని మండిపడ్డారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఆకుల లలిత మాట్లాడుతూ... ప్రజాస్వామ్యాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఖూనీ చేసిందన్నారు. ఈ విధమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ... సోమవారం జరిగిన సభలో సభ్యులు తక్కువగా, పోలీసులు ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సభ్యులు దురుసు ప్రవర్తించినట్టు ఆధారాలుంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇంత జరిగినా స్వామిగౌడ్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి కాంగ్రెస్ పార్టీ హుందాతనాన్ని నిరూపించుకున్నామని తెలిపారు. టీఆర్ఎస్ దౌర్జన్య, దగాకోరు పాలనను వ్యతిరేకిస్తున్నామనే అధికార బలంతో ఈ విధంగా చేస్తున్నారన్నారు. అసలు తెలంగాణకు కౌన్సిల్ తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. సభలను గౌరవించడం కాంగ్రెస్ నాయకులకు తెలుసన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసి బిల్లు పాస్ చేసుకోవాలని చూస్తున్నారని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి త్వరలో ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పద్దతిగా నిరసన తెలిపితే దానిని రాద్ధాంతం చేయడం సబుబు కాదని సూచించారు. ఈ సస్పెన్షన్‌పై త్వరలో జరిగే ఆల్ ఇండియా కాంగ్రెస్ కౌన్సిల్ చర్చిస్తామని తెలిపారు.



సర్కారు తీరు రాజ్యాంగ విరుద్ధం

- నాపై ఎందుకు వేటు వేశారు?: జానారెడ్డి

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): అసెంబ్లీలో జరిగిన ఘటనలో ఏ సంబంధం లేని తనపైన స్పీకర్ వేటు వేయడం దారుణమని ఏఎల్పీ నేత జానారెడ్డి పేర్కొన్నారు. సభలో జరిగిన ఘటన గవర్నర్ పరిధిలోనిదని చెప్పారు. అదేసమయంలో సస్పెన్షన్లు రాజ్యాంగ వ్యతిరేక చర్య అని జానా తెలిపారు. తెలంగాణ సర్కారు తీరు రాజ్యాంగ విరుద్ధమన్నారు. సభలో చర్చించకుండా, ఎథిక్స్ మీటింగ్‌ను సంప్రదించకుండా, అన్ని పార్టీలతో చర్చ జరపకుండా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. స్పీకర్ తమ వివరణ కోరకపోవడం విచారకరమని, సంప్రదాయాలకు విరుద్ధంగా స్పీకర్ నిర్ణయం తీసుకున్నారన్నారు. బడ్జెట్‌లో లోపాలను ఎత్తిచూపుతామనే ఆందోళనతోనే సభలో తమను లేకుండా చేస్తున్నారని జానారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేయాలని చూస్తోందని విమర్శించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా బుధవారం మండల కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు జానారెడ్డి తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయడం దారుణమని, అప్రజాస్వామిక చర్య అని కాంగ్రెస్ ఎమ్మెల్యే డికె అరుణ మండిపడ్డారు. సభలో నిరసన వ్యక్తం చేయడం, విమర్శలు సర్వసాధారణమని, నిబంధనలకు విరుద్ధంగా సభ్యులపై చర్యలు తీసుకోవడం హేయమైన చర్యన్నా రు. ప్రధాన ప్రతిపక్షాన్ని సస్పెండ్ చేయడం పద్ధతి కాదన్నారు. కాగా, స్వామిగౌడ్ కంటికి నిజంగా దెబ్బతగిలితే, 24 గంటలు గడిచినా సీసీకెమెరా పుటేజీని ఎందుకు బయటపెట్టడంలేదని ఎమ్మె ల్యే జీవన్ రెడ్డి ప్రశ్నించారు. సభ్యుల సభ్యత్వ రద్దుపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఉన్న ఆరు కెమెరాల పుటేజీని బయటపెడితే అసలు విషయాలు బయటపడతాయని, వెంటనే కెమెరాల పుటేజీని చూపించాలని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒక వేళ తప్పు జరిగితే శాసనసభలో చర్చించి చర్యలు తీసుకోవాలని, అలా కాకుండా ప్రభుత్వం ఏదో హడావిడిగా రాజకీయ లబ్ది కోసం చర్యలు తీసుకుందన్నారు.

నేను దాడి చేయలేదు

స్పీకర్ నిర్ణయం ఏకపక్షం
విశ్వరూపం చూపిస్తా: సంపత్



హైదరాబాద్, మార్చి 13 (మనం ప్రతినిధి): అసెంబ్లీలో తాను ఎవరిపైనా దాడి చేయలేదని, చేసినట్లు లేకున్నా తన శాసన సభ్యత్వాన్ని స్పీకర్ రద్దు చేశారని సంపత్ కుమార్ ఆరోపించారు. స్పీకర్ ఏకపక్షంగా తనపై వేటు వేశారని పేర్కొన్నారు. శాసన సభ్యత్వాన్ని రద్దు చేసిన అనంతరం మీడియా పాయింట్‌లో సంపత్‌కుమార్ మాట్లాడారు. తాను హెడ్‌ఫోన్స్ విసరలేదని, అలా విసిరినట్లు చూపితే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించానని, అయినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. స్వామిగౌడ్‌కు హెడ్ ఫోన్స్ తగులుతున్న దృశ్యాలు ఎక్కడా విడుదల కాలేదని, ఒకవేళ అలాంటి దృశ్యాలు ఉంటే తమకు చూపించాలని అన్నారు. ఎమ్మెల్యేగా సభ్యత్వం కోల్పోతే తన విశ్వ రూపం ఏమిటో చూపిస్తానని టీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు.

సభ్యత్వం రద్దు సరికాదు

- ప్రభుత్వానిది ఏకపక్ష ధోరణి
- విపక్షాలను సంప్రదించకుండానే నిర్ణయమా?
- ప్రశ్నిస్తారనే ఇలాంటి చర్యలు: టీడీపీ, బీజేపీ
- సభను బహిష్కరించిన ఇరు పార్టీల ఎమ్మెల్యేలు



మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): కాంగ్రెస్ సభ్యుల శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేయడం సరికాదని టీడీపీ, బీజేపీలు అభిప్రాయపడ్డాయి. ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవమరిస్తోందని, ప్రశ్నిస్తారనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వం రద్దుకు నిరసనగా సభను బహిష్కరించిన అనంతరం టీడీపీ, బీజేపీ నేతలు ఆర్.కృష్ణయ్య, సండ్ర వెంకటవీరయ్య, కిషన్ రెడ్డి, ఎన్వీస్ ప్రభాకర్ తదితరులు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా ప్రభుత్వం కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయించిందని, ఇది అప్రజాస్వామికమని వారు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని కృష్ణయ్య మండిపడ్డారు. ప్రజా సమస్యలపై నిరసన తెలపకుండా ధర్నాచౌక్‌లను ఎత్తివేసిన ప్రభుత్వం, సభ్యులను సస్పెండ్ చేయడం ద్వారా అసెంబ్లీని హైజాక్ చేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. చట్ట సభల్లో నిరసనలు తెలపడం సహజమని, సభ్యులు గీత దాటారని భావిస్తే సీసీటీవీ పుటేజీలను పరిశీలించి, అన్ని పక్షాలతో మాట్లాడి, అవసరమైతే ఎథిక్స్ కమిటీ అభిప్రాయాన్ని తీసుకున్నాక నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇవేమీ చేయకుండానే ఏకపక్షంగా సస్పెన్షన్ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. నిరుద్యోగం, ఉద్యోగాల భర్తీ, మూడెకరాల భూ పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, తదితర అంశాలపై ప్రశ్నిస్తారన్న భయంతోనే కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సభ్యుల సస్పెన్షన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అందర్నీ కలుపుకుని వెళ్లినప్పుడే సభకు గౌరవం ఉంటుందని సండ్ర వెంకటవీరయ్య హితవు పలికారు. ఘటనపై జానారెడ్డి విచారం వ్యక్తం చేసినప్పటికీ ఆయన్ను సభలో మాట్లాడనివ్వకపోవడం సరికాదన్నారు. ఎంఐఎం, బీజేపీ మినహా మిగతా పక్షాలను సభలో మాట్లాడనివ్వలేదని సండ్ర ఆరోపించారు. సోమవారం సభలో కాంగ్రెస్ తీరు సరికానప్పటికీ, జానారెడ్డి వంటి సీనియర్ నేతపై సస్పెన్షన్ వేటుకు నిరసనగా సభను ఒక్కరోజుపాటు బహిష్కరిస్తున్నామని కిషన్‌రెడ్డి ప్రకటించారు.

కాంగ్రెస్ నేతలు టెర్రరిస్టులను తలపించారు

- స్పీకర్‌పై దాడికి నాయకుడు జానారెడ్డే: మంత్రి జగదీశ్ రెడ్డి




మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్ రెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 13 (మనం ప్రతినిధి): కాంగ్రెస్ శాసనసభ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకునే అధికారం శాసనసభ స్పీకర్‌కు ఉందని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడారు. సోమవారం జరిగిన సభలో కాంగ్రెస్ నేతలు ప్రవర్తించిన తీరు అకస్మాత్తుగా జరిగింది కాదని, ఒక పథకం ప్రకారమే దాడి జరిగిందని ఆరోపించారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతల తీరు టెర్రరిస్టులను తలపిస్తున్నారని విమర్శించారు. స్పీకర్‌పై దాడి అంతా జానారెడ్డి నాయకత్వంలోనే జరిగిందని, ఆయనే ముఠా నాయకుడని జగదీశ్ రెడ్డి అన్నారు. సభలో దాడి అనంతరం కాంగ్రెస్ సభ్యులు ఏదో విజయం సాధించామన్న భావనతో షేక్‌హ్యాండ్ ఇచ్చుకుని, సంబరాలు చేసుకున్నారన్నారు. సభలో దాడుల వల్ల రాష్ట్ర ప్రగతికి భంగం కలుగుతుందని, తన తోటి సభ్యులకు జానారెడ్డి చెప్పలేకపోయారన్నారు. చేసిందంతా చేసి తనను ఎందుకు సస్పెండ్ చేశారని అమాయకంగా ప్రశ్నిస్తున్నారన్నారు. గవర్నర్‌ను కొడదామని వచ్చానని, స్వామిగౌడ్‌ను కాదని స్వయంగా కోమటిరెడ్డి చెప్పారన్నారు. సభలో ప్రతిపక్షం తీరు బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల మేరకే స్పీకర్ వారిని సస్పెండ్ చేశారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి తమ వద్ద సబ్జెక్టు ఏమీ లేకపోవడంతో అసెంబ్లీ నుంచి పారిపోయేందుకు కాంగ్రెస్ నేతలు ఈ ప్రయత్నం చేశారన్నారు. ఆరోగ్యకరమైన ప్రతిపక్షం ఉంటేనే పాలన మెరుగవుతుందని సీఎం కేసీఆర్ ఎప్పుడూ అంటుంటారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై చర్చకు వస్తే స్వాగతిస్తామని, వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని మంత్రి జగదీశ్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శం

- సీఎం కేసీఆర్ గొప్ప రాజనీతిజ్ఞుడు
- దేశ తలసరి ఆదాయం కంటే రాష్ట్రానిదే ఎక్కువ: కొప్పుల ఈశ్వర్
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై చర్చ




హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలన దేశానికే ఆదర్శమని, గవర్నర్ ప్రసంగంలో తెలంగాణ అభివృద్ధి ముఖచిత్రం కనిపిస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ అన్నారు. అసెంబ్లీలో మంగళవారం టీ విరామం అనంతరం గవర్నర్ ప్రసంగంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. రాష్ట్రంలో రూ.40వేల కోట్లతో 35 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు 4 శాతంగా ఉంటే, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు 8 శాతానికి పెరిగిందన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశ తలసరి ఆదాయం1.03 లక్షలు ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం 1.56 లక్షలుగా ఉందని వివరించారు. రాష్ట్రంలో రైతులను ఆదుకునేందుకు రూ.17వేల కోట్ల రుణమాఫీ చేశామని, దీని ద్వారా 35 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని తెలిపారు. 2016-17లో 1.29 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయ్యాయని, 23 లక్షల పంపుసెట్లకు 24 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. 24 గంటల విద్యుత్ ఇచ్చే రాష్ట్రం దేశంలో ఎక్కడాలేదని, 12931 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. 3283 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నామన్నారు. టీఎస్ఐపాస్ ద్వారా 1.18లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. హరితహారం ద్వారా పచ్చదనాన్ని పెంచామన్నారు. కేసీఆర్ కిట్ ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను 49శాతానికి పెంచామన్నారు. అంతకుముందు కొప్పుల ఈశ్వర్ గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానం ప్రతిపాదించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్ బలపరిచారు.

46 నెలల్లోనే రాష్ట్ర ప్రగతి: వివేకానంద్ గౌడ్



60 ఏళ్లలో తెలంగాణలో కనిపించని అభివృద్ధిని రాష్ట్ర విభజన జరిగిన 46 నెలల్లోనే కేసీఆర్ చూపించారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్ అన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని ఆయన బలపరిచారు. దేశంలో సుస్థిర అభివృద్ధి జరుగుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పలువురు మేధావులు ఆయా సందర్భాల్లో చెప్పినట్టు గుర్తు చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండగలా మారిందన్నారు. స్పీకర్ ఆధ్వర్యంలో శాసనసభ్యులందరినీ కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు తీసుకెళ్లాలని కోరారు. కేసీఆర్ తీరును ప్రతిపక్షాలు విమర్శిస్తున్నా అంతర్గతంగా సమర్థిస్తున్నాయని చెప్పారు.

పాతబస్తీని అభివృద్ధి పరచాలి: అక్బరుద్దీన్



గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ పాతబస్తీని అన్నిరకాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. పాత బస్తీ పర్యాటక ప్రాంతమని, పర్యాటకులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైదరాబాద్‌కు మెట్రో రైలును తీసుకొచ్చేందుకు కారణం ఎంఐఎం పార్టీ అని, అలాంటిది పాతబస్తీకి మెట్రో రైలును పొడగించడకపోవడం దారుణమని తెలిపారు. వాటర్‌వర్క్స్, విద్యుత్ శాఖలు అవలంబిస్తున్న విధానాల్లో మార్పులు రావాలన్నారు. రాష్ట్రంలో కరెన్సీ సమస్య ఉందని, ప్రభుత్వం దీనిపై ఏమి చేసిందని ఆయన ప్రశ్నించారు.

ఆర్టీసీ బస్సులో అసెంబ్లీకి ఎన్వీఎస్

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): ఉప్పల్ బీజేపీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మంగళవారం ఆర్టీసీ బస్సులో అసెంబ్లీ సమావేశాలకు వచ్చారు. ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. కాగా... ఉప్పల్‌లో నూతన బస్ టెర్మినల్ విషయంలో రవాణా శాఖ మంత్రి మాట ఇచ్చి తప్పినందున నిరసనగా నేను ఆర్టీసీ బస్సులో అసెంబ్లీకి వచ్చానని ఎమ్మెల్యే ప్రభాకవర్ తెలిపారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ: రామచందర్‌రావు

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): గత ఏడాది గవర్నర్ ప్రసంగం 37 పేజీలు ఉందని, ఈ ఏడాది 25 పేజీలుందని, పేజీలు తగ్గాయంటే ప్రభుత్వ పనితీరుకూడా తగ్గిందని భావించ వచ్చని బీజేపీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు అన్నారు. గవర్నర్ ప్రసంగంలో చెప్పిన విధంగా ప్రభుత్వం హామీలు నెరవేర్చలేదన్నారు. వ్యవసాయం రంగంలో అన్ని బాగుంటే 3000మంది రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకు న్నారని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేసిన సహాయం గురించి ప్రస్తావనే లేదన్నారు. ఉద్యోగా నియామకాల్లో జాప్యంపై ప్రశ్నించారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

బుధవారం, మార్చి 14

నిరసన కేంద్రాలుగా చట్టసభలు


'ఏదేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం' అన్నట్టు ఏ చట్టసభ పని తీరు చూసినా ఏమున్నది చెప్పుకునేందుకు? మూడు గలభాలు, ఆరు వాయిదాలు తప్ప... ప్రజాసమస్యలు గాలికి, ప్రజల ఈతిబాధలు నీటిమీద రాతలుగా మారి సామాన్యుడు ఎందుకీ చట్టసభలు అనే స్థితిలో కొనసాగుతున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఏ పార్టీ పాలకపక్షంలో ఉన్నా అదే తీరు... అదే హోరు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము చేసిన గందరగోళాన్ని అధికారంలోకి వచ్చేసరికి సదరుపార్టీ మరిచి నీతులు వల్లిస్తుంది. గతంలో మన్‌మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాన్ని పార్లమెంట్‌లో ముప్పుతిప్పలు పెట్టిన బీజేపీ నేడు నీతులు చెబుతోంది.

కేంద్రంలోని పార్లమెంట్‌గానీ, రాష్ట్రాల్లోని చట్టసభలుగానీ సజావుగా ఒక్క నిమిషం కూడా జరిగిన దాఖలాలు లేవు. గత ఐదో తేదీ నుంచి మొదలైన పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు ఇంతవరకు ఏ ఒక్క అంశాన్నీ చేపట్టలేకపోయింది. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిదంటూ తెలుగుదేశం పార్టీ సభ్యులు నిత్యం ఉభయసభల్లోను గందరగోళం సృష్టిస్తుండగా, తెలంగాణలో రిజర్వేషన్ల అంశంపై టీఆర్‌ఎస్, కావేరీ జలాల సమస్యపై తమిళనాడుకు చెందిన అన్నా డీఎంకె సభ్యులు, బ్యాంకుల కుంభకోణంపై తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకోవడంతో రెండుసభలూ ఒక్క అంశాన్ని కూడా చేపట్టలేక వాయిదాలు పడుతూనే ఉన్నాయి. జాతీయ స్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రాల స్థాయిలో చట్టసభల్లో ప్రజాప్రతినిధుల ప్రవర్తన మరింత జుగుప్సాకరంగా ఉంటోంది. సోమవారం తెలంగాణ అసెంబ్లీలో జరిగిన గందరగోళం, విధ్వంసం సభ్య సమాజాన్ని విస్తుగొలిపింది. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగం మొదలుపెట్టగానే కాంగ్రెస్ సభ్యులు తీవ్ర గందరగోళం సృష్టిస్తూ పేపర్లను చింపి విసిరేస్తూ, గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే యత్నంలో ఘర్షణ వాతావరణాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో గవర్నర్‌పైకి కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి విసిరినట్టుగా చెబుతున్న హెడ్‌ఫోన్స్ తగిలి శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయమైంది. దీంతో ఆగ్రహించి జానారెడ్డి సహా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గీతారెడ్డి, డికె అరుణ తదితర 11మందిని బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్‌చేస్తూ మంగళవారం అసెంబ్లీ తీర్మానించింది. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల శాసనసభ్యత్వాన్ని రద్దుచేస్తున్నట్టు సభాపతి మధుసూదనాచారి ప్రకటించారు. మండలి చైర్మన్‌పై తాము దాడిచేయలేదని, తమ వాదన వినకుండానే చర్యలు తీసుకున్నారంటూ కాంగ్రెస్ ప్రతిదాడి చేస్తోంది. సభలో ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీసే హక్కును ప్రతిపక్షం ఎందుకిలా పోగొట్టుకుంటోంది? ప్రభుత్వానికీ కావలసింది ఇదే. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఏదోలా విపక్షాన్ని రెచ్చగొట్టి సభాకార్యక్రమాలను వాయిదా వేయించడం పరిపాటిగా మారింది. దీంతో ప్రజాసమస్యలు గాలికి కొట్టుకుపోతున్నాయి. 15వ లోక్‌సభ సమావేశాల్లో దాదాపు 92 గంటల పాటు సభాకార్యక్రమాలు స్తంభించాయి. పార్లమెంట్ ఉభయసభల నిర్వహణకు నిమిషానికి రెండున్నర లక్షల రూపాయల ప్రజాధనం వ్యయమవుతోంది. ప్రభుత్వ విధానాలపై ప్రజల భాగస్వామ్యంతో రాజకీయ పక్షాలు నిరసనోద్యమాలు చేపట్టడం మాని ప్రజాసమస్యలపై సమగ్రంగా చర్చించి విధానాలను రూపొందించవలసిన చట్టసభల్లో కెమెరాల ముందు వీరంగం వేయడంపై కేంద్రీకరిస్తున్నాయి. దాంతో చట్టసభలు ధర్నాచౌక్‌లుగా, నిరసన ప్రదేశాలుగా మారిపోయాయి.

ప్రజాసమస్యలను లేవనెత్తే అంశాన్ని ప్రతిపక్షం ఆలోచించదు...ప్రజాసమస్యలపై తగురీతిలో స్పందిద్దామని ప్రభుత్వమూ యోచించదు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారివి. చట్టసభలు మొదలవుతున్నాయనగానే ప్రజలు చప్పరించే స్థాయికి చేరుకున్నారు. ప్రజాప్రతినిధుల తీరుచూసిన తరువాత చట్టసభల సమావేశాల వల్ల ఒరిగేదేమిటన్నది వేయి డాలర్ల ప్రశ్నగా తొలుస్తుంటుంది. ప్రతిపక్షం ఇచ్చిన ఏ ఒక్క వాయిదా తీర్మానాన్నీ చట్టసభల్లో చర్చకు తీసుకోరు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలపై చర్చకు ప్రతిపక్షం అంగీకరించదు. ఎవరి ఇగోలు వారివి. ఎవరి పట్టుదలలు వారివి. ఒకరిపై మరొకరు పైచేయి సాధించాలన్న మొండివైఖరి తప్ప! తీరుమార్చుకోలేని ప్రజాప్రతినిధుల వైఖరితో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్న ఆశలు ఆవిరి అవుతున్నాయి.



మంచిమాట



'వైఫల్యాల నుంచే విజయాలు వస్తాయి. కాకపోతే ప్రయత్నాలు మారతాయి.'

- డేల్ కార్నెగీ

తెలంగాణలో నంద్యాల ప్రయోగం

ప్రజల్లో తేల్చుకుందామంటున్న కాంగ్రెస్ నాయకులకు టీఆర్‌ఎస్ ప్రతిసవాలు చేస్తోంది. తెలంగాణ ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏ ఉపఎన్నికలోనూ కాంగ్రెస్ గెలవలేదు.

బడ్జెట్ సమావేశాల తొలిరోజు శాసనసభ, మండలి ఉమ్మడి భేటీలో జరిగిన హింసాత్మక ఘటనలు ఉపఎన్నికలకు బీజంవేసే అవకాశాలు ఉన్నాయి. టీఆర్‌ఎస్ కోరుకుంటున్నట్టుగా నల్లగొండ, ఆలంపూర్ శాసనసభ స్థానాలకు ఉపఎన్నికలు వస్తే నిస్సందేహంగా వాటిని 2019 ఎన్నికలకు ముందు సెమీఫైనల్స్‌గా భావించవచ్చు. నల్లగొండ, ఆలంపూర్‌ల నుంచి శాసనసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దుచేస్తున్నట్టు తెలంగాణ అసెంబ్లీ తీర్మానించడంపై తీవ్ర దుమారం చెలరేగుతున్నది.

తెలంగాణలో ఇప్పటివరకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికారపార్టీ సత్తా చాటింది. ఇప్పుడు మరోసారి ప్రయోగానికి టీఆర్‌ఎస్ రెడీ అవుతోంది. తెలంగాణలోనూ నంద్యాల లాంటి పోరు తప్పేలా లేదు. ఉప ఎన్నికల స్పెషలిస్ట్ పార్టీగా గుర్తింపు పొందిన పార్టీ టీఆర్‌ఎస్ మరోసారి అదేదారిని ఎంచుకునేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. టీఆర్‌ఎస్ అధికార పగ్గాలు చేపట్టి నాలుగేళ్ళు కావస్తున్నందున ఓటర్ల నాడిని తెలుసుకునేందుకు ఉప ఎన్నికలు అనివార్యం అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు భావిస్తున్నారు.

శ్రేణులను సిద్ధంచేస్తున్న కేసీఆర్

ఉపఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్‌ను కోలుకోకుండా దెబ్బ తీయాలని అధికారపార్టీ తలపోస్తున్నది. అందుకే నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లా నాయకులను కేసీఆర్ మంగళవారం అప్రమత్తం చేశారు. నల్లగొండ, ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు తథ్యమని అధికారపక్షం భావిస్తున్నది. అతిత్వరలో జరగనున్న కర్ణాటక ఎన్నికలతో పాటు ఈ రెండు సెగ్మెంట్లకు ఎన్నికలు జరగవచ్చునని అసెంబ్లీ వ్యవహారాల మంత్రి హరీష్‌రావు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల నిపుణుడు. తెలంగాణ సాధనలో ఎన్నికలను కూడా పోరాటరూపంగా మలచిన శిల్పి కేసీఆర్. ఆయన గెరిల్లా వ్యూహాలు ఎలా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. పోల్ మేనేజ్‌మెంట్‌లో అత్యుత్తమ వ్యూహాలు పన్నే ముఖ్య నేతల్లో కేసీఆర్ ఒకరు. నిజానికి ఎన్నికలతో తెలంగాణ ఉద్యమాన్ని ఆయన ముందుకు తీసుకెళ్ళారు. ఎప్పటికప్పుడు ఉప ఎన్నికలు వచ్చేలా చేసి తెలంగాణ ఉద్యమాన్ని లైవ్‌లో ఉంచారు. ఆయా ఎన్నికల్లో ఓటమిపాలైతే.. తెలంగాణ ఉద్యమం ఫెయిల్ అయినట్లేనన్న భావన కలుగజేశారు. ఆయన సక్సెస్ మంత్రం అది. తెలంగాణ రాష్ట్రం కోసం సుదీర్ఘకాలంగా ఉద్యమం జరిగినప్పటికీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఎన్నికలు కీలక భూమిక పోషించాయి. ఎన్నికల వేళ ఎలాంటి నినాదాన్ని తెరమీదకు తీసుకురావాలో కేసీఆర్‌కు బాగా తెలుసు. మరో ఏడాది వ్యవధిలో సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్నందున గెలుపు గుర్రాల ఎంపిక ప్రక్రియను ఆయన ప్రారంభించారు. టికెట్లు ఫైనల్ చేయటానికి ముందస్తు కసరత్తులో భాగంగా టికెట్ల పంపిణీని మూడువిధాలుగా విభజించారు. పక్కాగా టికెట్లు ఇవ్వాల్సిన వారు మొదటి క్యాటగిరీ. ఇందులో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు, ఈటెల, కడియం లాంటి వాళ్లు ఉండవచ్చును. ఇలాంటి నియోజకవర్గాలు మొత్తం 28 ఉన్నట్లుగా తేలింది. ఇక ఇద్దరేసి బలమైన అభ్యర్థులు ఉన్న నియో జకవర్గాలుగా 70 ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురేసి అభ్య ర్థులు పోటీపడుతున్న ని యోజకవర్గాలు 20 ఉన్నట్లుగా తేలింది. తెలంగాణలో మొత్తం 119 అసెంబ్లీ స్థానాలలో ఈసారి తొంబై నుంచి తొంభైఐదు స్థానాలకు టీఆర్‌ఎస్ టార్గెట్ చేసింది. ఈసారి క్లీన్‌స్వీప్ చేయాలని సీఎం భావిస్తున్నారు. ఎన్నికల వ్యూహాన్ని పక్కాగా రచిస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో కేసీఆర్ జాతీయ రాజకీయాల గురించి తరచూ మాట్లాడుతున్నారు. తనతో పాటు కొందరు 'సమర్థులను' ఢిల్లీకి తీసుకు వెళ్లాలని అనుకుంటున్నట్టు ఆయన టీఆర్‌ఎస్‌ఎల్‌పీ సమావేశంలో వెల్లడించారు. ఎవరెవరిని పార్లమెంటుకు పోటీకి దింపుతారో ఆయన అంతరంగం బహిర్గతం కావడం లేదు. దాన్ని బట్టి లెక్కలు మారతాయి.



ఇప్పటికే నిఘావర్గాలు నియోజకవర్గాల వారీగా పోటీపడుతున్న అభ్యర్థుల బలాబలాల మీద నివేదిక ఇచ్చాయి. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సెకండ్ ఓపీనియన్ కూడా తెప్పించినట్లుగా చెబుతున్నారు. ఇప్పటికి పదిసార్లు నియోజకవర్గాల వారీగా సర్వేలు జరిపారు. వీటి ఫలితాల్ని వడబోశారు. చివరిక్షణం ఎంపికలు, అసంతృప్తులు, అలకలు, బుజ్జగింపులు లేకుండా చూసుకునేందుకు తొమ్మిది నెలలకు ముందే అభ్యర్థుల్ని కన్ఫర్మ్ చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. మిగిలిన రాజకీయ పార్టీలకు భిన్నంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందే ప్రకటించి గెలుపు గుర్రాలుగా తయారు చేయాలన్నది ఆయన భావన. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర సమితిపై వ్యతిరేక పవనాలు లేవు.

కేసీఆర్‌కు తిరుగులేదు

మూడున్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి ఏకఛత్రాధిపత్యం కొనసాగుతున్నది. కేసీఆర్‌కు తెలంగాణ సమాజంలో తిరుగులేదు, రాజకీయ నేర్పుకు ఎదురులేదనే అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి. కేసీఆర్‌కు తిరుగులేదనే భావన అన్నీ వర్గాల నుంచి వ్యకమవుతున్నాయి. తెలంగాణలో ప్రధానంగా కాంగ్రెస్, టీఆర్‌ఎస్ మధ్యనే కేంద్రీకృత మైంది. బడుగు బలహీన వ ర్గాలకు చెందిన శాసన మం డలి చైర్మన్ స్వామిగౌడ్ మీ ద దాడిచేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి జరిపిన దాడిని రాజకీయంగా వాడుకోవడా నికి టీఆర్‌ఎస్ తీవ్రంగా ప్ర యత్నిస్తున్నది. కొన్నిచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేల తీరుపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నమాట వాస్తవం. అయితే సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఇస్తానని కేసీఆర్ పలుమార్లు ప్రకటించారు.

ద్విముఖం దిశగా వ్యూహం

ప్రభుత్వ వ్యతిరేక ఓటు, తెరాస వ్యతిరేక ఓటు చీలకుండా త్రిముఖపోరు లేకుండా, ద్విముఖ పోరు మాత్రమే ఉండేలా చూసుకున్నారు. ఓట్ల చీలికకు అవకాశం లేదు. తెలుగుదేశాన్ని పూర్తిగా ఖాళీచేసి కాంగ్రెస్‌తో ముఖాముఖీ పోరాటంగా పరిస్థితులుగా మార్చారు. ఏ విషయంలో అయినా కేసీఆర్ సాధికారికంగా, గట్టిగా మాట్లాడతారు. పండితుడికి, పామరుడికి కనెక్ట్ అయ్యేలా మాట్లాడతారు. అసెంబ్లీలో స్పీకర్ తీసుకున్న నిర్ణయం అప్రజాస్వామికం. సంప్రదాయాలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకున్నారని, స్పీకర్ ఉటంకించిన చట్టంలోనూ స్పష్టత లేదని ప్రతిపక్ష నాయకుడు జానారెడ్డి అన్నారు. గవర్నర్ సమక్షంలో జరిగిన ఘటనలపై స్పీకర్ ఎలా నిర్ణయం తీసుకుంటారని ఆయన ప్రశ్నిస్తున్నారు. నియమ నిబంధనలను పాటించకుండా ప్రధాన ప్రతిపక్షాన్ని సస్పెండ్ చేయడం తగదన్నారు. మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దుచేయడం రాజ్యాంగ విరుద్ధమని జానారెడ్డి విమర్శించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని వెలుగులోకి తీసుకు వస్తామని చెప్పారు.

రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తాం

గతంలో సెక్యూరిటీ సిబ్బందిని దాటుకొని హరీష్‌రావు గవర్నర్ పైకి దూసుకెళ్లినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హుందాగా వ్యవహరించిందని ప్రతిపక్ష నాయకుడు గుర్తుచేశారు. శాసనసభలో గతంలో ఎన్నడూ జరగని విధంగా ప్రస్తుత నిర్ణయాలున్నాయన్నారు. సభలో జరిగిన ఘటనలను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లనున్నట్టు కూడా జానారెడ్డి ప్రకటించారు. ఉద్యమానికి, ఉన్మాదానికి చాలా తేడా ఉంది. ఆ రోజు మా కొట్లాట 60 ఏళ్ల ఆకాంక్ష కోసం. ఈ రోజు మీ కొట్లాట అధికార దాహం కోసం' అని హరీష్‌రావు కౌంటర్ ఇచ్చారు. 'ప్రజలు అన్నింటిని గ్రహిస్తున్నారు. ప్రజాకోర్టులో తేల్చేస్తారు. అధికారం కావాలంటే ప్రజలు కరుణించాలి, ప్రజల తీర్పు ఉండాలి. అంతేగానీ అసహనంతో అహంకారం ప్రదర్శిస్తే ప్రజలు హర్షించరు. భవిష్యత్‌లోనూ అధి కారం రాదని తేలడంతో అధికారానికి దూరమైన కాంగ్రెస్ నేతలు అసెంబ్లీలో రౌడీయిజం చేశారు. రాజ్యాంగ పరిరక్షకులైన గవర్నర్‌ను, స్పీకర్‌ను, మండలి చైర్మన్‌ను కొట్టాలనుకోవడం ప్రజాసామ్య మా? అప్రజాస్వామికమా?' అని మంత్రి హరీష్‌రావు అంటున్నారు. గతంలో తాము గవర్నర్‌పై దాడిచేశామని ఆరోపిస్తున్నారని, నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష. సమైక్య పాలకుల మీద తాము నిరసన తెలిపినట్టు హరీష్‌రావు గట్టిగా సమ ర్థించుకున్నారు. ప్రజల్లో తేల్చుకుందామంటున్న కాం గ్రెస్ నాయకులకు టీఆర్‌ఎస్ ప్రతిసవాలు చేస్తోంది. తెలంగాణ ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏ ఉపఎన్నికలోనూ కాంగ్రెస్ గెలవలేదు. 'నిన్న మాదే... నేడూ మాదే... రేపు కూడా మాదే..' అని తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు చెబు తున్నారు.!

ఎస్.కె.జకీర్

ప్రజా ప్రత్యామ్నాయమే ప్రధానం

భారతదేశంలో ప్రత్యామ్నాయ కూటముల ఏర్పాటు అనేది కొత్తదేమి కాదు. గతంలో ఇలాంటివి రావడం, దేశాన్ని భ్రష్టుపట్టించడం, అభివృద్ధి దిశను కుంటుపడేయటం జరిగింది. దీనిని గాడిలో పెట్టే దిశలో పి.వి.నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఆర్థికమంత్రిగా ఎంతో కష్టపడాల్సి వచ్చింది. జయటి దేశాల డబ్బు నిలువలు సున్నాకు రావడం జరిగింది. అంటే ప్రత్యామ్నాయం ముఖ్యం కాదు, వ్యక్తులు ముఖ్యం. గత బడ్జెట్ సమావేశాల కాలంలో అధికార పార్టీపై ఉమ్మడి పోరాటం చేయాలని ప్రతిపక్ష నేతలు ముందుకువచ్చాయి. దీనినే మళ్లీ సోనియాగాంధీ ముందుకు తెచ్చింది. ఇప్పుడు మూడు ఈశాన్య రాష్ట్రాలకు జరిగిన ఎన్నికలకు ముందు, కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో సీపీఎం రెండు గ్రూపులుగా చీలిపోవడం వల్ల త్రిపుర రాష్ట్రంలో సీపీఎం దెబ్బతిన్నది, బీజేపీ విజయం సాధించింది. ఇది రెండు కోతులు-ఒక పిల్లి కథలాంటిదే! మేఘాలయలో కాంగ్రెస్ మొదటిస్థానంలో నిలిచినా, చిన్నా చితక పార్టీల వల్ల రెండవ స్థానంలో ఉన్న (గతంలో కాంగ్రెస్ వారే) పార్టీకి అధికారం వచ్చింది. ఇక్కడ బీజేపీ జబ్బలు చరుచుకుంది. కానీ వారికి వచ్చింది రెండుస్థానాలే. అలాగే మిజోరామ్‌లో ప్రాంతీయ పార్టీ రెండుగా చీలి, ఒకటి బీజేపీ పంచన చేరి పట్టం కట్టించుకుంది. ఇక్కడ ప్రజల తీర్పుకు ఎలాంటి విలువ ఉండటం లేదు, కానీ అనైతిక కలయికలకు విలువ ఉంటున్నది. ఇలాంటి అనైతిక కలయికలు దేశం మొత్తంలో చూడవచ్చు. ఇలాంటి వ్యవస్థ రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా చూడవచ్చు. అలాంటి విలువలకు తిలోదకాలిచ్చే ప్రభుత్వాలతో మూడవ కూటమి ఏర్పాటు అంతకంటే అనైతికంగా మారుతుంది. ఎందుకంటే ప్రతి ఒక్కరికి పదవులు కావాలి, అంటే ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. బీజేపీ దేశానికి అరిష్టమైతే, కాంగ్రెస్ అభివృద్ధిబాట పట్టినా, ప్రాంతీయం గా నాయకుల పొట్లాటలు ఎక్కువ. దీనితో అభివృద్ధి జరిగినా ప్రజలకు దూరమౌతున్నారు. కేసీఆర్ మూడవ కూటమి గురించి మాట్లాడు తున్నారు, కానీ ఆయ న తన రాష్ట్రంలో ప్రతిపక్షాలను సంప్రదింపులు జర పరు. తన మంత్రివర్గంలో ఒక వనితకు కూడా స్థానం లభించలేదు. ఓటు రాజకీయానికే ప్రాధాన్యం. రాజభవనాల నిర్మాణాలకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తెలంగాణాలో మూడున్నర కోట్ల జనాభాలో 35 శాతం దాకా ఒకే పట్టణం, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. జిల్లా లను మూడు రెట్లకుపైగా చేసి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. నీటి వనరులను నాశనం చేసుకుంటూ పోతున్నారు, దీనిలో భాగంగా తాగునీటి వనరుల (రెండు జలాశయాలను) వదలటం లేదు. అంటే మూడవ ప్రత్యామ్నాయం ఈ దిశలో పయనిస్తుందా? మురికి నీళ్లశుద్ధి దిశలో పురోగతి లేదు, కానీ శుద్ధిచేసిన నీటిని తాగునీటిలో కలుపుతామంటారు. కాలుష్యం రోజురోజుకూ పెరుగుతూ పోతున్నది. పెరుగుతున్న జనాభా అవసరాల కోసం ఆహార ఉత్పత్తి జరిగింది. మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసు కున్నాం. విద్య, ఆరోగ్యం లాంటి విషయాలలో ఎంతో అభివృద్ధి సాధించుకున్నాం, శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా ముందుకు పోతున్నాం, ఉద్యోగ అవకాశాలు పెంచుకున్నాం. నాలుగు సంవత్సరాల్లో తెలంగాణాలో లంచగొండితనం విపరీతంగా పెంచుకున్నాం. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుంటున్నారు.

మనదేశ మొదటి ప్రధాని డ్యాంలు ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించారు. దీనికి అనుగుణంగా డ్యాంల నిర్మాణాన్ని ప్రోత్సహించారు. పంజాబ్, హర్యాణా దీనిలో ముందుకు పోయాయి. అలాగే తెలుగు రాష్ట్రాలు 'బియ్యం ధాన్యాగారంగా' అభివర్ణిస్తున్నారు. దీనిలో భాగంగా జలవిద్యుత్ పెంచుకున్నాం.

ఒక తెలుగు దినపత్రిక జూన్ 2014లో ఏమి చెప్పిందంటే, 'జలయజ్ఞం కింద 25 ప్రాజెక్టులు ముందుకు తీసుకువచ్చారు (తెలంగాణ ప్రాంతంలో). 21,506 కోట్లు ఖర్చుచేసి 22,77,416 ఎకరాలకు నీరందించాలనేది లక్ష్యం. దీనికింద 14,321 కోట్లు ఖర్చు చేశారు. 2009 తరువాత దీనిని అంతగా ముందుకు తీసుకుపోలేదు. అందుచేత కొత్త ప్రభుత్వం 11,440 కోట్లు (7,185+4,255) ఖర్చుచేస్తే పూర్తి అవుతా'యన్నది. కానీ కొత్త ప్రభుత్వం రాజకీయం చేసి లక్షల కోట్లలోకి నెట్టిందేగాని (అంతా అప్పులమయం), కొత్తగా నీరిచ్చిన దాఖలాలు కనిపించవు. బావులు, బోరుబావుల కింద 10 లక్షల హెక్టార్లు సాగవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వడం ద్వారా వృద్ధి సాధించాం. ఇప్పటి ప్రభుత్వం 24 గంటల విద్యుత్ పేరుతో భూగర్భ జలాల నాశనం దిశలోకి నెట్టుతున్నారు, విద్యుత్ దుర్వినియోగం పెరిగింది, మాఫియాలు (ఇసుక, గ్రానైటు, బొగ్గు, వగైరాలు) పెట్రేగిపోతున్నారు. దీనితో నీటి వనరులు దెబ్బతింటున్నాయి. నీటి లభ్యత వాతావరణానికి అనుగుణంగా పెరగటం తరగటం జరుగుతుంది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. నీరు ఎక్కువగా ఉన్నప్పుడు పోటీ పడి దుర్వినియోగం చేసుకుంటూపోతే, నీరు తక్కువగా ఉన్నప్పుడు కష్టాలు మొదలౌతాయి. కానీ ఇది నాయకులకు ఓటు బ్యాంకుగా పనిచేస్తుంది. వ్యవసా యరంగ పునర్వికాసం దేశ ఆర్థిక, సామాజిక, పర్యా వరణ సమతుల్య రక్షణ రీత్యా ఎంతో కీలకమైనది. భూమి, నీటి వనరులు ఒత్తిడికి లోనై తరిగిపోతున్న నూతన పరిణామ దశలో మన వ్యవసాయాన్ని నూతన దిశలో మార్చుకోవాల్సిన పరిస్థితి గుర్తించాలి. అనగా మనం ఆచరిస్తున్న నూతన సాంకేతిక ఆవిష్కరణలో ఉపాధి కల్పించే దిశా, పర్యావరణ సమతుల్యతను నిలిపేదిగా వుండి రైతుల ఆర్థిక, సామాజిక వివక్షకు దూరం చేసేవిగా ఉండాలి. ఈ లక్ష్యాలు మాత్రమే మనల్ని నిత్య హరితవిప్లవం, వనరుల పటిష్టతను నిలబెట్టే వ్యవసాయ స్థాయికి చేర్చగలవు. 2001లో అప్పటి తెలుగుదేశ ప్రభుత్వం వ్యవసా యం, అనుబంధ శాఖల వ్యూహరచనా పత్రం (వైట్ పేపర్), విజన్ 2020 పత్రాలను విడుదల చేసింది. విజన్-2020 లక్ష్యాలను సాధించటానికి వ్యూహాలు అనే దాంట్లో సమిష్టి కమతాలుగా చిన్న భూకమ తాలను మార్పు అనేది భవిష్యత్తు ప్రణాళికగా గుర్తించడం జరిగింది; కానీ కాంట్రాక్టు పద్ధతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం భవిష్యత్తు ప్రణాళికగా చెప్పారు. దీనికనుగుణంగా కుప్పంలో ప్రభుత్వ డబ్బుతో కాం ట్రాక్టు వ్యవసాయాన్ని ప్రవేశపెట్టారు. వచ్చే సంవత్సరాలలో ఇలాంటి విధానాన్ని ఎక్కడెక్కడ అమలు పరచాలని పేర్కొన్నారు. కుప్పంలో ఇజ్రాయిల్ ప్రయోగం కుప్పకూలి పోవడమేగాక, చుట్టుపక్కల రైతుల బోర్లు ఎండిపోయాయి. వ్యూహరచనా పత్రం, విజన్ 2020పై అప్పటి తెలుగు దినపత్రికలలో వ్యాసాలు రాశాను. ప్రతిపక్ష నేతకు 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ, అనుబంధ శాఖల వ్యూహరచనా పత్రం : భ్రమలు – వాస్తవాలు' (బ్లాక్ పేపర్) రాసి ఇచ్చాను. దానిని అసెంబ్లీ గ్యాలరీలో విడుదల చేశారు. దీనిని గురించి అన్ని దినపత్రికలు రాశాయి. 'కాంగ్రెస్ సమిష్టి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నదనే' శీర్షికన, తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దానిని అమలు పరచే దిశలో ప్రయత్నించింది. కానీ దీని తయారీలో దుష్టశక్తులు చేరి తెలుగుదేశం విజన్ 2020ని చొప్పించాయి. దీనిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావడంతో పత్రాన్ని నిలుపుదల చేశారు. రైతు ఆత్మహత్యలకు ముఖ్య కారణం, వ్యవసాయ ఖర్చు. ఇది తగ్గాలంటే సమిష్టి వ్యవసాయం ముఖ్యపాత్ర పోషిస్తుంది. దీనిలో భాగంగా రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువుల వాడకం జరగాలి.

హరిత విప్లవం తరువాత రాష్ట్ర ప్రభుత్వం విత్త నాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసి రైతులకు మంచి విత్తనాలు అందించింది. దీనిలో వ్యవసాయ సంచాలకులు ముఖ్యపాత్ర పోషించారు. ఇవి ఇప్పుడు కను మరుగయ్యాయి. వీటిని ప్రైవేటు సంస్థలకు ఇచ్చారు. దీంతో రైతుల కష్టాలు మొదలయ్యాయి. దీనిపై తెలంగాణా ప్రభుత్వం గత నాలుగేళ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కానీ పార్టీ నాయకుల చేతిలోకి వ్యవసాయాన్ని నెట్టి భ్రష్టు పట్టిస్తున్నది(!). దీనికి ఉదాహరణ, బిటి పత్తి విత్తనాలు... నాశిరకం, అనుమతించని విత్తనాలు. ప్రజాధనం దుర్వినియోగం చేసి రైతుల పేరుతో రాజకీయ నాయకులను ఇజ్రాయిల్‌కు పంపుతున్నారు. అక్కడి వాతావరణ పరిస్థితులు మనకున్న వాతావరణ పరిస్థితులకు పోలికే కాదు.. విహార యాత్రలు చేస్తున్నారు. ఇలాంటి నాయకులతో ప్రత్యామ్నాయాలు వస్తే దేశం సర్వనాశనం అవుతుంది. అందరికి చిప్ప చేతికిచ్చి రాజకీయ నాయకులు పూర్వపు రాజులుగా చలామణి అవుతారేమో? మనకు కావలసింది ప్రత్యామ్నాయం కాదు. మంచి వ్యక్తులు.. ప్రజల గురించి ఆలోచించేవారు.



'అందరికీ చిప్ప చేతికిచ్చి రాజకీయనాయకులు పూర్వపు రాజులుగా చలామణి అవుతారేమో? మనకు కావలసింది ప్రత్యామ్నాయం కాదు. మంచి వ్యక్తులు.. ప్రజల గురించి ఆలోచించేవారు.'

డాక్టర్ సజ్జల జీవానందరెడ్డి

మన లేఖలు

టీచర్ల డిక్లరేషన్ కోరడం అసమంజసం

త్వరలో నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడితే ఇన్విజిలే టర్లుగా తాము బాధ్యత వహిస్తామని, తమపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చునని టీచర్లు డిక్లరేషన్ ఇవ్వాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేయడం వాంఛనీయం కాదు. ఇది అప్రజాస్వామికమని డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) అభిప్రాయపడుతోంది. పరీక్షల నిర్వహణలో పరీక్ష కేంద్రానికి సంబంధించి చీఫ్ సూపరింటెంట్, డిపార్టుమెంటల్ అధికారి, ఇన్విజిలేటర్ ఉమ్మడి బాధ్యతగా, పరీక్షలు సాఫీగా జరిగేవిధంగా చర్యలు చేపడతారు. ఏదైనా తప్పిదం జరిగితే యాక్ట్-25 ద్వారా చర్యలు గైకొంటారు. అలాకాకుండా ఇన్విజిలేటర్‌నే బాధ్యుడిగా చేస్తూ డిక్లరేషన్ రాసివ్వాల్సిందిగా డీజీఈ ఉత్తర్వులు ఇవ్వడం అక్షేపణీయం. తక్షణం ఈ ఉత్తర్వులను రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్నాం.

- టి. లింగారెడ్డి
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీటిఎఫ్

పారిశుధ్య కార్మికుల పట్ల వివక్ష

పాలకులు మారినా, అధికారులు మారినా అనాదిగా సేవలు చేస్తున్న కార్మికుల తలరాతలు మాత్రం మారడం లేదు. తలరాతలు మారుస్తామని చెప్పే ఏలికల మాటలు తరతరాలుగా మాటలుగానే ఉంటున్నాయన్నది నగ్నసత్యం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే బతుకులు మారతాయన్నారు. అంతా మారుస్తామని, అద్భుతాలు సృష్టిస్తామని చెప్పిన నేతల మాటలకు ఎంతో సంబురపడ్డాం. కొన్ని డిపార్టుమెంట్లకు వేతనాలు పెంచి ఉపశమనం కలిగించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు పూనుకుంటే వేతనాలు పెంచినట్టే పెంచి ఓరుగల్లు వంటి మున్సిపల్ కార్పొరేషన్‌లో వేతనాలు పెంచకుండా మొండి చేయి చూపిస్తున్నారు. రాష్ట్రంలో పారిశుధ్య కార్మికుల ఐక్యతను దెబ్బతీసేచర్యలకు ప్రభుత్వం పూనుకుంటోంది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనైనా కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చర్చించాల్సింది కోరుతున్నాం.

- రాజారపు భాస్కర్
ప్రధాన కార్యదర్శి, టీఎంఈడబ్ల్యూఏ

మనం
కుటుంబం
బుధవారం, 14 మార్చి 2018
www.manamnews.com





మానవ సేవే మాధవ సేవ అని మనసా వాచా కర్మణా విశ్వసిస్తూ ఆచరించే వారిలో మొదటి వరుసలో ఉంటారు బొట్ట కుటుంబీకులు. బొట్ట పర్వతయ్య, బొట్ట శారదాదేవి అనగానే మీకు ప్రముఖ పారిశ్రామిక కుటుంబంగా ఠక్కున గుర్తుకు వస్తుంది. కానీ పలు ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో వీరు పోషిస్తున్న పాత్ర అపూర్వం, అద్వితీయంగా వేనోళ్ల కీర్తిని ఆర్జిస్తున్న బొట్ట దంపతులు చేస్తున్న సేవలు రెండు తెలుగు రాష్ట్రాల్లో మారుమోగిపోతున్నాయి.

మానవ సేవే మాధవ సేవ

భక్తులకు సేవ



ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, మొక్కుబడులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు, కన్నులారా తమ ఇష్టదైవం, కులదైవాన్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సేవ చేయడమంటే పూర్వజన్మ సుక్రుతంగా భావించే బొట్ట పర్వతయ్య, శారదాదేవి, శ్రీశైలంలో శివభక్తుల సౌకర్యార్థం కోటి రూపాయల వ్యయంతో 'బొట్ట సదనం'ను నిర్మించి, ఆలయ నిర్వాహకులకు అప్పగించడం విశేషం. అంతేకాదు శ్రీశైలంలోనే ఉన్న కాకతీయ అన్నదాన సత్రంలో భక్తులకోసం మరో మూడు లక్షలకుపైగా వెచ్చిస్తూ నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి జలప్రసాదాన్ని వితరణగా అందిస్తున్నారు. దీంతో కాకతీయ సత్రానికి వచ్చే యాత్రికులకు తాగునీటి సమస్య శాశ్వతంగా దూరం చేసేలా బొట్ట కుటుంబీకులు కృషి చేశారు. ఇక ఇక్కడే కొలువై ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన భ్రమరాంబా దేవికి భక్తిపూర్వక కట్నంగా కర్నాటకలోని తుమ్కూరులో 35 లక్షల విలువచేసే రెండున్నర ఎకరాల భూమిని కూడా వీరు సమర్పించుకున్నారు. అలంపూరులోని మరో శక్తి పీఠం జోగులాంబ అమ్మవారి దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 20 లక్షలకుపైగా వెచ్చించి వీరు షెడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతోపాటు యజ్ఞశాలవద్ద కూడా అదనపు వ్యయంతో షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు, ఇక్కడి వినాయకుడికి తామర తోరణాన్ని సమర్పించుకున్నారు. బాసర సరస్వతీ దేవి క్షేత్రానికి కూడా 10 లక్షల విరాళమిచ్చి భక్తుల సౌకర్యార్థం వెచ్చించమని వీరు కోరారు.



ఆలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ఆనుకుని ఉన్న గణేష్ గుడిలోని అన్నపూర్ణాదేవి విగ్రహంతోపాటు ఆలయంలో సుమారు 7 లక్షలు వెచ్చించి పునరుద్ధరణ పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. గుంటూరు జిల్లా పెద్ద ఆంజనేయ స్వామి గుడి, భావనారాయణ స్వామి గుళ్లలో స్వతంత్ర రాజ్యలక్ష్మి దేవి గుళ్లలో వాస్తు దోషాల నివారణకోసం ఆలయంలో పలు పునరుద్ధరణ పనులను బొట్ట వారే చేపట్టారు. అన్నవరం సత్యదేవుని సన్నిధిలో యాగశాల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు జోరుగా సాగుతుండగా వ్యయానికి వెనకాడకుండా సాగుతున్న ఈ పనులు ఇక్కడికి వచ్చిన భక్తులకు ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



నైవేద్య, అన్నదాన సేవల కోసం..

శ్రీశైల దేవస్థానంలో నైవేద్యానికి అవసరమైన సామగ్రిని, వంటపాత్రలను 15 లక్షలకుపైగా వ్యయంతో కొని, దేవాలయ నిర్వాహకులకు అప్పగించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్య అన్నదాన ప్రసాద వితరణకోసం 5 లక్షల రూపాయలు విరాళం ఇస్తూనే 2007లో తిరుమల లడ్డూ పాకం తయారుచేసే మిషన్‌కోసం 10 లక్షలు విరాళాన్ని బొట్ట కుటుంబీకులు అందించారు. కేరళలోని ప్రసిద్ధ కృష్ణుడి ఆలయం గురువాయూర్‌లో జరిగే కుంకుమపువ్వు సేవకు అవసరమైన వితరణ చేయడంలో ముందుండే బొట్ట కుటుంబీకులు ఖర్చుకు ఎన్నడూ వెనకాడింది లేదు.

కేవలం ధార్మిక కార్యక్రమాలకే కాక అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చేందుకు బొట్టా దంపతులు ప్రాధాన్యత ఇస్తుండడం మరో విశేషం. తెలంగాణలో రైతు ఆత్మహత్యలను చూసి తీవ్రంగా చలించిపోయిన వీరు 5 లక్షల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేసి తమ పెద్ద మనసును చాటుకున్నారు. ఇక తమ సంస్థల్లో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సర్వం తామే అయి, వారి బాగోగుల చూడటంలోనూ బొట్ట కుటుంబం కీర్తిని ఆర్జించింది. ఇక వివిధ గుళ్లలో పనిచేస్తూ ఆర్థిక చిక్కుల్లో ఉన్న అర్చకులను గుర్తించి వారికి ఆర్థిక సహకారం అందించడంలో బొట్టా శారదాదేవి చూపుతున్న చిత్తశుద్ధి అనిర్వచనీయం. ఇవన్నీ చాలదన్నట్టు గోసేవకు కూడా వీరు అగ్రతాంబూలం ఇస్తుండడం మరో విశేషం. శ్రీశైలంతోపాటు పలు దేవాలయాల్లోని గోశాలల్లోని గోవులకు అవసరమైన టన్నుల కొద్దీ పశుగ్రాసం ఏటా అందజేయడాన్ని ఈ దంపతులు విధిగా పెట్టుకున్నారు.



తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆలయాల్లో వీరు చేస్తున్న సేవలపై శారదా దేవి అంతరంగం నిజంగా అద్భుతం అనిపిస్తుంది.. ''ఇన్ని కోట్ల రూపాయలు వెచ్చించినా నాకు ఇంకా సంతృప్తి లభించడం లేదు.. నిత్యం ఇంకా ఏదో చేయాలనే వెలితి నన్ను వెంటాడు తోంది.. భక్తులకు సేవ చేస్తే అది సాక్షాత్తూ ఆ దైవానికి పూజ చేసినట్టే, పేద ప్రజలకు ఉడతా భక్తితో పలు రూపాల్లో సేవ చేయాలని నా మనసు ఎప్పుడూ ఉవ్విళ్లూరు తుంటుంది.. వెళ్లేప్పుడు మనం ఏం వెంట గట్టుకుని వెళ్లము కదా.. అందుకే నాకు ఇలా తోచినది చేయడంలోనే అనిర్వచనీయమైన ఆనందం కలుగుతోంది'' అని చెప్పే శారదాదేవి నిజంగా ధన్య జీవి అని అననివారు లేరు.

ట్రెండీ హ్యాండ్స్



ఓవర్ సైజ్డ్ స్లీవ్స్ ఇప్పుడు సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్‌గా మారింది. ఒకప్పుడు బెల్ హ్యాండ్స్, పుష్‌బ్యాక్ హ్యాండ్స్‌గా పేరుగాంచిన స్లీవ్స్ ఇప్పుడు ఓవర్ సైజ్డ్ స్లీవ్స్ పేరుతో ఫ్యాషన్ ప్రపంచంలో మరోమారు స్టైలిష్ ట్రెండ్‌గా మారాయి. ఫ్యాషన్ ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా..అందునా సమ్మర్ వచ్చిందంటే ఇలాంటి ఓల్డ్ ట్రెండ్స్ న్యూ ట్రెండ్స్‌గా మారిపోతుంటాయి. దీంతో ఇప్పుడు హాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రిటీలంతా ఈ ట్రెండీ హ్యాండ్స్‌తో తళుక్కుమంటున్నారు. మీకు రెడీమేడ్‌లో ఈజీగా దొరికే ఈ ఫిట్టింగ్ .. వెస్ట్రన్, ఎథ్నిక్, ఫ్యూజన్ డిజైన్స్‌కు అన్నింటికీ నప్పేలా ఉండడం దీని ప్రత్యేకత.



బెలూన్ స్లీవ్స్

బెల్డ్ కఫ్‌తో పాటు బెలూన్ స్లీవ్స్‌గా ఫ్యాషన్ లవర్స్‌కు ఫెమిలియర్ అయిన ఈ హ్యాండ్స్ సమ్మర్‌లో చాలా కూల్ లుక్ ఇస్తాయి. అంతేకాదు సన్ బర్న్‌నుంచి కాపాడుకునే ఛాన్స్ లభిస్తుంది కనుక సెలబ్స్ సమ్మర్‌లో బెలూన్ స్లీవ్స్‌ను క్రేజీగా ధరిస్తారు. గౌన్ అయినా కుర్తీ అయినా లేక వెస్ట్రన్ టాప్ అయినా అన్నింటిలో ఓవర్ సైజ్డ్ హ్యాండ్స్ న్యూ స్టైల్‌గా మారిన ప్రస్తుత తరుణంలో దీనిపై చాలా ప్రయోగాలు చేస్తున్న డ్రెస్ డిజైనర్స్ మార్కెట్లో ఓవర్ సైజ్డ్ స్లీవ్స్‌పై మంచి హ్యాండ్ వర్క్ కూడా చేసి వావ్ అనిపించేలా డిజైన్ చేస్తున్నారు. బాలీవుడ్‌లో ఫస్ట్ స్టైల్ స్టేట్‌మెంట్ ఇచ్చే దీపికా పదుకున్, సోనమ్ కపూర్‌లు అప్పుడే వీటిని ట్రై చేసేసారు. హిందీ సీరియళ్లలోకూడా ఇప్పుడు ఇదే ట్రెండ్ నడుస్తోంది. మరెందుకు ఆలస్యం మీరు కూడా ట్రై చేసి సమ్మర్‌లో కొత్త ఫ్యాషన్‌ను ఎంజాయ్ చేయండి.









వరల్డ్ రికార్డ్ 'ఆమె' పేరుతో..

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్న సంకల్పం వరల్డ్ రికార్డ్ సృష్టించింది. 2400 మంది మహిళలు ఒక చోట చేరి, వీరంతా చేపట్టిన మానవహారంలో భాగంగా మహిళా సాధికారితపై కూడా అవగాహన కల్పించేలా సాగడం విశేషం. వీరంతా సందేశాన్ని ఇస్తూనే సరికొత్త వరల్డ్ రికార్డ్ సృష్టించారు.

గుజరాత్‌లోని వదోదరలో ఓవైపు ఐసీసీ వుమెన్స్ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ సాగుతుంటే మరోవైపు లంచ్ బ్రేక్‌లో మానవహారం చేసిన సందడి ఇండియా–ఆస్ట్రేలియా వుమెన్స్ క్రికెట్ మ్యాచ్‌లో హైలైట్‌గా సాగింది. రిలయన్స్ స్టేడియంలో మానవహారం ఇప్పుడు ఇంటర్‌నెట్‌లో వైరల్ అవుతోంది. బరోడా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో సాగిన మానవహారం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడంతో ఇందులో పాల్గొన్న మొత్తం 2416 మంది మహిళలు ఆనందంతో సంబరాలు జరుపుకున్నారు. 'చక్ దే ఇండియా'తో పాటు పలు ఫోక్ డ్యాన్స్‌లను బ్యాక్ గ్రౌండ్‌లో ప్లే చేస్తుంటే గుజరాతీ మహిళలు చేతిలో చేయి వేసి, మనకోసం మనం అంటూ సాగిన తీరు కెమెరాల్లో శాశ్వతంగా నిలిచిపోయింది.





జంపింగ్‌లకు షాక్

22 మంది ఏపీ నేతలకు హైకోర్టు నోటీసులు

నలుగురు మంత్రులు.. 18 మంది ఎమ్మెల్యేలు

హైదరాబాద్, మార్చి 13 (మనం లీగల్ ప్రతినిధి):

వైఎస్ఆర్‌సీపీ నుంచి గెలిచి.. తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకొన్న నలుగురు ఆంధ్రప్రదేశ్ మంత్రులు సహా.. మొత్తం 22 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరడమే కాకుండా.. మంత్రులుగా కూడా కొన సాగడంపై వివరణ ఇవ్వాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ నోటీసుల్లో పేర్కొంది. వైఎస్ఆర్‌సీపీ తరపున పోటీ చేసి గెలిచి, ఆ తర్వాత టీడీపీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట ఉల్లంఘనకు పాల్పడిన ఆ 22 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ మార్కాపురం మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ మంగళవారం విచారించింది. ఏపీ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న సి. ఆదినారాయణరెడ్డి, రావు వెంకట సుజయ కృష్ణ రంగారావు, అమర్‌నాథ్‌రెడ్డి, భూమా అఖిలప్రియలతో పాటు మరో 18 మంది ఎమ్మెల్యేలకు కూడా నోటీసులిచ్చింది. ఏ అధికారంతో మంత్రులుగా కొనసాగుతున్నారో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని బెంచ్ వారిని ఆదేశించింది. వైఎస్ఆర్‌సీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఎం.మణిగాంధీ, పాలపర్తి డేవిడ్‌రాజు, జయరాములు, జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), ఉప్పులేటి కల్పన, పాశం సునీల్‌కుమార్, వరుపుల సుబ్బారావు, ఎస్.వి.మోహన్‌రెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, చాంద్ బాషా, గొట్టిపాటి రవికుమార్, జలీల్‌ఖాన్, కె. సర్వేశ్వరరావు, కలమట వెంకటరమణ, పోతుల రామారావు, ఎం.అశోక్‌రెడ్డి, గిడ్డి ఈశ్వరి, వి.రాజేశ్వరిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వీరంతా తమ వాదనలతో కౌంటర్ వ్యాజ్యాలు దాఖలు చేయాలని ఆదేశించింది.

తొలుత కేసు విచారణకు రాగానే పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేలుగా గెలిచి పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని ఉల్లంఘించి అధికార పార్టీలో చేరడమే కాకుండా ఏకంగా నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులు కూడా అయ్యారని, రాజ్యాంగాన్ని కాపాడుతామని ప్రమాణం చేసిన మంత్రులు అప్పటికే పార్టీ ఫిరాయించి రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడ్డారని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదించారు. దీనిపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తే పార్టీ ఫిరాయించిన 22 మంది ఎమ్మెల్యేలకు కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఇదే తరహా కేసు హైకోర్టు గతంలో విచారణ జరిగినా మళ్లీ తిరిగి నోటీసుకు రాలేదన్నారు. కేసు ఒకసారి వాయిదా పడితే తిరిగి విచారణకు నోచుకోవడం లేదన్నారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ.. మూడు లక్షలకు పైగా కేసులు ఒక్క హైకోర్టులోనే పెండింగ్‌లో ఉన్నాయని, కేసు విచారణకు రాలేదంటే ఏమీ చేయలేని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించింది. అన్ని కేసులూ ముఖ్యమైనవేనని, ఏ కేసు అత్యవసరమని చెప్పగలమని బెంచ్ ప్రశ్నించింది. అయినా పార్టీ ఫిరాయించిన వారికి నోటీసులు ఇచ్చి వారి వివరణ కోరతామని, అందులో నలుగురు ఎలా మంత్రులయ్యారో కూడా తెలుసుకుంటామని బెంచ్ స్పష్టం చేసింది. ఫిరాయింపులకు పాల్పడిన వారు నోటీసులు అందుకున్నాక నవ్వితే ఏం చేయగలమని కూడా బెంచ్ పేర్కొంది. విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

1. ఎం.అశోక్‌రెడ్డి, 2. పి.డేవిడ్‌రాజు
3. పి.రామారావు, 4. గొట్టిపాటి రవికుమార్
5. పాశం సునీల్‌కుమార్, 6. తిరివీధి జయరాములు, 7. బుడ్డా రాజశేఖర్‌రెడ్డి
8. ఎస్.వి.మోహన్‌రెడ్డి, 9. మణి గాంధీ
10. అత్తార్ చాంద్ బాషా
11. జలీల్ ఖాన్, 12. ఉప్పులేటి కల్పన
13. జ్యోతుల నెహ్రూ, 14. వరుపుల సుబ్బారావు, 15. వి.రాజేశ్వరి
16. కిడారి సరేశ్వరరావు, 17. గిడ్డి ఈశ్వరి,
18. కలమట వెంకట రమణమూర్తి

హైకోర్టు నోటీసులు జారీ చేసిన ఫిరాయింపు మంత్రులు

1.చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి
2. ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి
3. భూమా అఖిలప్రియ
4.రావు వెంకటసుజయ కృష్ణ రంగారావు

ఆదేశాలను స్వాగతిస్తున్నాం: సారథి

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని వైఎస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి పార్థసారథి తెలిపారు. ఈ అంశంపై మొదటినుంచి పోరాడుతున్న తమ పార్టీకి ఇది ఊరటనిచ్చే అంశమని, తుది తీర్పు కూడా సానుకూలంగా వస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

సిరిసిల్లలో అప్పెరల్ పార్కు



(మొదటిపేజీ తరువాయి)

సచివాలయంలోని సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో ఎంవోయూపై జౌళి శాఖ ఎండీ శైలజా రామయ్యర్, కేఏవై సంస్థ ప్రతినిధులు సంతకాలు చేశారు. రెండు నెలల్లోగా పార్కు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కేటీ ఆర్ మాట్లాడుతూ.. చేనేత కార్మికుల జీవితాల గురించి సీఎం కేసీఆర్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదన్నారు. చిన్నప్పుడు కేసీఆర్ స్వయంగా ఒక నేత కార్మికుడి ఇంట్లో ఉన్నారు కనుకనే ఆయనకు వారి జీవితాలపై అవగాహన ఉం దన్నారు. అందుకే గత బడ్జెట్‌లో చేనేతకు రూ.1200 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మరమగ్గాల్లో 50 శాతం సిరిసిల్లాలోనే కేంద్రీకృత మయ్యాయని చెప్పారు. వరంగల్ అజాంజాహి మిల్లు ఎంతో గొప్పగా నడిచిందని, అందులో పనిచేసిన కార్మికు లు ప్రస్తుతం వలస వెళ్లారని తెలిపారు. వారిని తిరిగి రాష్ట్రానికి తీసుకురావడానికే దేశంలోనే పెద్దదైన కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు వివ రించారు. ఇందులో భాగంగా 22 ఎంవోయూలు కుదు ర్చుకున్నట్టు తెలిపారు. చరిత్రలో ఎక్కడా లేనివిధంగా నూలు, రసాయనాల మీద 50శాతం సబ్సిడీ ఇస్తున్నట్టు పేర్కొ న్నారు. వస్త్రాలను కొనుగోలు చేయడానికి చేనేత యజమా నులతో బైబ్యాక్ ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. నేతన్నలను ఆదుకోవడానికి స్కూల్ యూనిఫామ్‌ల తయారీని కూడా వారికే ఇచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం సిరిసిల్లలో చేనేత కార్మికులు నెలకు 15 నుంచి 20 వేలు సంపాదిస్తున్నారని తెలిపారు. వారి కుటుంబాల్లోని మహిళలు బీడీ కార్మికులుగా మారు తున్నారని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో చేనేత ఉత్పత్తులు రూ.1000 కోట్లు కూడా లేదన్నారు. తమిళనాడులోని తిర్పూరులో సుమారు రూ.36 వేల కోట్ల చేనేత ఉత్పత్తి ఉందన్నారు. తిర్పూర్ చేనేత పరిశ్రమలను అధ్యయనం చేసినందుకే తమిళనాడు కేఏవై వెంచర్స్ సంస్థ భాగస్వామ్యంతో రూ.100 కోట్ల పెట్టుబడితో ఈ అప్పెరల్ సూపర్ పార్కు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు మూడు దశలుగా మూడేండ్లలో పూర్తి చేస్తారని తెలిపారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 15 వేలు, పరోక్షంగా 15 వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. గుండ్ల పోచంపల్లి అప్పెరల్ పార్కు, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్‌కు సీఈవోగా రాజారాంను నియమిస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. రూరల్ ఇన్నోవేటర్స్‌ను కూడా తెలంగాణ ప్రోత్సహిస్తోందని అందులో భాగంగానే ఆసు యంత్రం కనిపెట్టిన మల్లేషంకు రూ. కోటి అందించామన్నారు.

కోమటిరెడ్డి, సంపత్‌పై వేటు

శాసన సభత్వాలు రద్దు.. 11 మంది ఎమ్మెల్యేలు సస్పెన్షన్.. ఐదుగురు ఎమ్మెల్సీలపైనా వేటు

తెలంగాణ అసెంబ్లీ సంచలన నిర్ణయం.. శాసనసభ చరిత్రలో ఇదే తొలిసారి.. దాడి దుర్మార్గం.. దురదృష్టకరం: స్పీకర్

సభ్యత్వాలను రద్దు చేస్తూ సర్కారు గెజిట్

ఎన్నికల కమిషన్‌కు నోటిఫికేషన్ అందజేత

సస్పెండయిన వారిలో మరో ఇద్దరిపైనా వేటు?

సీసీటీవీ ఫుటేజీల అనంతరం వెలుగులోకి?

హైదరాబాద్, మార్చి 13 (మనం ప్రతినిధి):

శాసనసభ చరిత్రలోనే అత్యంత అరుదైన, అనుహ్యమైన నిర్ణయం తీసుకున్నారు స్పీకర్ మధుసూదనాచారి. గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభలో అలజడి సృష్టించారని ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వాలను రద్దు చేశారు. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌పై హెడ్ ఫోన్ విసిరిన సంఘటనలో కాంగ్రెస్ శాసనసభా పక్ష ఉపనేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే సంపత్ కుమార్ సభ్యత్వాలను స్పీకర్ రద్దు చేశారు. సోమవారం సభలో చోటుచేసుకున్న సంఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి శాసన సభ చరిత్రలోనే ఇలా ఇద్దరు సభ్యుల సభ్యత్వాలను రద్దు చేయడం ఇదే ప్రథమం. వీరితో సభలో ఉన్న మిగిలిన 11 మంది కాంగ్రెస్ సభ్యులను బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. ఇద్దరు సభ్యులను ఆర్టికల్ 194 (3) ప్రకారం సభ నుంచి బహిష్కరిస్తున్నట్లు హరీశ్‌రావు తన తీర్మానంలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగానే స్పీకర్ మధుసూదనాచారి నేరుగా ఈ సంఘటనను ప్రస్తావించారు. ఇది చాలా దుర్మార్గమైన చర్యని, ఇది తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని చెప్పారు. ఇది అవాంఛనీయమని, దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదన్నారు. మండలి చైర్మన్‌పై జరిగిన దాడి తనను షాక్ గురి చేసిందన్నారు. నాలుగు సంవత్సరాలు ప్రశాంతంగా జరిగిన సభలో ఈ సంఘటన మచ్చలాంటిదని స్పీకర్ చెప్పారు. ఆ వెంటనే శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి హరీశ్‌రావు రెండు తీర్మానాలను ప్రవేశపెట్టారు. మొదటి తీర్మానంలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నందుకు 11 మంది శాసన సభ్యులను బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయాల్సిందిగా ప్రతిపాదించారు. వెంటనే ఆమోదించిన స్పీకర్ వీరిని సస్పెండ్ చేసే తీర్మానాన్ని ఆమోదించారు. స్వామిగౌడ్ గాయపడేందుకు కారణమైన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని, సంపత్ కుమార్ సభ్యత్వాలను రద్దు చేస్తూ మరో తీర్మానాన్ని హరీశ్‌రావు ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని కూడా వెంటనే ఆమోదించారు. ఉద్దేశపూర్వకంగా దాడి చేసినందునే చర్య తీసుకున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ఇద్దరు సభ్యులను సభ నుంచి బహిష్కరించిన విషయాన్ని ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇచ్చింది.

తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్

స్పీకర్ చర్యను కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎందుకు సస్పెండ్ చేస్తున్నారో చెప్పాలని గట్టిగా డిమాండ్ చేశారు. సస్పెండ్ అయిన, బహిష్కరణకు గురైన సభ్యులు వెంటనేన సభను విడిచి పెట్టి వెళ్లాలని స్పీకర్ ఆదేశించారు. అదే సమయంలో సభలోకి పెద్ద సంఖ్యలో మర్షల్స్ ప్రవేశించి సభ్యులను బయటకు తీసుకువెళ్ళేందుకు ప్రయత్నించారు. తమ నిరసన తెలిపే అవకాశం ఇవ్వాలని జానారెడ్డి చేసిన విజ్ఞప్తిని స్పీకర్ అంగీకరించలేదు. దీంతో తీవ్ర ఆగ్రహంతో జానా రెడ్డి బయటకు వెళ్లిపోయారు. కాంగ్రెస్ సభ్యులు బయటకు వెళ్లిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ సభలోకి ప్రవేశించి.. తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

గట్టిగా సమర్థించుకున్న సీఎం కేసీఆర్

గవర్నర్ ప్రసంగం సందర్భంగా స్వామిగౌడ్ పై జరిగిన దాడి బాధాకరం, దురదృష్టకరమని, ఇలాంటి పరిస్థితి వస్తుందని తాను అనుకోలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. సభ్యులపై తీసుకున్నది కఠిన నిర్ణయమే అయినప్పటికీ తప్పలేదన్నారు. నాలుగేళ్లపాట స్పీకర్ సభను హుందాగా నడిపించారని, బడ్జెట్ సమావేశాల్లో పద్దులు గిలిటెన్ కాకుండా చర్చ జరిగేలా చూశారని చెప్పారు. తాము గ వర్నర్‌ను కొడదామని అనుకుంటే అది స్వామిగౌడ్‌కు తగిలిందని సమర్థించుకుంటున్నారని, రాజకీయాల్లో ఇంత అసహనం పనికిరాదని అన్నారు. కాంగ్రెస్ అరాచకాలకు సోమవారం నాటి సంఘటన పరాకాష్ఠని విమర్శించారు. బల్లలు ఎక్కి కొట్టిన వారే.. శాసనమండలి చైర్మన్ నాటకాలు ఆడుతున్నారని అంటున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు హుందాగా ఉంటే నాటకాలు ఆడాల్సిన అవసరం ఎందుకు ఉంటుందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగున్నాయని, అరాచ కాలను సహించేదిలేదన్నారు. రాజకీయ ముసుగులో అరాచాకాలు చేస్తామంటే కఠినంగా అణచివేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వరసగా అన్ని ఎన్నికల్లో ఓడిపోవడంతో కాంగ్రెస్‌లో అసహనం పెరిగిందన్నారు. తాము ప్రజలకు మాత్రమే జవాబుదారి అని సీఎం చెప్పారు. సభ ఎన్నిరోజులు కావాలంటే అన్ని రోజులు నడిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మరి కాంగ్రెస్ సభ్యులు ఎందుకు గొడవ చేస్తున్నారని సీఎం ప్రశ్నించారు. సభలో కాంగ్రెస్ సభ్యులు గొడవ చేస్తారని మాకు ముందే స్పష్టమైన సమాచారం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రణాళిక ప్రకారమే వీరు దాడి చేశారని ఆరోపించారు. అంతిమంగా ప్రజలే న్యాయ నిర్ణేతలని, ఎవరు తప్పు చేసినా ప్రజలు నిర్ణయిస్తారన్నారు.

కిషన్ రెడ్డి, సీఎం మధ్య వాగ్వాదం

సభలో జరిగిన సంఘటన దురదృష్టకరమని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి వాటికి తావులేదని బీజేపీ శాసన సభా పక్ష నాయకుడు కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ సంఘటనలో పాల్గొనని జానా రెడ్డిని కూడా సస్పెండ్ చేయడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఏసీలో జానారెడ్డి దీనిపై విచారం కూడా వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిపై అకారణంగా చర్య తీసుకోవడం సరికాదన్నారు. పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీలు స్పీకర్ ముఖంపైనే ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారని, ఇక్కడ మాత్రం నిరసన తెలిపితే సస్పెండ్ చేయడం ఎంటని ప్రశ్నించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ముఖ్యమంత్రి అరాచకాలను బీజేపీ సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఎంపీల గురించి ఇక్కడ మాట్లాడటం సరికాదన్నారు. జానారెడ్డి ఏం చేశారో మాకు తెలియదా? ఏం చేయకుండానే సస్పెండ్ చేస్తామా? జానారెడ్డిని ఎందుకు వెనుకేసుకు వస్తున్నారు? అని సీఎం ప్రశ్నించారు. సీఎం మాటలకు కిషన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వాస్తవాలు చెబితే సీఎంకు ఇంత అసహనం పనికిరాదన్నారు. తాను ఏం తప్పు మాట్లాడానో చెప్పాలని కిషన్ రెడ్డి నిలదీశారు. పార్లమెంట్‌లో ప్లకార్డులుపెట్టవచ్చుకాని, ఇక్కడ పెట్టకూడదా అని ప్రశ్నించారు. దీంతో మరోసారి జోక్యం చేసుకున్న సీఎం.. ''వితండవాదం చేయొద్దు. నిర్ణయం తీసుకున్నాం. అది అయిపోయింది. సభ ఆమోదించింది. ఇంకా దీనిపై చర్చ ఎందుకు'' అని పేర్కొన్నారు. అటువైపు (విపక్షం) ఉన్న ఇద్దరోముగ్గరో సభను ఎలా నియంత్రిస్తారని, ఇటువైపు(అధికారపక్షం) ఉన్న 90 మంది మౌనంగా ఉండాలా? దీనిపై చర్చ అవసరం అని సీఎం తెగేసి చెప్పారు. దీంతో స్పీకర్ వెంటనే కిషన్ రెడ్డిని ముగించాలని ఆదేశించారు. అనంతరం ఇతర పక్షాలకు తమ అభిప్రాయం చెప్పేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వలేదు. ఇందుకు నిరసనగా టీడీపీ సభ్యులు సండ్ర వెంకట వీరయ్య, ఆర్. కృష్ణయ్య, బీజేపీ సభ్యులు సమావేశాలను బహిష్కరించారు.

మండలిలోనూ..

శాసన మండలిలో శాసన మండలిలో కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిప్రవేశపెట్టిన తీర్మానాన్ని డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ ఆమోదించారు. సస్పెన్షన్‌కు నిరసనగా సభ్యులు పోడియం వద్ద నిరసన తెలిపారు. దీంతో వీరిని మర్షల్స్ బలవంతంగా బయటకు పంపించి వేశారు. మండలిలో ఉన్న ఆరుగురు కాంగ్రెస్ సభ్యులను బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. కాగా, ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల శాసన సభ్యత్వాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఆ కాపీని ఎన్నికల కమిషన్‌కు పంపింది. మరోవైపు, సస్పెండయిన వారిలో మరో ఇద్దరి శాసనసభ్యత్వాలు కూడా రద్దయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. సీసీటీవీ ఫుటేజీ పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

అనర్హతపై కోమటిరెడ్డి, సంపత్ దీక్ష

48 గంటల 'ప్రజాస్వామ్య పరిరక్షణ నిరశన'.. కట్టు కథల కేసీఆర్‌ను.. కట్టుబట్టలతో తరిమికొడతాం

'కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో'

మరింత కసిగా కాంగ్రెస్ ఉద్యమిస్తాం

కేసీఆర్, మంత్రి హరీశ్ కనుసన్నల్లో స్పీకర్

సభ్యుల హక్కులను కాలరాస్తున్నారు

దీక్షలో ధ్వజమెత్తిన టీపీసీసీ చీఫ్ ఉత్తమ్

బిడ్డా.. కేసీఆర్.. నిన్ను దించేదాక నిద్రపోం

ప్రతినబూనిన కోమటిరెడ్డి, సంపత్‌కుమార్

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి):

తమ శాసన సభ్యత్వాలను రద్దును నిరసిస్తూ గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్‌కుమార్ దీక్ష చేపట్టారు. 'ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష' పేరుతో చేపటిన ఈ నిరశన 48 గంటలపాటు కొనసాగనుంది. దీక్షను అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి , వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, సీఎల్పీ నేత జానారెడ్డి ప్రారంభించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ''కట్టు కథల కేసీఆర్.. నిన్ను నీ కుటుంబాన్ని కట్టుబట్టలతో తెలంగాణ ప్రజలు తరిమికొట్టే సమయమొచ్చింది'' అని ధ్వజమెత్తారు. ప్రస్తుతం కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ ప్రజలకు మధ్య పోరాటం జరుగుతోందని అన్నారు. బడ్జెట్‌లో పద్దులపై చర్చిస్తే తమ అసలు రంగు బయటపడుతుందని ఆలోచనతో సీఎం కేసీఆర్, ప్రధాన ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేయించారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రతిపక్ష సభ్యులు ఎక్కడ నిలదీస్తారోనని టీఆర్ఎస్ ప్రభుత్వం భయపడుతోందన్నారు. సభ్యులకు రక్షణ కల్పించాల్సిన స్పీకర్... సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చెప్పిన విధంగా తలాడిస్తూ ప్రజాస్వామ్యానికే మచ్చ తెస్తున్నారన్నారు. గవర్నర్ ప్రసంగంలో స్వామిగౌడ్‌కు దెబ్బ తగిలిన ఫుటేజీని ప్రభుత్వం ఎందుకు చూపించడంలేదని ప్రశ్నించారు. నిరసనలు తెలపడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. అనర్హత ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు.

తెలంగాణ వద్దనన ఎంఐఎంకు ప్రాధాన్య ఇవ్వడంలో ఆంతర్యమేమిటన్నారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్ర ప్రజల సొమ్మును దోచుకుంటుందని ఆరోపించారు.బ్రిటీష్ వారిని తరిమికొట్టిన కాంగ్రెస్ కార్యకర్తలకు కేసీఆర్‌ను తరిమికొట్టడం పెద్ద లెక్క కాదన్నారు. 'కేసీఆర్ హఠావో-తెలంగాణ బచావో' నినాదంతో కార్యకర్తలంతా కసిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ ఎప్పుడూ కంకణబద్ధులై ఉంటుందన్నారు. శాసన సభ బయట లోపల ప్రధాన ప్రతిపక్షం ఉండకూడదన్న కుట్రతోనే కేసీఆర్ ముందస్తుగా పోలీసు బలగాలను మోహరించారని ఆరోపించారు. బిడ్డా కేసీఆర్ నిన్ను గద్దె దించేదాక కాంగ్రెస్ కార్యకర్తలు నిద్రపోరని కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ హెచ్చరించారు.



ప్రజాస్వామ్య పరిరక్షణ నిరాహార దీక్షలో కూర్చున్న వారిద్దరూ మాట్లాడుతూ.. ప్రజల పక్షాన పోరాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సభలో లేకుండా చేయడం అన్యాయమన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీనిచ్చి తానే గద్దెనెక్కిన ఘనత కేసీఆర్‌దన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెసోళ్లను సభనుంచి వెళ్లగట్టడం విచారకరమన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష చేపట్టిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌కు సంఘీభావంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం దీక్షలో పాల్గొనను న్నారని ప్రతిపక్ష నేత జానారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు షబ్బీర్ అలీ, జీవన్‌రెడ్డి, వంశీచందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పద్మా వతిరెడ్డి, డీకే అరుణ, దామోదర్‌రెడ్డి, ఆకుల లలిత, రేవంత్‌రెడ్డి, నాయకులు మల్లు రవి, మర్రి శశిధర్‌రెడ్డి, దానం నాగేందర్, ఏపూరి సోమన్న, పొన్నం ప్రభాకర్, గూడూరు నారాయణరెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ప్రతీకార దాడి

(మొదటిపేజీ తరువాయి)

కాకుండా పలు ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ పరికరాలను (ఐ ఈడీలు) అమర్చి.. సరిగ్గా వాహనం వచ్చే సమయానికి వాటిని పేల్చేయడం ద్వారా సాధారణంగా మందుపాతరల పేలుడును తట్టుకోగల మైన్ ప్రూఫ్ వాహనాన్ని సైతం తుత్తునియలు చేశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించారు. గాయపడ్డవా రిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భద్రతా సిబ్బంది దాడిలో 10 మంది వరకు మావోయి స్టులు మరణించిన సరిగ్గా 11 రోజుల తర్వాత ఈ దాడి జరిగింది.

మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో ఒక సారి భద్రతా సిబ్బందికి.. మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. అయితే, 208 కోబ్రా దళాల నుంచి భారీగా కాల్పులు ఎదురుకావడంతో మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారని సీఆర్పీఎఫ్ అధికార ప్రతినిధి మోజెస్ దినకరన్ చెప్పారు. తర్వాత మళ్లీ 12.30 గంటల సమయంలో 212 బెటాలియన్‌కు చెందిన బృందం కిస్టారం-పలోడి మధ్య వెళ్తుండగా వాళ్లు టార్గెట్ చేశారని, కనీసం వంద మంది వరకు దాడిలో పాల్గొనడంతో తొమ్మిది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది అమరులయ్యారని ఆయన అన్నారు.

మృతులు వీరే..

ఏఎస్ఐ ఆర్‌కేఎస్ తోమర్, కానిస్టేబుళ్లు అజయ్‌కుమార్ యాదవ్, మనోరంజన్ లంకా, జితేంద్రసింగ్, శోభిత్ శర్మ, మనోజ్ సింగ్, హెచ్ఎస్ చంద్ర, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు.

గతంలోనూ దాడులు..

గత సంవత్సరం మార్చి 11న సుక్మా జిల్లాలోని భేజి ప్రాంతంలో మావోయిస్టులు జరిపిన దాడిలో 12 మంది భద్రతా సిబ్బంది మరణించారు. కొన్నిరోజుల తర్వాత.. ఏప్రిల్ 24న జరిగిన మరో దాడిలో 25 మంది పారామిలటరీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.



అబూజ్‌మఢ్ అడవుల్లో క్యాంపు

సీఆర్పీఎఫ్ బలగాలు తొలిసారిగా ఈనెల ప్రారంభంలో అబూజ్‌మఢ్ అడవుల్లో మూడు శాశ్వత శిబిరాలు ఏర్పాటుచేసుకున్నాయి. రెండు ఆంబుష్ దాడుల్లో 37 మంది సిబ్బందిని కోల్పోవడంతో.. మావోయిస్టులపై సర్జికల్ తరహా ఆపరేషన్లు చేయాలన్న భావనతోనే ఈ శిబిరాలు ఏర్పటుచేశారు. రాష్ట్ర పోలీసులతో కలిపి దట్టమైన అడవుల్లోకి ప్రవేశించిన బలగాలు.. అప్పటినుంచి మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పెట్టుకున్నాయి. దాదాపు 4వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో విస్తరించిన అబూజ్ (ఎవరికీ తెలియని) మఢ్ (కొండ) ప్రాంతం.. చాలాకాలంగా మావోయిస్టులకు పెట్టని కోటగా ఉంది. దీన్ని కొల్లగొట్టాలని బలగాలు గట్టి పట్టుదలతో ఉన్నాయి.

జనంలోకి పవన్

నేడు గుంటూరులో భారీ బహిరంగ సభ

అమరావతి, మార్చి 13 (మనం ప్రతినిధి): పార్టీ స్థాపిస్తున్నట్లు ప్రకటించిన సుదీర్ఘ కాలం తర్వాత జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. ప్రజల్లోకి బహిరంగంగా రాబోతున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పార్టీ ఆవిర్భావ సభగా దీనికి నామకరణం చేశారు. ఇందలోనే ఆయన తన రాజకీయ విధానాలను ప్రజలకు తెలియజేస్తారని భావిస్తున్నారు. పార్టీ ప్రారంభించిన నాలుగేళ్ల తర్వాత ఏపీలో సభ ఏర్పాటు చేస్తుండటంతో.. దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2014 మార్చి 14వ తేదీన తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ప్రశ్నించడానికే పార్టీ పెడుతున్నాని, అధికారం కోసం కాదని మొదట చెప్పారు. 2014 ఎన్నికల్లో ఏపీ.. తెలంగాణలలో ఎక్కడా పోటీ చేయలేదు. కానీ టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతుగా ప్రచారం చేశారు. చాలాకాలం వారితో పాటే కొనసాగినా.. అప్పుడప్పుడు మాత్రం ట్విట్టర్ వేదికగా ప్రభుత్వాలను ప్రశ్నించారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి ఆయన ప్రజలతో మమేకం అయిన ఘటనలు వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు.

రహదారి రక్తసిక్తం!

బస్సు లోయలో పడి 13 మంది మృతి.. ఉత్తరాఖండ్‌లో దుర్ఘటన
టర్కీ.. ఇథియోఫియాల్లో ఘోర రోడ్డు ప్రమాదాలు



డెహ్రాడూన్/లెగాంబో/అంకారా, మార్చి 13: రహదారి రక్తసిక్తంగా మారింది. వేర్వేరు చోట్ల బస్సులు అదుపు తప్పి ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. పదుల సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరాఖండ్‌లో మంగళవారం ఉదయం ఓ బస్సు అదుపుతప్పి లోయలో పడి 13 మంది దుర్మరణం చెందారు. అల్మోరా నుంచి నైనిటాల్ జిల్లాలోని రామ్‌నగర్‌కు ప్రయాణికులతో వెళ్తున్న బస్సు తోటమ్ సమీపంలో అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 13 మరణించగా.. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. అత్యవసర చికిత్సకోసం క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాగా వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. ఈ బస్సులో డ్రైవర్ సహా 24 మంది ఉన్నట్టు సమాచారం.

బుగ్గిపాలైన బస్సు.. 13 మంది మృతి
టర్కీలో లారీని ఢీకొన్న బస్సు..
మంటలు రేగి పూర్తిగా దగ్ధం

టర్కీలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న బస్సు లారీని ఢీకొట్టడంతో మంటలు రేగి 13 మంది అగ్నికి ఆహుతయ్యారు. మరో 20 మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇస్తాంబుల్ నుంచి టోకట్‌కు 33 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ఉత్తర టర్కీలోని కోరమ్‌లో గల ఒస్మాన్సిక్-కర్గి హైవేలో లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సులో నుంచి తప్పించుకుని బయటపడలేక.. 13 మంది సజీవ దహనమయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తీవ్ర గాయాలపాలైన 20 మందిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. కాగా, ఘటన జరిగిన కొద్దిసేపటికే అక్కడికి చేరుకున్న ఫైరింజన్లు మంటలను ఆర్పే ప్రయత్నం చేశాయి. కానీ అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైపోయింది.





ఇథియోఫియాలో 38 మంది దుర్మరణం

ఉత్తర ఇథియోఫియాలోని లెగాంబోలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 48 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ఇక్కడి జెనెట్ సెలామ్ బెర్ ప్రాంతంలో అదుపు తప్పి.. ఐదు మీటర్ల లోయలో పడిపోయింది. దీంతో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, మృతుల్లో ఎక్కువ మంది యూనివర్సిటీ విద్యార్థులని తెలుస్తోంది.

ఆధార్ అనుసంధానం గడువు నిరవధికంగా పొడిగింపు

- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఆదేశాలు
- బ్యాంకు, ఫోన్, పాస్‌పోర్టుకు వర్తింపు



న్యూఢిల్లీ, మార్చి 13: ఆధార్ అనుసంధానంపై ప్రజలకు ఊరట లభించింది. ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లకు, తత్కాల్ పాసుపోర్టుకు అనుసంధానం చేయడంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ఈ నెల 31 వరకు విధించిన గడువును నిరవధికంగా పొడిగించింది. తుది తీర్పును వెలువరించే వరకు డెడ్‌లైన్ అంటూ ఏమీ ఉండదని స్పష్టంచేసింది. అయితే.. సంక్షేమ పథకాలకు మాత్రం ఈ గడువు వర్తిస్తుందని స్పష్టం చేసింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ ఇది అమలులో ఉంటుందని వెల్లడించింది. ఆధార్ అనుసంధానంపై దాఖలైన వేర్వేరు పిటిషన్లను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారించింది. మార్చి 31లోగా తుది తీర్పు వెల్లడించడం సాధ్యం కాదు కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నామని ధర్మాసనం అభిప్రాయ పడింది. ఆధార్ అనుసంధానం విషయం ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, స్టాక్ ఎక్స్చేంజి తదితర వ్యవస్థలపై ప్రభావం చూపే అవకాశమున్నందని అభిప్రాయపడింది. ఆధార్‌తో సంక్షేమ పథకాలు, బ్యాంక్ అకౌంట్లు, మొబైల్ నంబర్, పాన్ నంబర్ల అనుసంధానాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్‌లతోనూ ఆధార్‌ను అనుసంధానించే ఆలోచన చేస్తున్నది ప్రభుత్వం. గత ఏడాది డిసెంబర్ 15న సుప్రీంకోర్టు డెడ్‌లైన్‌ను మార్చి 31 వరకు పొడిగించింది. అయితే అసలు ఆధార్ రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ సుప్రీంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని పరిష్కరించకుండా ఈ అనుసంధానం సాధ్యం కాదని సుప్రీం కోర్టు పేర్కొంది.

ఎస్‌బీఐ ఖాతాదారులకు శుభవార్త

- కనీస నగదు నిల్వ లేని ఖాతాలపై అపరాధ రుసుము భారీగా తగ్గింపు
- 70 శాతం వరకు తగ్గించిన సంస్థ
- ఇకపై మెట్రో, పట్టణ ప్రాంతాల ఖాతాలకు రూ.15
- చిన్నపట్టణాలు, గ్రామీణ ప్రాంత ఖాతాలకు రూ.12



ముంబై, మార్చి 13: దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు భారతీయ స్టేట్ బ్యాంకు తన ఖాతాదారులకు శుభవార్త చెప్పింది. కనీస నిల్వలు లేని ఖాతాల నుంచి కొంతకాలంగా అపరాధ రుసుము వసూలు చేస్తోన్న బ్యాంకు తన నిర్ణయానికి సవరణలు చేసింది. అపరాధ రుసుమును 70శాతం మేర తగ్గించింది. ఇన్నాళ్లు మెట్రో, పట్టణ ప్రాంతాల్లోని శాఖల్లో ఉన్న ఖాతాల్లో కనీస నగదు నిల్వలు లేకపోతే గరిష్టంగా నెలకు రూ.50 జరిమానా విధించేవారు. దీనికి జీఎస్టీని జత చేసి వసూలు చేసేవారు. ఇప్పుడు ఆ రూ.50ను రూ.15కు తగ్గించారు. చిన్నపట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఉన్న రూ.40 అపరాధ రుసుమును రూ.12 చేశారు. వీటిపై జీఎస్టీ కింద మరో పది రూపాయలు వసూలు చేస్తారు. కాగా, ఎస్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయంతో 25 కోట్ల మంది ఖాతాదారులకు లబ్ధి పొందుతారు. వివిధ మార్గాల్లో వ్యాంకుకు వచ్చే ఆదాయం కంటే కనీస నగదు నిల్వలు లేని ఖాతాల నుంచి వసూలు చేస్తోన్న అపరాధ రుసుము వల్ల అధిక మొత్తం ఆర్జిస్తోందని విమర్శలు అధికమైన నేపథ్యంలో బ్యాంకు ఈ నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు, ఇతర సాధారణ వినియోగదారుల ఖాతాలను బ్యాంకు రెగ్యులర్ సేవింగ్స్ ఖాతాలుగా భావించి బ్యాంకు భారీగా అపరాధ రుసుము వసూలు చేసింది. ఖాతాదారులు నుంచి వస్తున్న ఒత్తిడి, వారి అభిప్రాయాలకు విలువిచ్చి ఈ అపరాధ రుసుమును తగ్గించామని ఎస్‌బీఐ ఉన్నతాధికారులు చెప్పారు. అయితే రెగ్యులర్ సేవింగ్స్ బ్యాంకు ఖాతాలను బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాగా మార్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని ఎస్‌బీఐ ప్రకటన చేసింది.

విదేశాంగ మంత్రికి ట్రంప్ ఉద్వాసన

- సీఐఏ డైరెక్టర్ పాంపియాకు పట్టం
- సీఐఏకు తొలి మహిళా డైరెక్టర్‌గా గినా



వాషింగ్టన్, మార్చి 13: అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్‌కు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉద్వాసన పలికారు. ఆయన స్థానంలో సీఐఏ డైరెక్టర్‌గా ఉన్న మైక్ పాంపియాకు పట్టంకట్టారు. గతవారమే తన పదవి నుంచి తప్పుకోవాల్సిందిగా టిల్లర్‌సన్‌కు ట్రంప్ సూచించారు. చాన్నాళ్లుగా టిల్లర్‌సన్‌తో ట్రంప్‌కు విభేదాలు ఉన్నాయని సమాచారం. అయితే, విదేశాంగ మంత్రిగా ఆయన అందించిన సేవలకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఈ శాఖ బాధ్యతలు చేపట్టబోతున్న మైక్ పాంపియోపై ప్రశంసలు కురిపించారు. ఉత్తర కొరియాతో చర్చల వ్యవహారం సాఫీగా జరిగిపోవాలన్నదే ఈ నిర్ణయం వెనక ఉద్దేశమని వైట్ హౌజ్ వర్గాలు వెల్లడించాయి. ఈమేరకు వైట్‌హౌజ్ అధికార వర్గాలు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. కాగా, విదేశాంగ మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న పాంపియా అమెరికా సైన్యంలో సేవలందించారని, హార్వర్డ్ నుంచి న్యాయవిద్యలో పట్టా పొందారని ట్రంప్ పేర్కొన్నారు. ప్రతినిధుల సభలోనూ పనిచేసిన అనుభవం ఆయనకుందన్ని పేర్కొన్నారు. విశేష అనుభవంతో మంత్రిగా పాంపియా రాణిస్తారని అభిప్రాయపడ్డారు. ఇక సీఐఏ డిప్యూటీ డైరెక్టర్ గినా హాస్పెల్‌ను సీఐఏ డైరెక్టర్‌గా నియమించారు. సీఐఏ చరిత్రలో డైరెక్టర్ పదవిలో కూచున్న తొలి మహిళగా గినా నిలవనున్నారని ట్రంప్ కొనియాడారు. ఇదో చరిత్రాత్మక మైలురాయని పేర్కొన్నారు.

లెక్చరర్‌ను కాల్చి చంపిన విద్యార్థి!

- హరియాణాలోని ఓ కళాశాలలో ఘటన

ఛండీగఢ్, మార్చి 13: హరియాణాలోని ఓ కళాశాలలో దారుణం జరిగింది. ఓ విద్యార్థి లెక్చరర్‌ను తుపాకీతో కాల్చి చంపాడు. కాల్పులకు దారి తీసిన కారణం తెలియలేదు. సోనేపట్‌లోని పిప్లీ గ్రామంలోని షాహీద్ దల్‌బీర్‌సింగ్ కళాశాల క్యాంపస్‌లో మంగళవారం ఈ ఘటన జరిగింది. రాజేశ్‌సింగ్ అనే అధ్యాపకుడు కళాశాలలోని ఓ గదిలో కూర్చొని ఉండగా గుర్తు తెలియని విద్యార్థి ఒకరు ఆ గదిలోకి ప్రవేశించి అతనిపై కాల్పులు జరిపారు. 4రౌండ్లు కాల్పుల అనంతరం విద్యార్థి అక్కడి నుంచి పారిపోయాడు. రాజేశ్ సింగ్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు చెప్పారు. మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర నుంచి 9గంటల మధ్య కాల్పుల ఘటన జరిగింది. మొఖానికి ముసుగు ధరించిన ఓ విద్యార్థి స్టైనో గదిలో కూర్చొని ఉన్న రాజేశ్ సింగ్‌పై కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడని, ముసుగు వల్ల విద్యార్థిని గుర్తించలేకపోయామని సంఘటనా స్థలంలో ఉన్న ఓ ఉపాధ్యాయుడు చెప్పాడు. విద్యార్థిని పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.

మరో ఘటనలో...

గుర్‌గ్రామ్‌లోని బాద్‌షాపూర్‌లో నివసిస్తున్న దంపతులపై అగంతకులు కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన భర్త ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. భార్య స్వల్పగాయాలతో బయటపడింది. ఈ దాడి వెనుక టిల్లు అనే రౌడీ షీటర్ హస్తం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.





నేలకు దిగిన గాలిమోటార్లు

65 విమానాల సేవలు రద్దు

- ఇండిగో 47.. గో ఎయిర్ 18 ఇంజిన్లలో సమస్యలే కారణం
- ప్రయాణికులకు నరకయాతన
- టికెట్ల డబ్బు రీఫండ్‌కు అవకాశం
- వేరే విమానాల్లో వెళ్లేందుకు చాన్స్

ముంబై, మార్చి 13: డీజీసీఏ ఆదేశాలతో దేశ విమానయాన రంగంలో ఒక్కసారిగా పెద్ద కుదుపు వచ్చింది. బడ్జెట్ విమానయాన సంస్థలైన ఇండిగో, గో ఎయిర్ సంస్థలు ఒకేసారి 65 విమానాలను ఆపేశాయి. గుర్‌గ్రామ్‌కు చెందిన ఇండిగో సంస్థ వద్ద రోజుకు మొత్తం వెయ్యికి పైగా విమానాలు నడుస్తుండగా... వాటిలో 47 విమానాలను ఆపేసింది. ఇక వాడియా గ్రూప్‌నకు చెందిన గో ఎయిర్ సంస్థ 18 విమాన సర్వీసులను రద్దుచేసింది. ఈ సంస్థ రోజుకు 230 విమానాలు నడిపిస్తుంది. రద్దయిన విమానాల్లో హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, పట్నా, శ్రీనగర్, భువనేశ్వర్, అమృతసర్, గువాహటి తదితర నగరాల నుంచి బయల్దేరేవి ఉన్నాయి. సోమవారం అహ్మదాబాద్ నుంచి లఖ్‌నవ్ బయల్దేరిన ఇండిగో విమానం గాల్లో ఉండగానే ఇంజిన్ లోపం కారణంగా తిరిగి అహ్మదాబాద్ వచ్చేయడంతో డీజీసీఏ కఠినంగా ఆదేశాలు జారీచేసింది. విమానా ప్రయాణాల్లో భద్రత అత్యంత కముఖ్యమని డీజీసీఏ డైరెక్టర్ సోమవారం జారీచేసిన ఆదేశాల్లో తెలిపారు. పిడబ్ల్యు1100 ఇంజన్లు బిగించిన ఎ320 నియో విమానాలను తక్షణం రద్దుచేయాలని ఆదేశించారు. ఇలాగే ఇంజిన్ సమస్యలు రావడంతో ఇండిగో ఎ320 నియో విమానాలను దర్దుచేశారు.

సోమవారం ఇండిగో, గో ఎయిర్ సంస్థలు 11 విమానాలు రద్దుచేయడంతో వందలాది మంది ప్రయాణికులు వివిధ విమానాశ్రయాలలో చిక్కుకుపోయారు. ప్రయాణికులు అదనపు చార్జీ ఏమీ చెల్లించాల్సిన అవసరం లేకుండా వేరే విమానంలో వెళ్లడానికి.. లేదా రద్దు చార్జీలు ఏమీ లేకుండా టికెట్ రద్దు చేసుకోడానికి అవకాశం కల్పించినట్లు ఇండిగో తెలిపింది. ప్రయాణికులకు దీనివల్ల కొంత అసౌకర్యం కలిగినా, వారి భద్రతే తమకు అత్యంత ముఖ్యమని పేర్కొంది. స్వదేశీ విమాన ప్రయాణికులలో 40% మంది ఇండిగో విమానాలు ఎక్కుతుంటే, మరో 10% మంది గో ఎయిర్ విమానాలు ఎంచుకుంటారు. వీళ్లంతా ఇప్పుడు పలు విమానాలు రద్దు కావడంతో ఇబ్బంది పడుతున్నారు.

రజనీ విధానాలనూ విమర్శిస్తా



- అందుకు ఏమాత్రం సిగ్గుపడేది లేదు
- వ్యక్తిగత విమర్శలకు మాత్రం దిగను
- అన్నాడీఎంకే అంటే ద్వేషం లేదు
- వాళ్ల ప్రభుత్వ విధానాలపైనే విమర్శ
- ఎంఎన్‌ఎం అధినేత కమల్‌హాసన్

చెన్నై, మార్చి 13: త్వరలోరాజకీయ పార్టీ పెట్టబోతున్న తోటి నటుడు రజనీకాంత్ విధానాలను విమర్శించడానికి తాను ఏమాత్రం సిగ్గ పడేది లేదని.. వెనకాడబోనని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) పార్టీ అధ్యక్షుడు కమల్‌హాసన్ తెలిపారు. అయితే తన విమర్శలు కేవలం రజనీకాంత్ పార్టీ విధానాలు, సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం అవుతాయని, తాను వ్యక్తిగత స్థాయికి దిగేది లేదని చెప్పారు. తమిళ వార్తాచానల్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయనీ విషయాలు తెలిపారు. రజనీకాంత్ వచ్చి.. పార్టీ పెట్టి.. దానికి పేరు పెట్టనివ్వాలని అన్నారు. తన పార్టీ విధానాలలో ప్రజాసంక్షేమమే ప్రధానంగా ఉంటుందని, ఆయన కూడా ఆయన విధానాలు వెల్లడిస్తే అప్పుడు చూద్దామని అన్నారు. ఒకవేళ ఏమైనా విభేదాలున్నా, తాను ఆయనను వ్యక్తిగా కాకుండా ఆయన విధానాలను మాత్రమే విమర్శిస్తానన్నారు. అలా విమర్శించాల్సి వస్తే మాత్రం చాలా గట్టిగానే విమర్శిస్తానని తెలిపారు. తన పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యోగాల కల్పనతోప ఆటు అందరికీ మంచి చదువు చెప్పిస్తానన్నారు. రాష్ట్రంలో ఇంతకుముందున్న ప్రభుత్వాలు అమలుచేసిన మంచి విధానాలను కూడా తాము స్వీకరిస్తామని, చెడ్డవి వదిలేస్తామని చెప్పారు. గాంధీజీ గురించి ఆయన విమర్శకులు చెప్పగా చాలా నేర్చుకున్నాను తప్ప ఆయన శిష్యులు చెప్పింది నేర్చుకోలేదని కమల్ అన్నారు. బాపూజీ ప్రవరించిన గ్రామీణ జాతీయవాదం విధానాన్ని తమ పార్టీ అమలు చేస్తుందని వివరించారు. తనకు అన్నాడీఎంకే అంటే ద్వేషం లేదని.. కేవలం ప్రస్తుత ప్రభుత్వాన్ని మాత్రమే విమర్శిస్తానని తెలిపారు. ప్రజాసంక్షేమం కోసం పనిచేసేవాళ్లంతా తన స్నేహితులేనని, కేవలం అధికారంలో ఉండి డబ్బు సంపాదించుకోవాలనుకునే వాళ్లు తన శత్రువులని చెప్పారు. తన పార్టీ పేరులోని మయ్యం అంటే కేంద్రీకృతం అని అర్థం వస్తుందని, ఇది తాను కనుగొన్నది కాదని.. ప్రపంచవ్యాప్తంగా అదే జరుగుతోందని అన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ తనను తాను సెంట్రిస్టుగా చెప్పుకొంటారని, చెకొస్లొవేకియా, బ్రెజిల్ లాంటి దేశాల్లో కూడా పార్టీలు ఇలా సెంట్రిస్టు వాదంతో నడుస్తున్నాయన్నారు. భారతదేశంలో కూడా సెంట్రిజం తరంగం రావాలని.. మనమంతా అందులో తేలియాడాలని ఆయన అభిలషించారు.

2025లోగా టీబీకి గుడ్‌బై



- ప్రపంచం కన్నా ముందే డెడ్‌లైన్
- ఈ మిషన్‌లో రాష్ట్రాలదే ప్రధాన పాత్ర
- కలిసిరావాలంటూ ప్రధాని మోదీ పిలుపు
- ఢిల్లీలో 'ఎండ్ టీబీ' సదస్సులో ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 13: దేశంలో 2025లోగా క్షయవ్యాధిని రూపుమాపుతామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ డెడ్‌లైన్ 2030 కాగా.. భారత్‌లో మాత్రం ఐదేళ్ల ముందుగానే టీబీకి చరమగీతం పాడాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈమేరకు దేశ రాజధాని ఢిల్లీలో ఎండ్ టీబీ సదస్సును ఆయన ప్రారంభించారు. క్షయ వ్యాధి రహిత భారత్‌కోసం, ప్రజల్లో ఈ దిశగా అవగాహనకోసం కార్యకర్తలను ప్రోత్సహించేందుకు ఇందులో చర్చ జరగనుంది. ఈ మహమ్మారిని దేశం నుంచి తరిమేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలంటూ ఆయన కోరారు. ఇందులో రాష్ట్రాలదే ప్రధాన పాత్ర అని చెప్పారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలంటూ అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు లేఖ రాసినట్లు మోదీ వివరించారు. అదేసమయంలో క్షయకు చికిత్స అందించే వైద్యులు, ఇతర వైద్యాధికారులు టీబీ రహిత భారత్‌లో కీలకపాత్ర పోషించనున్నారని ప్రధాని కొనియాడారు. ఒకరి నుంచి మరొకరి సులువుగా వ్యాపించే ఈ మహమ్మారి వల్ల 2016లోనే ఏకంగా 17 లక్షల మంది చనిపోయారని అన్నారు. ఇలా ప్రాణాలు కోల్పోయిన వారిలో చాలామంది బాధితులకు చికిత్స ద్వారా ప్రాణంపోసే అవకాశం ఉందని చెప్పారు. కాగా, ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలసి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తలపెట్టిన ఈ సదస్సులో ప్రపంచంలోని వివిధ దేశాల వైద్యులు, ప్రతినిధులు, నేతలు పాల్గొంటారని సమాచారం.



అమితాబ్‌కు తీవ్ర అస్వస్థత

షూటింగ్ సమయంలో అనారోగ్యం

- జోధ్‌పూర్‌లో చికిత్స అందజేత

జోధ్‌పూర్, మార్చి 13: బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ (75) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఉదయం రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో 'థగ్స్ ఆఫ్ హిందూస్థాన్' సినిమా షూటింగ్‌లో ఉన్న బిగ్ బీ అనారోగ్యం బారినపడ్డారు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, చిత్ర బృందం హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. మరోవైపు బిగ్ బీకి చికిత్స అందించడానికి ముంబై నుంచి జోధ్‌పూర్‌కు ప్రత్యేక వైద్య బృందం వెళ్లింది. అమితాబ్ కొన్నేళ్లుగా మెడ నొప్పి, వెన్నునొప్పితో బాధ పడుతున్నారు. ఏడు పదుల వయసులోనూ నవ యువకుడిలా సినిమాలు చేస్తున్న అమితాబ్ ఇలా అస్వస్థతకి గురవ్వడం అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఆయన త్వరగా కోరుకోవాలని ఆకాంక్షిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. థగ్స్ ఆఫ్ హిందూస్థాన్ చిత్రంతో పాటు బ్రహ్మాస్త్ర, 102 అనే చిత్రాలలోను బిగ్ బీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

దేశంలోనే ధనిక ఎంపీ 'జయాబచ్చన్'



- దంపతుల పేర్లపై 460 కోట్ల స్థిరాస్థులు
- మరో 540 కోట్ల చరాస్థులు కూడా
- బిగ్‌బీకి 36 కోట్ల ఆభరణాలు
- జయా బచ్చన్‌కు 26 కోట్ల నగలు
- దేశంలోని వివిధ నగరాలలో స్థలాలు

న్యూఢిల్లీ, మార్చి 13: సమాజ్ వాదీ పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థిగా బరిలో దిగిన జయాబచ్చన్ దేశంలోనే ధనిక ఎంపీ అభ్యర్థిగా నిలిచారు. ఇన్నాళ్లూ రవీంద్ర కిశోర్ సిన్హాకు దక్కిన ఆ ప్రత్యేకత ఇకపై జయాబచ్చన్ పరంకానుంది. తాజాగా రాజ్యసభ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులంతా తమ తమ ఆస్తులను ప్రకటించారు. మొత్తంగా 58 స్థానాలకోసం మార్చి 23న జరుగనున్న ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ సోమవారం(ఈ నెల 12తో) ముగిసింది. మంగళవారం(13న) నామినేషన్ల పరిశీలన జరిగింది. అయితే, ఇందులో మెజారిటీ స్థానాలు ఏకగ్రీవం కాబోతున్నాయనే విషయం తెలిసిందే! ఈ క్రమంలో అభ్యర్థులు ప్రకటించిన ఆస్తులలో జయాబచ్చన్ అత్యధిక ధనిక ఎంపీ అభ్యర్థిగా నిలిచారు. తన ఎన్నికల అఫిడవిట్లో రూ.1000కోట్ల ఆస్తులున్నట్లు ప్రకటించిన ఆమె దేశంలోనే ధనిక ఎంపీగా నిలవబోతున్నారు. 2012లో ఆమె తన ఆస్తిని రూ.460 కోట్లుగా చెప్పుకున్నారు. బచ్చన్ దంపతుల మొత్తం సంపదలో స్థిరాస్థి విలువ రూ.460 కోట్లుకాగా, చరాస్తుల విలువ రూ.540 కోట్లు. బిగ్ బీ అమితాబ్ బచ్చన్ దగ్గర రూ.36కోట్ల విలువచేసే ఆభరణాలున్నాయట. అదే జయ ఆభరణాల విలువ 26 కోట్లు. వీరికి ఫ్రాన్స్‌లోని బ్రిగ్నోగన్‌లో 3,175 చదరపు మీటర్ల నివాస స్థలం ఉంది. నోయిడా, భోపాల్, పుణె, అహ్మదాబాద్, గాంధీనగర్, ముంబై, లఖ్‌నవూలలో స్థలాలున్నాయని తెలిపింది.

మనం మూవీ
manammovie
బుధవారం, 14 మార్చి 2018 | హైదరాబాద్ | 8



రవితేజ

ఉగాదికి కొత్త లుక్

ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'సోగ్గాడే చిన్నినాయనా, రారండోయ్ వేడుక చూద్దాం' చిత్రాల దర్శకుడు కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో రాజా ది గ్రేట్ రవితేజ హీరోగా రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న సినిమా ఫస్ట్ లుక్‌ని తెలుగువారి మొదటి పండుగ ఉగాది సందర్భంగా విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి 'నేల టికెట్' అనే టైటిల్‌ని ఖరారు చేసినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే ఉగాది రోజున ఈ సినిమా టైటిల్ ఏమిటనే విషయంలో పూర్తి క్లారిటీ వస్తుంది. రవితేజ సరసన మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాశ్, రఘుబాబు, సుబ్బరాజు, అలీ, పోసాని కృష్ణమురళి, అన్నపూర్ణ, ప్రియదర్శి, సురేఖావాణి, ప్రవీణ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. దాదాపు 60% షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే చివరి వారంలో విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఫిదా ఫేం శక్తికాంత్ కార్తీక్ సంగీతం, ఛోటా కే ప్రసాద్ కూర్పు, బ్రహ్మ కడలి కళ, ముఖేష్ ఛాయాగ్రహణం సమకూరుస్తున్నారు.



హన్సిక, ప్రభుదేవా

మార్చి 23న 'గులేబకావళి'

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి' కల్యాణ్ దర్శకుడు. సీనియర్ నటి రేవతి ఓ శక్తిమంతమైన పాత్రలో నటించారు. తమిళనాట సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం అక్కడ ఘన విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రై. లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 23న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ ''తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తెలుగు నేటివిటికి దగ్గరగా వుంటుంది. యూనివర్శల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది. 'గులేబకావళి' అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. వినోదాత్మకంగా సాగే ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే హైలైట్‌గా నిలుస్తుంది'' అన్నారు. ప్రభుదేవా, హన్సిక, రేవతి, మన్సూర్ అలీఖాన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఫైట్స్: పీటర్ హెయిన్స్, సంగీతం: వివేక్ మెర్విన్, కెమెరా: ఆర్.ఎస్. ఆనంద్‌కుమార్, దర్శకత్వం: కల్యాణ్, నిర్మాత: మల్కాపురం శివకుమార్.

సుదీప్ ప్రేరణతో ఆర్య లుక్

'రాజరథం'లో ఆర్య ఫస్ట్ లుక్‌కి విశేష స్పందన రావడంతో ఆ లుక్ పాత్ర మీద అంచనాలు పెంచింది. ఆ లుక్ వాస్తవానికి ఈగ, బాహుబలి చిత్రాల్లో నటించిన సుదీప్ నుంచి ప్రేరణ పొంది రూపొందించినది. తన కెరీర్ ప్రారంభంలో అనూప్, నిరూప్‌ల తండ్రి సుధాకర్ భండారి 90లలో రూపొందించిన 'ప్రేమద కాదంబరి' అనే కన్నడ టెలి సీరియల్‌కి సుదీప్ పని చేశారు. అప్పటినుండి అనూప్, నిరూప్‌లు సుదీప్‌ని ఊహించుకుని తమ స్టోరీ ఐడియాస్‌ని చర్చించుకునేవాళ్ళు. అనూప్ తాను ఇంజనీరింగ్ చదివే రోజుల్లో సుదీప్ అంతవరకు చేయనటువంటి పోలీస్ పాత్రతో 'యోధ' అనే స్క్రిప్ట్ కూడా తయారు చేసుకున్నారు. అనూప్ తన దర్శకత్వంలో రూపొందించిన షార్ట్ ఫిలిం 'వర్డ్స్' అనేక అవార్డులు, ప్రశంసలు పొందింది. ఆ షార్ట్ ఫిలింకి సంబంధించి 2010లో ఒక ప్రెస్‌మీట్‌కి సుదీప్ గెస్ట్‌గా వచ్చి ఎంతో ప్రశంసించారు. అప్పట్లో 'రాజరథం' స్క్రిప్ట్ తొలి దశలోనే ఉంది. ఆ ప్రెస్‌మీట్‌కి సుదీప్ బ్లూ కుర్తా, జీన్స్, సాండల్స్‌లో వచ్చారు. ఆ గెటప్‌లో సుదీప్‌ని చూసిన అనూప్‌కి తన 'రాజరథం'లోని విశ్వ పాత్ర గుర్తొచ్చింది. తాను విశ్వ పాత్ర ఆహార్యం ఎలా ఉండాలనుకున్నాడో సుదీప్ ఆరోజు అలానే కనిపించారు. 'రాజరథం' ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలయ్యాక, అనూప్ తన భార్య, 'రాజరథం'కి కాస్ట్యూమ్ డిజైనర్ అయిన నీతా షెట్టికి ఈ విషయం చెప్పారు. దానినే రిఫరెన్స్‌గా తీసుకుని నీతా షెట్టి.. ఆర్య లుక్‌ని డిజైన్ చేయడం జరిగింది. దర్శకుడు అనూప్ భండారి ఆర్య గురించి చెప్తూ ''ఆర్య పెద్ద హీరో అయినా ఎంతో వినయంగా ఉంటారు. సెట్‌లో కరెక్ట్ టైంకి ఉంటారు, పాత్ర కోసం ఏమడిగినా కాదనకుండా చేస్తారు'' అన్నారు. రొమాంటిక్ మ్యూజికల్ కామెడీ 'రాజరథం' ప్రపంచవ్యాప్తంగా మార్చి 23న విడుదలవుతోంది. జాలీ హిట్స్ బ్యానర్‌పై అజయ్‌రెడ్డి, అంజు వల్లభనేని, విషు దకప్పగారి, సతీష్‌శాస్త్రి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





విద్యాబాలన్

ఎన్టీఆర్ సతీమణిగా...

స్వర్గీయ నందమూరి తారక రామారావు జీవితకథ ఆధారంగా తేజ దర్శకత్వంలో 'యన్.టి.ఆర్.' పేరుతో సినిమా ప్రారంభించబోతున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్ పాత్రలో నందమూరి బాలకృష్ణ నటిస్తూ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసుకున్న ఈ సినిమా షూటింగ్ మార్చి నెలాఖరులో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ యువకుడిగా ఉన్న పాత్రలో శర్వానంద్ నటిస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకు సంబంధించి మరో ముఖ్యమైన వార్త చిత్ర పరిశ్రమలో చక్కర్లు కొడుతోంది. ఎన్.టి.రామారావు సతీమణి బసవతారకం పాత్ర కోసం ఎంతో మంది పేర్లను పరిశీలించిన చిత్ర యూనిట్ చివరికి బాలీవుడ్ హీరోయిన్ విద్యాబాలన్‌ను ఎంపిక చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. అయితే ఈ విషయం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ఐదేళ్ళ తర్వాత..



భాస్కర్

'బొమ్మరిల్లు' చిత్రంతో ఉత్తమ తొలి చిత్ర దర్శకుడుగా, ఉత్తమ స్క్రీన్‌ప్లే రైటర్‌గా నంది అవార్డు అందుకున్నారు భాస్కర్. ఈ సినిమాతో అందరి దృష్టినీ ఆకర్షించారు. ఆ తర్వాత భాస్కర్ చేసిన 'పరుగు' చిత్రం కూడా కమర్షియల్‌గా పెద్ద హిట్ అయింది. రామ్‌చరణ్‌తో చేసిన 'ఆరెంజ్'.. అప్పటివరకు దర్శకుడిగా భాస్కర్‌కి ఉన్న పేరుని ఒక్కసారిగా మార్చేసింది. ఆ సినిమా ఘోర పరాజయాన్ని చవిచూసింది. 'ఆరెంజ్' తర్వాత భాస్కర్‌కి అవకాశాలు రాలేదు. చాలా గ్యాప్ తర్వాత రామ్‌తో 'ఒంగోలు గిత్త' చేశారు. అది కూడా వర్కవుట్ అవ్వలేదు. 2016లో ఓ తమిళ సినిమా చేశారు. అది కూడా భాస్కర్‌కి ఉపయోగపడలేదు. దాదాపు 5 సంవత్సరాల తర్వాత తెలుగులో ఓ సినిమా చేసే అవకాశం వచ్చిందని వార్తలు వస్తున్నాయి. గోపీచంద్ హీరోగా ఓ విభిన్న చిత్రాన్ని తెరకెక్కించేందుకు భాస్కర్ కసరత్తులు చేస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం కథా చర్చల దశలోనే ఉన్న ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు ప్రకటించాల్సి ఉంది. అలాగే అల్లు అరవింద్, సురేష్‌బాబు బేనర్స్‌లో కూడా సినిమాలు చేయడానికి భాస్కర్ రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరి ఈ సంవత్సరం భాస్కర్‌కి ఎంతవరకు కలిసొస్తుందో చూడాలి.



'మహిళా కబడ్డీ' మొదటి పాట!

ఆర్.కె. ఫిలింస్ పతాకంపై ప్రతాని రామకృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'మహిళా కబడ్డీ'. రచన స్మిత్ ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఇటీవలే మూడవ షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ చిత్ర కోసం ఉగాది పండుగపై ఒక ప్రత్యేక పాటను సంగీత దర్శకుడు బోలే షావళి సంగీత సారథ్యంలో రూపొందించడం జరిగింది. మంగళవారం ఈ పాటను ఫిలిం ఛాంబర్‌లో 'మా' అధ్యక్షుడు శివాజీరాజా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివాజీరాజా మాట్లాడుతూ ''ఆర్.కె.ఫిలింస్ అంటే నా సొంత బేనర్ లాంటిది. నా కెరీర్ ప్రారంభ దశలో ఈ బేనర్‌లో నటించాను. అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య మంచి సాన్నిహిత్యం ఉంది. ఉగాది పండుగపై చేసిన పాటను నేను లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ పాటతో ఉగాది పండుగ ముందే వచ్చినట్టుగా అనిపిస్తోంది'' అన్నారు. దర్శక నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ ''మా బేనర్‌లో చాలా గ్యాప్ తర్వాత నేను దర్శకత్వం వహిస్తూ నిర్మిస్తోన్న చిత్రమిది. ఒక పల్లెటూరు అమ్మాయి భారతదేశం గర్వపడే స్థాయిలో కబడ్డీ ఛాంపియన్‌గా ఎలా ఎదిగిందనేది ఈ సినిమా కథాంశం. మా బేనర్ తొలి హీరో అయిన శివాజీ రాజాగారి చేతుల మీదుగా మా చిత్రంలోని తొలి పాట లాంచ్ చేయడం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు. తెలుగు ఫిలిం చాంబర్ సెక్రటరీ ముత్యాల రాందాస్ మాట్లాడుతూ ''ఉగాదిపై చేసిన పాట ఉగాది పండుగలా అద్భుతంగా ఉంది'' అన్నారు. సంగీత దర్శకుడు బోలే షావళి మాట్లాడుతూ ''ఉగాది పండుగపై పాట రాసి, కంపోజ్ చేసే అవకాశం ఇచ్చిన ప్రతానిగారికి నా ధన్యవాదాలు'' అన్నారు.

తమన్నా మారిపోయింది



అందంలో, అభినయంలో తనకంటూ ఓ ప్రత్యేకతను కనబరిచే తమన్నా ఓ కొత్త విషయాన్ని ప్రస్తావించింది. తను ఇంతకుముందులా కాదని, పూర్తిగా మారిపోయానని అంటోంది. సినిమా తారలు తమ అందాన్ని కాపాడుకునేందుకు యోగాని ఆశ్రయిస్తున్నామని చెప్తుంటారు. ఇప్పుడు తమన్నా కూడా అదే దారిలో వెళ్తోంది. 28 సంవత్సరాలు పైబడినా తను టీనేజ్ అమ్మాయిలా కనిపిస్తోందంటే దానికి యోగానే కారణమని చెప్తోంది తమన్నా. హైదరాబాద్‌లోని భరత్ ఠాకూర్ యోగా ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతోందామె. ''నేనెప్పుడూ చిన్నపిల్లలా కనిపించేదాన్ని, అలాగే ప్రవర్తించేదాన్ని కూడా. భరత్ ఠాకూర్ యోగా ఇన్‌స్టిట్యూట్‌లో చేరిన తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. ఆ ఇన్‌స్టిట్యూట్‌లో ట్రైనర్ రుషి నాకు యోగాలో మంచి శిక్షణ ఇచ్చారు. శారీరకంగా, మానసికంగా ఎలా ఉత్సాహంగా ఉండాలన్న విషయాలను నేర్పారు. నేను షూటింగ్స్‌తో ఎంత బిజీగా ఉన్నా యోగా విషయంలో చాలా చాలా సీరియస్‌గా ఉన్నాను. ఇప్పుడు యోగా నా జీవితంలో ఓ భాగమైపోయింది'' అంటోంది మిల్కీబ్యూటీ.

మళ్ళీ తెరపైకి..



భాగ్యశ్రీ

'మైనే ప్యార్ కియా' చిత్రంతో అప్పట్లో యువతకి పిచ్చెక్కించిన భాగ్యశ్రీ అందరికీ గుర్తుండే ఉంటుంది. తెలుగులో 'ప్రేమపావురాలు' పేరుతో ఆ సినిమా అనువదించబడింది. తెలుగులోనూ ఆమెకు విపరీతమైన ఫాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. సల్మాన్ ఖాన్, భాగ్యశ్రీ జంటగా రాజశ్రీ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా అప్పట్లో పెద్ద సంచలనం. ఆ సినిమాలో భాగ్యశ్రీ అభినయానికి అందరూ ముగ్ధులైపోయారు. ఆ సినిమా తర్వాత కొన్ని సినిమాల్లో నటించినా ఆమెకు అంత పేరు రాలేదు. చాలా గ్యాప్ తర్వాత మళ్ళీ నటనపై దృష్టి పెట్టింది భాగ్యశ్రీ. చేతన్ భగత్ రాసిన నవల ఆధారంగా బాలీవుడ్‌లో తెరకెక్కిన '2 స్టేట్స్' చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో అడివి శేష్, డా.రాజశేఖర్ కుమార్తె శివాని జంటగా నటించనున్నారు. ఈ సినిమాలో హీరో తల్లిగా భాగ్యశ్రీ కనిపించబోతోంది. 'ఓంకారం', 'యువరత్న రాణా' చిత్రాల తర్వాత భాగ్యశ్రీ తెలుగులో నేరుగా నటిస్తున్న చిత్రమిదే.

నాగార్జున సరసన అమల



నాగార్జున, నాని హీరోలుగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో అశ్వనీదత్ ఓ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి 18న ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ అమెరికాలో జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే ఈ సినిమాలో నాగార్జున సరసన అమలా పాల్ హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. నాగచైతన్యకు జోడీగా 'బెజవాడ' చిత్రంలో నటించిన అమల ఇప్పుడు నాగార్జున సరసన నటించేందుకు ఓకే చెప్పిందని సమాచారం. నాని సరసన కన్నడ హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తుందని తెలుస్తోంది. అయితే ఈ ఇద్దరు హీరోయిన్ల విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

కొండవీటి కోట నేపథ్యంలో..




చిత్రం శ్రీను

సోలో స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సురేంద్ర కమల్(సురేంద్ర వంటిపులి) నిర్మిస్తున్న థ్రిల్లర్ 'విశ్వదాభిరామ'. సురేష్ కాశీ, సురేంద్ర కమల్, అశోక్ చక్రం త్రయం దర్శకులు. చిత్రం శ్రీను ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో భువన్ తేజ్, అనిల్, ఆనంద్, సహస్ర, రాజారెడ్డి, మానస ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం గురించి దర్శకులు మాట్లాడుతూ ''కొండవీటి కోట నేపథ్యంలో జరిగే డెత్ గేమ్ థ్రిల్లర్ 'విశ్వదాభిరామ'. ఇప్పటి వరకు కామెడీ పాత్రల్లో అలరించిన చిత్రం శ్రీను తొలిసారి విలన్‌గా ఈ చిత్రంలో నటిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామన్నారు. ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు: సురేష్ కాశీ, కెమెరా: అజీమ్, తరుణ్ సోనూ, నిర్మాత: సురేంద్ర కమల్ (సురేంద్ర వంటిపులి) దర్శకత్వం: సురేష్ కాశీ, సురేంద్ర కమల్, అశోక్ చక్రం.

ప్రజల గొంతు ధ్వనించాలి

- పార్లమెంట్‌కు గైర్హాజరు కావొద్దు
- అందరూ కలిసికట్టుగా పోరాడాలి
- సస్పెండ్ చేస్తే బయటకొచ్చి నిరసన
- రాష్ట్రంలో సంఘీభావంగా ర్యాలీలు
- టీడీపీ ఎంపీలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



అమరావతి, మార్చి 13 (మనం ప్రతినిధి): ఐదు కోట్ల ఆంధ్రుల గొంతుక పార్లమెంట్‌లో ప్రతిధ్వనించాలని, ఆ బాధ్యత ఎంపీలు తీసుకోవాలని టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఢిల్లీలో ఉన్న టీడీపీ ఎంపీలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ''పునర్వ్యవస్థీకరణ చట్టం, హామీల అమలుపై మంగళవారం శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేస్తాం. ఢిల్లీలో ఎంపీల పోరాటానికి సంఘీభావంగా స్థానికంగా క్యాండిల్ ర్యాలీలు నిర్వహించాలి. అక్కడ, ఇక్కడ ఆందోళనలు నిర్మాణాత్మకంగానే జరగాలి. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలి.ప్రజల తరపునే ప్రతినిధులు నిలబడాలి. ప్రజల గొంతు పార్లమెంటులో ప్రతిధ్వనించాలి. 5 కోట్ల ప్రజల మనోభావాలపై కేంద్రం ఉదాసీనత భావ్యంకాదు. మన పోరాటం నిర్మాణాత్మకంగానే జరగాలి,అభివృద్ధి ఆగిపోరాదు. మన హక్కుల్లోనూ రాజీలేదు'' అని చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ ఎంపీలంతా కలిసికట్టుగా ఉండి పోరాటాలు చేయాలని సూచించారు. పార్లమెంట్‌లో పోరాడాల్సిన కీలక సమయమని, ఈ సమయంలో సభకు ఎవరూ గైర్హాజరు కారాదని ఆదేశించారు. కేంద్రం నుంచి ఎంత వచ్చింది? ఇంకా ఎంత రావాలి? అనే అన్ని అంశాలు ఆన్‌లైన్‌లో పెట్టామని, యూసీలు, డీపీఆర్ లు కూడా ఆన్‌లైన్ లోనే ఉన్నాయని వీటిని ఎంపీలు వినియోగించుకోవాలన్నారు. సభ నుంచి సస్పెండ్ చేస్తే బయట నుంచి పోరాటం ఉధృతం చేయాలని సూచించారు. విభజన చట్టం, హామీలపై సమీక్ష చే సి దేశం మొత్తానికి తెలిసేలా పార్లమెంట్‌లో మాట్లాడాలన్నారు. ఏ సభ సాక్షిగా ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందో.. అక్కడే రాష్ట్రానికి న్యాయం జరగాలన్నారు. ఏ పార్టీలైతే ఏపీకి అన్యాయం చేశాయో అవే న్యాయం చేసేలా ఒత్తిడి తేవాలని సూచించారు.

జాతీయ చానళ్లలో డిబేట్లు..

''ప్రత్యేక హోదా తమ హక్కు అని.. కేంద్రం ఎందుకివ్వదు అని ప్రజలు భావిస్తున్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగానే టీడీపీ ఎంపీల పోరాటం ఉండాలి. జాతీయ ఛానళ్లలో డిబేట్లలో తెలుగుదేశం పార్టీ గళం వినిపించాలి. రాష్ట్ర ప్రజానీకం మనోభావాలను దేశం దృష్టికి తీసుకెళ్లాలి. శాసన సభ, మండలి విప్‌లు, చీఫ్ విప్‌లు ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకోవాలి. పార్లమెంటులో ఇతర పార్టీల ఎంపీలను కూడా సమన్వయం చేసుకోవాలి. విశాఖకు రైల్వే జోన్ ఇచ్చేదిలేదని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొనడం దురదృష్టకరం. ఒకవైపు ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆవేదన ఉందని, ఎంపీలు పోరాటం చేస్తుంటే, వారిని మరింత రెచ్చగొట్టేలా ఇటువంటి అంశాలను ప్రచారం చేయడం సమంజసం కాదు. తొలి ఏడాది పీఆర్‌సీ చెల్లింపులు, ఇతర ఖర్చులు వాయిదా వేసుకుని రైతులకు రుణ ఉపశమనం కింద రూ.7,500కోట్లు ఇస్తే, వాయిదా వేసుకున్న ఖర్చులను కూడా చెల్లించేది లేదని కేంద్రం తిరస్కరించడాన్ని తప్పుబట్టారు. తమకు కేంద్రం న్యాయం చేస్తుందని ఆశించి 4 ఏళ్లు ఎదురు చూసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలను కేంద్రం తీవ్ర అసంతృప్తికి గురిచేసింది'' అని చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత సుజనా చౌదరి, లోక్‌సభలో టీడీపీ పక్షనేత తోట నరసింహం, ఎంపీలు గల్లా జయదేవ్, అవంతి శ్రీనివాసరావు, శాసనమండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్, ఎమ్మెల్సీటీడీ జనార్దన్ తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, శాసనసభ వ్యూహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో భావోద్వేగంతో చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ప్రసంగిస్తూ తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు. రాజధాని నిర్మాణంపై మాట్లాడుతూ.. బాబు భావోద్వేగానికి లోనయ్యారు. ''రాజధాని అంటే డ్రీమ్ సిటీ అని హేళన చేస్తారా? రాజధానికి సహకరించాల్సిన బాధ్యత కేంద్రానికి లేదా? ఆర్థికంగా బలంగా ఉన్న బెంగళూరు మెట్రోకు రూ.17వేల కోట్లు ఇచ్చారు. ముంబై, బెంగళూరుకు నిధులిచ్చి ఏపీకి ఎందుకివ్వడం లేదు?. రాజధాని నిర్మాణం పూర్తయితే కేంద్రానికే ఎక్కువ ఆదాయం. పొరుగు రాష్ట్రాల కంటే గొప్పగా రాజధాని నిర్మించాలన్నది నా కల'' అని చంద్రబాబు చెప్పుకొచ్చారు. ''2018లోగా దుగరాజపట్నం పోర్టు పూర్తి చేయాలని చట్టంలో ఉంది. నాలుగేళ్ల తర్వాత మరో ప్రాంతం చూపించమంటున్నారు. సంస్థల విభజన ఆలస్యం వల్ల రూ. 3820 కోట్ల ఆదాయం తెలంగాణకే పోతోంది. విశాఖలో మెట్రోరైలు ఎందుకు సాధ్యం కాదు. కేంద్రం వల్లే విజయవాడ ఫ్లైఓవర్ నిర్మాణం ఆలస్యం అవుతోంది. రోడ్లు వేసి టోల్‌ఫీజు వసూలు చేస్తున్నారు'' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై శాసనసభ తీర్మానం

''ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని అంశాలు, నాటి ప్రధాని ఇచ్చిన హామీల అమల్లో జరుగుతున్న జాప్యం, వీటి విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల రాష్ట్ర శాసనసభ తీవ్ర అభ్యంతరాన్ని, నిరసనను వ్యక్తం చేస్తోంది. రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరిగింది. నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. ఆస్తుల అప్పుల విభజనలో, విద్యుత్ పంపిణీలో, పన్నుల వసూళ్లు, తిరిగి చెల్లింపుల్లో రాష్ట్రానికి మిక్కిలి నష్టం జరిగింది. చట్టంలో పేర్కొన్న ప్రకారం రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం చేయాలి. రాష్ట్రానికి రైల్వే జోన్ రావాలి. ఉక్కు కర్మాగారం స్థాపించాలి. ఓడరేవు రావాలి. పెట్రో కెమికల్ పరిశ్రమ ఏర్పాటుకావాలి. నియోజకవర్గాల సంఖ్య పెరగాలి. అనేక విద్యా, పరిశోధన సంస్థలు ప్రారంభించాలి. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన పూర్తికావాలి. విభజన బిల్లు రాజ్యసభలో ఆమోదింప చేయడానికి ఆనాటి ప్రధానమంత్రి ఆరు హామీలతో కూడిన ప్రకటన చేశారు. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయాన్ని అందించడం, రైల్వేజోన్ ఇవ్వడం కుదరదని కేంద్రం అంటోంది. ఉక్కు కర్మాగారం లాభసాటి కాదంటున్నారు. ఓడ రేవుకు అభ్యంతరాలు పెడుతూ తాత్సారం చేస్తున్నారు. పెట్రో కెమికల్ పరిశ్రమకు సుమారు రూ. ఐదుకోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ భారం రాష్ట్రం భరించాలంటున్నారు. విద్యా సంస్థల పురోగతి మందకొడిగా ఉంది. ఇప్పుడు ఇస్తున్న కేటాయింపులను చూస్తే ఇవి వచ్చే ఇరవై యేళ్ళకైనా పూర్తవుతాయా..? అన్న సందేహం కలుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన ఊసే లేదు. యుటిలైజేషన్ సర్టిఫికేట్లు ఇచ్చినా ఇవ్వలేదన్నట్లు ప్రకటనలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. రాష్ట్రం పట్ల కేంద్రం అవలంబిస్తున్న ఈ నిర్లక్ష్య ధోరణిని శాసనసభ తీవ్రంగా ఖండిస్తోంది. పోలవరం మన రాష్ట్రానికి జీవనాడి. దీనికి కేంద్రం సాయం మందగించడం దురదృష్టకరమని శాసనసభ భావిస్తోంది. మనం ఖర్చు చేసిన సుమారు రూ. రెండున్నర వేల కోట్లకు పైగా మొత్తం కేంద్రం నుంచి ఇంకా రావాల్సి ఉంది. రాష్ట్రానికి చట్టపరంగా దక్కాల్సిన అంశాల పట్ల కేంద్ర ప్రభుత్వంలోని బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు హేళనగా మాట్లాడడాన్ని ఈ శాసనసభ తీవ్రంగా పరిగణిస్తోంది. కేంద్రానికి రాష్ట్రం పట్ల బాధ్యత ఉంది. మరీ ముఖ్యంగా రాష్ట్ర ప్రజల అభీష్టానికి విరుద్ధంగా, అన్యాయంగా విభజన జరిగి కష్టాలలో ఉన్న మన రాష్ట్రం పట్ల ఆ బాధ్యత మరింత ఎక్కువ. మనం నిలదొక్కుకుని, దక్షిణ భారతంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా ఎదిగేంత వర కూ కేంద్రం చేయూత అందించాలి. చట్టంలో లేనివీ, పార్లమెంటు సాక్షిగా ప్రధాని ఇచ్చిన హామీలలో లేనివీ అడగడం లేదు. చట్టబద్ధమైన డిమాండ్లనీ, న్యాయమైన కోర్కెలనీ కేంద్రం గుర్తించి వ్యవహరించాలని కోరుతూ శాసనసభ తీర్మానిస్తోంది'' అని ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులు గట్టిగా బల్లలు చరుస్తూ తమ ఆమోదముద్రను తెలియజేశారు.




మూడూ ఏకగ్రీవం!

- ప్రశాంతి రెడ్డి నామినేషన్ ఉపసంహరణ
- మూడు స్థానాలకూ ముగ్గురు అభ్యర్థులే
- రాజ్యసభకు వేమిరెడ్డి, రమేశ్, రవీంద్ర
- అధికారిక ప్రకటన ఇక లాంఛనమే

అమరావతి, మార్చి 13: ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. వైసీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి భార్య ప్రశాంతి రెడ్డి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో మూడు స్థానాలకు ముగ్గురు అభ్యర్థులే బరిలో ఉండటంతో ఎన్నిక ఏకగ్రీవం అయినట్లయింది. వైసీపీ నుంచి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నుంచి సీఎం రమేష్, కనకమేడల రవీంద్ర కుమార్ రాజ్యసభకు ఎన్నికకానున్నారు. దీనిపై అధికారిక ప్రకటన రావడం ఇక లాంఛనమే. వైసీపీ తరపున రాజ్యసభ అభ్యర్థిగా నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. ఆయనకు అనుబంధంగా ఆయన భార్య ప్రశాంతిరెడ్డి కూడా నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం ప్రశాంతిరెడ్డి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఇక టీడీపీ అభ్యర్థుల ఎంపికపై చివరి వరకూ తర్జన భర్జన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. సీఎం రమేశ్‌తో పాటు అనూహ్యంగా పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి కనకమేడల రవీంద్రను ఎంపిక చేశారు. వర్ల రామయ్య, బీద మస్తాన్‌రావ సహా పలువురి పేర్లు పరిశీలనకు వచ్చినా చంద్రబాబు.. రవీంద్ర వైపు మొగ్గు చూపారు. సీఎం రమేశ్, రవీంద్ర సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. మూడో అభ్యర్థిని టీడీపీ బరిలోకి దింపనున్నట్టు మొదట వార్తలు వచ్చినా.. తాజా రాజకీయ పరిస్థితుల్లో ఇద్దరినే పోటీకి నిలబెట్టారు. దీంతో రాజ్యసభ ఎన్నికలు లేకుండా మూడు స్థానాలూ ఏకగ్రీవమయ్యాయి.

వ్యక్తిగత భద్రత కల్పించండి

- డీజీపీకి పవన్ కల్యాణ్ లేఖ



అమరావతి, మార్చి 13: తనకు వ్యక్తిగత భద్రత కల్పించాలని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. డీజీపీ మాల కొండయ్యను కోరారు. మంగళవారం ఆయన ఈ మేరకు లేఖ రాశారు. బుధవారం గుంటూరులో జరిగే జనసేన ఆవిర్భావ సభకు భద్రత కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ.. తనకు కల్పిస్తున్న వ్యక్తిగత భద్రతను సభ అనంతరం కూడా కొనసాగించాలని పవన్ కోరారు. ప్రస్తుతం సమాజంలో ఉన్న కుల ఉద్యమాలు, వర్గ పోరాటాలు, రాజకీయ అణచివేతల మధ్య తన భద్రత సున్నితమైన సామాజిక రాజకీయ సమస్యలతో ముడిపడి ఉందని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. తనపై దాడి జరిగితే ప్రజా జీవితంపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముందని పేర్కొన్నారు. గతంలో తన పర్యటనలు, సభల సందర్భంగా తొక్కిసలాట జరగడం, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటం వంటి సంఘటనలను లేఖలో వివరించారు. పోలీసులు తనకు భద్రత కల్పించకపోతే తన పర్యటన సందర్భంగా ఏవైనా అనివార్యమైన సంఘటనలు జరిగితే వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పవన్ పేర్కొన్నారు.

పశువులకు దాణామృతం

- చౌకధరకు బలవర్ధక పోషకాహారం
- రాష్ట్రంలో 12 యూనిట్ల ఏర్పాటు
- 50 శాతం సబ్సిడీ: మంత్రి ఆది

అమరావతి, మార్చి 13 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో పశుగణాభివృద్ధితో పాడి పరిశ్రమను వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పశువులకు బలవర్ధక పోషకాహారాన్ని చౌకధరకు అందించేందుకు వీలుగా సబ్సిడీ ఇచ్చి దాణామృతం తయారీ యూనిట్లను ఏర్పాటు చేయిస్తున్నట్లు మంత్రి సి. ఆదినారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు.. మంగళవారం సచివాలయంలో మంత్రి సబ్సిడీ పత్రాలను అందచేశారు. రూ. 61.01 కోట్ల వ్యయంతో ఏర్పాటవుతున్న ఈ యూనిట్లకు 50 శాతం సబ్సిడీని పశుసంవర్ధక శాఖ అందజేస్తోంది. పశుసంవర్ధక శాఖ అభివృద్ధి 11 నుంచి 12 శాతంగా ఉందని, దీన్ని 20 శాతానికి పెంచాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని మంత్రి ఈ సందర్భంగా వివరించారు. అందుకు అనుగుణంగానే పశువుల కోసం బలవర్ధక దాణా తయారీని ప్రోత్సహించి, పాడి రైతాంగానికి అందజేయాలని పశుసంవర్ధక శాఖ నిర్ణయించిందని అన్నారు. జిల్లాకు ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇప్పుడు 12 యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చారని తెలిపారు. పంట తీసుకున్న తర్వాత వృథాగా పోతున్న మొక్కజొన్న, కందులు, మినుము, శనగ తదితర మొక్కలను రైతుల నుంచి సేకరించి వాటికి పోషకాలను జోడించి దాణామృతాన్ని ఈ యూనిట్లు తయారు చేస్తాయని మంత్రి వివరించారు. దాణామృతం తయారీలో ఎక్కడా నాణ్యతా లోపం ఉండరాదని, ఆలాగే పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని మంత్రి ఈ యూనిట్ల పారిశ్రామికవేత్తలకు స్పష్టం చేశారు. సంపాదనే కాదు, రైతు సంక్షేమం, పశువుల ఆరోగ్యం కూడా ముఖ్యమన్నది గుర్తుంచుకోవాలని తెలిపారు. పాడిరైతులందరూ ఈ దాణామృతాన్ని వినియోగించుకొని లబ్ధి పొందాలని కోరారు. పశువుల్ని ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసుకొనేందుకు పాడిరైతులకు



వెసులుబాటు కల్పించామని మంత్రి పేర్కొంటూ ఇలా సరిహద్దు పొరుగు రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన పశువుల్ని స్వగ్రామాలకు తీసుకువచ్చేందుకు రవాణా వ్యయాన్ని సమకూర్చాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. పశువులకు చేస్తున్న బీమా ప్రీమియంను కూడా తగ్గించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి తెలిపారు. దాణామృతం తయారీ యూనిట్ల ఏర్పాటుకు తోడు గ్రామాల్లో మోగా పశుగ్రాస క్షేత్రాలను కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆ శాఖ డైరక్టర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విపక్షాలకు సోనియా విందు

- హాజరైన 20 పార్టీల నేతలు, ప్రతినిధులు

న్యూఢిల్లీ, మార్చి 13: వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునియూపీఏ అధ్యక్షురాలు సోనియా గాంధీ మంగళవారం ప్రతిపక్షాలకు విందు ఇచ్చారు. ఢిల్లీలోని టెన్ జన్‌పథ్‌లోని సోనియా నివాసంలో జరిగే ఈ కార్యక్రమానికి 17 పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. తృణమూల్ కాంగ్రెస్,డీఎంకే, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, ఎన్‌సీపీ, లెఫ్ట్ పార్టీలు, జేడీఎస్, కేరళ కాంగ్రెస్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఆర్‌ఎల్‌డీ, జనతాదళ్ రెబల్ పార్టీలు ఈ విందుకు హాజరయ్యారు. జార్ఖండ్‌కు చెందిన బాబూలాల్ మరాండీ, జార్ఖండ్ ముక్తి మోర్చాకు చెందిన హేమంత్ సోరెన్‌లు కూడా విందుకు వచ్చారు. ముఖ్యంగా ఎన్‌సీపీ నేత శరద్‌పవార్, జేడీయూ రెబెల్ నేత శరద్‌యాదవ్ తదితరులు విందు సమావేశానికి హాజరయ్యారు.

ఆర్టీసీకి 1500 కోట్లివ్వండి

- రవాణాశాఖ మంత్రికి టీజేఎంయూ వినతి

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): టీఎస్‌ఆర్టీసీని ఆదుకోవాలని టీజేఎంయూ ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీకి ఈసారి బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటాయించాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డికి టీజేఎంయూ నేతలు మంగళవారం వినతిపత్రమిచ్చారు. కొత్త బస్సులు కొనుగోలు చేసేందుకు, సిబ్బంది నియామకాలకు నిధులు కేటాయించి ఆర్థికంగా నష్టాల్లో ఉన్న సంస్థను కాపాడాలని టీజేఎంయూ అధ్యక్షుడు సుధాకర్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎంయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వడ్డేమాన్ స్వాములయ్య, గోలి రవీందర్, తదితరులు ఉన్నారు.

ఎన్డీయేలో ఎందుకున్నారు?


బయటకు వచ్చి టీడీపీ పోరాడాలి: రామకృష్ణ

విజయవాడ, మార్చి 13: కేంద్రంలో టీడీపీ మంత్రులతో రాజీనామా చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంకా ఎన్డీయేలో ఎందుకు కొనసాగుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీయే నుంచి టీడీపీ బయటకు వచ్చి ప్రత్యేక హోదాకోసం పోరాడాలన్నారు. హోదా విషయంపై విజయవాడలో ఈ నెల 19న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేసిందని, విభజన చట్టంలోని హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపినా, రాష్ట్ర బీజేపీ నేతలు మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ నేతలు అసత్యాలు మాట్లాడుతున్నారని రామకృష్ణ మండిపడ్డారు. రైల్వే జోన్ రాజకీయ నిర్ణయం అనడం సిగ్గుచేటని విమర్శించారు. ఏనాడు రాయలసీమ గురించి మాట్లాడని బీజేపీ నేతలు ఇప్పుడు రెండో రాజధాని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి అన్ని పార్టీలను కలిసి మద్దతు కూడగట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం లేదు

- రాహుల్.. 'కాంగ్రెస్' ఓటమి నాయకుడు..
- కేంద్రానికి టీఆర్ఎస్ సహకరించట్లేదు:మురళీధర్‌రావు



కరీంనగర్, మార్చి 13(మనం బ్యూరో): దేశంలో బీజేపీకి రాజకీయ ప్రత్యామ్యాయం మరొకటి లేదని, ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నకల్లో ఎవరూ ఊహించని రీతిలో ప్రజలు, ఓటర్లు బీజేపీకి బ్రహ్మరథం పట్టారని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ గతంలోకంటే.. ఓట్ల శాతంలో మరింత బలహీనపడిందన్నారు. త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసి దేశంలోనే తిరుగులేని శక్తిగా ఎదిగిందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ 'ఓటమికి నాయకుడు'గా మారిపోయారని ఎద్దేవా చశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ బీజేపీ గెలిచి తీరుతుందని, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధించి తీరుతుందని పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాల అమలుకు కేంద్రంగా పని చేస్తుందని ఆరోపించారు. మాజీ నక్సలైట్లు, మాజీ జేబుదొంగలు, భూ దందా దగాకోరులకు టీఆర్ఎస్ వేదికగా మారిందని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి టీఆర్ఎస్ అడ్డపడుతోందని, కేంద్రానికి ఏమాత్రం సహకరించట్లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రతిపాదించిన థర్డ్ ఫ్రంట్ ఓ పగటి కల అని అన్నారు.కార్యక్రమంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల బీజేపీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ప్రతాపరామకృష్ణ, ఓదెలు, మహిళామోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి సుజాతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అండర్ టేకింగ్' ఉపసంహరించుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ నేతల డిమాండ్

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): పదో తరగతి పరీక్షల విధులు నిర్వహించే ఉపాధ్యాయులనుంచి 'పరీక్షా హాలులో కాపీ జరిగితే.. తనదే బాధ్యత, తనపై చర్యలు తీసుకోవచ్చని' రాతపూర్వకంగా అండర్ టేకింగ్ ఇవ్వాలని విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడాన్ని టీఎస్‌యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.రాములు, చావ రవి మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఉపాధ్యాయులందరూ నిజాయతీగా పదో తరగతి పరీక్షా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పడితే.. వారిని కఠినంగా శిక్షించడానికి యాక్ట్ 25/1997 ప్రకారం ప్రభుత్వానికి పూర్తి అధికారాలున్నాయని గుర్తుచేశారు.


'వాకపల్లి' పీపీగా రాజేంద్రప్రసాద్

- నియామకానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 13 (మనం లీగల్ ప్రతినిధి): విశాఖ జిల్లా వాకపల్లి గిరిజనులపై గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారం చేశారన్న కేసులో బాధితుల తరపున వాదించేందుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సుంకర రాజేంద్రప్రసాద్‌ను నియమించాలని హైకోర్టు ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. హైకోర్టు క్రిమినల్ లా ప్రాక్టీస్ ఉన్న న్యాయవాదుల జాబితా ద్వారా అందులోని ఒకరి పేరును బాధితులు ఎన్నుకునేలా అవకాశం కల్పించింది. బాధితుల అభ్యర్థన మేరకు రాజేంద్రప్రసాద్‌ను నియమించాలని ఏపీ హోం, న్యాయ శాఖల కార్యదర్శులను మంగళవారం హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది. స్పెషల్ పీపీకి రోజుకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని బెంచ్ పేర్కొనగా ఏపీ ప్రభుత్వ వినతితో రూ.4 వేలు ఇవ్వాలని నిర్ణయించింది. బాధితుల తరపున వాదించే స్పెషల్ పీపీకి అన్ని విధాలుగా ప్రభుత్వం సహకరించాలని హైకోర్టు ఆదేశించింది. స్పెషల్ పీపీకి సహకారం ఇచ్చేందుకు అదనపు పీపీని కూడా నియమించాలన్న పిటిషనర్ల తరపు లాయర్ వాదనను బెంచ్ తోసిపుచ్చింది.

టీడీపీకి చెంపపెట్టు

- హైకోర్టు నోటీసులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం
- ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి: బొత్స



విజయవాడ, మార్చి 13: రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని, పార్టీ మారిన 22 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో బొత్స మాట్లాడుతూ.. ఇది టీడీపీకి చెంపపెట్టు లాంటిదని, కోర్టు తీర్పు రాక ముందే వారితో రాజీనామా చేయించి రాజకీయ విలువలు కాపాడాలని చంద్రబాబుకు సూచించారు. ప్రత్యేక హోదా కోసం వైసీపీ ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి టీడీపీకి చిత్తశుద్ధి ఉంటే మద్దతు ఇవ్వాలని అన్నారు. అవిశ్వాసానికి అన్ని పార్టీల మద్దతు కూడగడతామని బొత్స పేర్కొన్నారు.


నేడు టీఆర్టీ ప్రాథమిక కీ విడుదల

హైదరాబాద్, మార్చి 13(మనం ప్రతినిధి): ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్టీ) ప్రాథమిక కీ ను టీఎస్‌పీఎస్సీ ఖరారు చేసింది. టీఆర్టీ ప్రాథమిక కీ బుధవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనున్నట్టు వెల్లడించింది. ఈ నెల 21 నుంచి 31వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను స్వీకరించనున్నట్టు తెలిపింది.

సెన్సెక్స్

మార్చి 13, 2018

33,856.78




పెరిగినవి	%	తగ్గినవి	%
యాక్సిస్ బ్యాంకు	2.23	టీసీఎస్	-5.22
సన్ ఫార్మా	2.04	కోటక్ మహీంద్రా	-1.53
విప్రో	1.81	కోల్ ఇండియా	-1.02
భారతీ ఎయిర్‌టెల్	1.70	ఎన్‌టీపీసీ	-0.94
డాక్టర్ రెడ్డీస్	1.60	ఇన్ఫోసిస్	-0.83

నిఫ్టీ

మార్చి 13, 2018

10426.85



పెరిగినవి	%	తగ్గినవి	%
భారతీ ఎయిర్‌టెల్	4.45	టీసీఎస్	-5.42
వేదాంత	4.42	కోటక్ మహీంద్రా	-1.52
ఐటీసీ	2.80	హెచ్.సి.ఎల్ టెక్	-1.10
ఎన్‌టీపీసీ	2.74	ఎన్‌టీపీసీ	-1.02
హిందాల్కో	2.37	కోల్ ఇండియా	-0.94

టాప్ లూజర్స్


13 మార్చి

33,856.78

పాయింట్లు		%
2892.45	టీసీఎస్	-5.22%
1084.55	కోటక్ మహీంద్రా	-1.46%
294.75	కోల్ ఇండియా	-1.02%
169.40	ఎన్‌టీపీసీ	-0.94%
8753.50	మారుతీ సుజుకి	-0.66%
1302.15	లార్సెన్	-0.59%
733.40	ఎం అండ్ ఎం	-0.52%
1317.75	హెచ్.యు.ఎల్	-0.51%
268.65	ఐటీసీ	-0.50%
1858.10	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	-0.46%

బి.ఎస్.ఇ సెన్సెక్స్ -61.16

వాట్సాప్‌లో చెల్లింపులకు సిద్ధమవుతున్న యాక్సిస్



బెంగళూరు: ప్రాచుర్యం పొందిన చాటింగ్ అప్లికేషన్ 'వాట్సాప్'పై చెల్లింపులను ప్రాసెస్ చేసే స్థితికి త్వరలో చేరుకోనున్నట్లు భారతదేశపు మూడవ అతి పెద్ద ప్రైవేటు రంగ బ్యాంక్ యాక్సిస్ బ్యాంక్ మంగళవారం ప్రకటించింది. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యు.పి.ఐ)ని ''పెద్ద అవకాశం''గా యాక్సిస్ బ్యాంక్ అభివర్ణించింది. ''యు.పి.ఐ విషయానికి వస్తే, నవకల్పనల విషయంలో మేం మార్కెట్ నాయకులం. యు.పి.ఐతో అవకాశాలు అపారంగా ఉన్నాయని మేం నిజంగా విశ్వసిస్తున్నాం. మా ఖాతాదార్లకు భిన్నమైన వాతావరణాన్ని సృష్టించే దిశగా మేం కృషి చేస్తున్నాం'' అని యాక్సిస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రిటైల్ బ్యాంకింగ్) రాజీవ్ ఆనంద్ ఇక్కడ మీడియా ప్రతినిధులతో అన్నారు. ''కష్టమర్లు చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఆవరణ వ్యవస్థను సృష్టించేందుకు మేం గూగుల్, వాట్సాప్, ఉబెర్, ఓలా, శామ్‌సంగ్ పే వంటి భాగస్వాములతో కలసి పనిచేస్తున్నాం'' అని ఆయన చెప్పారు. యు.పి.ఐ స్పేస్‌లో యాక్సిస్ బ్యాంక్ 20 శాతం మార్కెట్ వాటా కలిగి ఉందని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. గూగుల్ టెజ్ ఇప్పటికే మొదలై పనిచేస్తోందని ఆయన అన్నారు. ''వాట్సాప్ విషయంలో, మేం ఇంటెగ్రేషన్ ప్రక్రియలో ఉన్నాం. వాట్సాప్ ప్రస్తుతం బేటా వెర్షన్ నడుపుతోంది. పూర్తి వెర్షన్ కూడా నడుపుతుంది...వచ్చే నెలలో లేదా మరో రెండు నెలల్లో అది కార్యరూపం ధరిస్తుందని మేం ఆశిస్తున్నాం'' అని ఆయన అన్నారు. మొబైల్ బ్యాంకింగ్ వ్యయాలు 2017-18 ఆర్థిక సంవత్సరం క్యూ 3లో రూ. 51,030 కోట్లకు చేరాయని యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. క్రితం ఆర్థిక సంవత్సరం అదే కాలంతో పోలిస్తే 71 శాతం పెరిగినట్లు లెక్కకు వస్తుందని పేర్కొంది. బ్యాంక్ లావాదేవీల్లో 66 శాతం 'డిజిటల్ పద్ధతుల్లో' సాగుతున్నాయని వెల్లడించింది. క్రెడిట్, డెబిట్ కార్డులు రెండింటిపైన బ్యాంక్ ప్రధాన దృష్టి కొనసాగుతోందని యాక్సిస్ తెలిపింది. 'కార్డ్-యాక్సెప్టెన్స్ టెర్మినల్స్' ఏర్పాటులో (4,79,200 పైగా) మార్కెట్‌లో నాయకత్వ స్థానంలో కొనసాగుతున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ప్రకటించుకుంది.

మోన్‌శాంటో రాయల్టీకి కోత



న్యూఢిల్లీ: మోన్‌శాంటో కంపెనీకి స్థానిక వంగడ కంపెనీలు చెల్లించే రాయల్టీలకు రెండేళ్ళలో రెండవసారి ఇండియా కోత విధించింది. ఈ దేశాన్ని విడిచిపోతామని 2016లో హెచ్చరించిన అమెరికన్ కంపెనీతో మరో వివాదానికి ఇది తెర లేపగలదని భావిస్తున్నారు. జన్యుపరంగా సవరించిన (జి.ఎం) పత్తి రూపొందించినందుకు భారతీయ వంగడ కంపెనీలు మోన్‌శాంటోకి చెల్లిస్తున్న రాయల్టీలను 20.4 శాతం తగ్గించాలని వ్యవసాయ మంత్రిత్వ శాఖ నిర్ణయించిందని కేంద్రం మంగళవారం జారీ చేసిన ఒక ఉత్తర్వులో పేర్కొంది. మోన్‌శాంటో రాయల్టీలను వ్యవసాయ మంత్రిత్వ శాఖ 2016లో 70 శాతంపైగా తగ్గించింది. అది దీర్ఘకాలిక వివాదాన్ని రేకెత్తించింది. భారత, అమెరికా ప్రభుత్వాలు కూడా సిగపట్లకు దిగవలసి వచ్చింది. ''చిహ్న ఫీజులకు (రాయల్టీలకు) మరింత కోత పెడుతున్న నేటి ఉత్తర్వు దురదృష్టకరం. ఇప్పటికే అవి సేద్యపు ఖర్చులో 0.5 శాతం కన్నా తక్కువగా ఉన్నాయి. టెక్నాలజీ మాత్రం దేశమంతటా రైతులకు విలువను సమకూరుస్తూనే ఉంది'' అని మోన్‌శాంటోకు చెందిన భారతదేశపు సంయుక్త రంగ సంస్థ మహికో మోన్‌శాంటో బయోటెక్ (ఇండియా) (ఎం.ఎం.బి) ప్రతినిధి ఒకరు చెప్పారు.

భారతదేశపు వ్యవసాయంలో పత్తిది ఒక విజయ గాథ. ఉత్పత్తి, ఎగుమతులు రెండూ ఒక్కసారిగా పెరిగాయి. కానీ, పెట్టుబడులు ఆకర్షించేందుకు ఈ రంగానికి అంచనా వేయదగిన వ్యాపార వాతావరణం అవసరమని ఆ ప్రతినిధి చెప్పారు. మోన్‌శాంటో రాయల్టీలకు కోత పెట్టడంతోపాటు జి.ఎం. పత్తి విత్తనాల ధరలను కూడా ప్రభుత్వం 7.5 శాతం తగ్గించింది. కీటకాలు తెస్తున్న తెగుళ్ళతో సతమతమవుతున్న రైతులకు సాయపడేందుకు 450 గ్రాముల విత్తనాల ప్యాకెట్‌ను రూ. 740కి విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సరఫరాలు నిలిపేస్తామని హెచ్చరిక

భారతీయ వంగడాల సంస్థల నుంచే రైతులు జి.ఎం. పత్తి విత్తనాలు కొంటున్నారు. వాటిని ఉత్పత్తి చేయడానికి మోన్‌శాంటో యాజమాన్య టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నందుకుగాను భారతీయ వంగడాల సంస్థలు దానికి కొంత రాయల్టీ చెల్లిస్తున్నాయి. జి.ఎం పత్తి విత్తనాల ఉత్పత్తిదార్ల సంస్థ నేషనల్ సీడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్.ఎస్.ఎ.ఐ). వంగడాల ధరలు తగ్గించాలన్న ప్రభుత్వ యోచనకు నిరసనగా 80 లక్షల మంది పత్తి రైతులకు సరఫరాలు నిలిపివేస్తామని ఎన్.ఎస్.ఎ.ఐ గత వారం హెచ్చరించింది. ''కొత్త తగ్గిన ధర ఈ ఏడాది విత్తనాల సరఫరా, విత్తనాల సౌలభ్యంపై తప్పకుండా ప్రభావం చూపవచ్చు. వచ్చే ఏడాది వంగడాల ఉత్పత్తిపెన కూడా దాని ప్రభావం ఉండవచ్చు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎన్.ఎస్.ఎ.ఐ రిట్ పిటిషన్ దాఖలు చేసే అవకాశం కూడా ఉంది'' అని ఎన్.ఎస్.ఎ.ఐ డైరెక్టర్ జనరల్ కల్యాణ్ గోస్వామి చెప్పారు.



విత్తనాల ధరలు 2011 నుంచి తగ్గిపోయాయి. కానీ, ఇంధనం, కార్మిక, సరఫరా చైన్ వ్యయాలు పెరిగాయని గోస్వామి చెప్పారు. ''ప్యాకెట్‌కు ధరను కనీసం రూ. 150 పెంచాలని, పత్తి విత్తనాల ధరల పెంపునకు ఎన్.ఎస్.ఎ.ఐ సిఫార్సు చేసింది. కానీ, ఆ ఆలోచనను పక్కనపెట్టారు'' అని ఆయన అన్నారు. ప్రభుత్వం గత ఏడాది రాయల్టీలు, జి.ఎం. పత్తి విత్తనాల రిటైల్ ధరలు రెండింటినీ మార్చలేదు. భారతదేశపు పత్తి పంటలో 90 శాతం పైగా భాగం జన్యుపరంగా సవరించినదే. భారతదేశపు పత్తి ఉత్పత్తి 2017-18 సంవత్సరంలో 9.3 శాతం పెరగనుంది. కానీ, అది పరిశ్రమ విశ్లేషకులు అంచనా వేస్తున్న రికార్డు స్థాయి అత్యధిక ఉత్పత్తికన్నా తక్కువే. కొన్ని ప్రాంతాల్లో పత్తి పంటకు చిమ్మట గొంగళిపురుగు వల్ల వాటిల్లిన నష్టంతో ఉత్పత్తి దెబ్బతిందని భావిస్తున్నారు.


బ్యూనస్ ఎయిర్స్‌లో బులెట్ డుగ్ డుగ్



న్యూఢిల్లీ: అనన్యమైన బైక్‌ల తయారీ సంస్థగా ఖ్యాతి వహించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అర్జెంటీనా మార్కెట్లోకి ప్రవేశించినట్లు మంగళవారం ప్రకటించింది. లాటిన్ అమెరికాలో రెండవ పెద్ద మోటార్‌సైకిల్ మార్కెట్‌గా అర్జెంటీనాకు పేరుంది. బ్యూనస్ ఎయిర్స్‌లో కంపెనీ మొదటి స్టోరును తెరిచి పూర్తి స్థాయిలో సేవలందించడం మొదలుపెట్టింది. విక్రయానంతర సేవలు, స్పేర్ పార్టులు, సర్వీసుతో సహా అన్నింటికి ఏర్పాట్లు చేసింది. అర్జెంటీనాలో అధికారిక డీలర్-భాగస్వామిగా గ్రూపో సింపాను రాయల్ ఎన్‌ఫీల్డ్ నియమించింది. మార్కెట్ అభివృద్ధి, మార్కెటింగ్, అర్జెంటీనాలో ఈ బ్రాండ్‌కి విక్రయానంతర సేవల వంటి ఆలంబన కార్యకలాపాల బాధ్యతంతా గ్రూపో సింపాయే చూసుకుంటుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ''మా నగర కేంద్రీకృత అంతర్జాతీయ విస్తరణ వైఖరికి బ్యూనస్ ఎయిర్స్‌లోని స్టోరు సరిగ్గా సరిపోయేదిగా ఉంది. అర్జెంటీనాలో జనం ఆనందదాయమైన, ఉత్సాహపూరితమైన లీజర్ మోటార్‌సైక్లింగ్ అవకాశాల కోసం చూస్తున్నారు. అవి నగరంలో సంచారానికి కూడా అనువైనవిగా ఉండాలని భావిస్తున్నారు'' అని రాయల్ ఎన్‌ఫీల్డ్ అధ్యక్షుడు రుద్రతేజ్ (రూడీ) సింగ్ చెప్పారు. అర్జెంటీనాకు పరిశుద్ధమైన మోటార్‌సైక్లింగ్ ప్రపంచాన్ని చూపాలని కంపెనీ ఎదురు చూస్తోందని, దక్షిణ అమెరికా ప్రాంతంలోని రెండవ పెద్ద మోటార్‌సైకిల్ మార్కెట్‌లో పోటీ సామర్థ్యాన్ని వినియోగించుకునేందుకు కంపెనీకి అవకాశం ఏర్పడుతోందని ఆయన అన్నారు. లాటిన్ అమెరికా ప్రాంతంలో బ్రెజిల్, కొలంబియాలలో రాయల్ ఎన్‌ఫీల్డ్‌కి ఇప్పటికే ప్రత్యేక స్టోరులు ఉన్నాయి. అర్జెంటీనాలో కంపెనీ నాలుగు (బులెట్ (500సిసి), క్లాసిక్ (500సిసి), కాంటినెంటల్ జి.టి (535సిసి) కేఫ్ రేసర్, హిమాలయన్ (410సిసి) మోడళ్ళను విక్రయిస్తుంది.

ప్రస్తుతం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను 540కి పైగా డీలర్‌షిప్‌ల ద్వారా 50కి పైగా దేశాల్లో విక్రయిస్తున్నారు. మిల్వాకీ, లండన్, ప్యారిస్, మాడ్రిడ్, బార్సిలోనా, మెల్‌బోర్న్, శంపావ్లో, దుబాయ్‌లలో ప్రత్యేక బ్రాండ్ స్టోర్సులు ఉన్నాయి. కంపెనీ 2016-17లో ప్రపంచ వ్యాప్తంగా 6.6 లక్షల యూనిట్లు విక్రయించింది. బైక్‌ల తయారీ సామర్థ్యాన్ని 2018 అంతానికి 9 లక్షల యూనిట్లకు పెంచుకోవాలని భావిస్తోంది.


లాభాల స్వీకరణతో స్వల్ప క్షీణత



ముంబయి: కొన్ని బ్యాంకుల షేర్లు, ఎఫ్.ఎం.సి.జి షేర్లలో ట్రేడింగ్ చివరలో చోటుచేసుకున్న లాభాల స్వీకరణ, టీసీఎస్ షేర్ల ధర తీవ్ర పతనంతో బొంబాయి స్టాక్ ఎక్చ్సేంజ్ (బి.ఎస్.ఇ) 'సెన్సెక్స్' మంగళవారం 61.16 పాయింట్లు క్షీణించి 33,856.78 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్చ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' మాత్రం సోమవారంనాటి స్థాయిని నిలబెట్టుకోగలిగింది. యాభై షేర్ల ధరల్లో హెచ్చు తగ్గులను ప్రతిబింబించే 'నిఫ్టీ' రెండవ రోజున స్వల్పంగా 5.45 పాయింట్లు లాభపడి 10,426.85 పాయింట్ల వద్ద ముగిసింది. టి.సి.ఎస్, ఐ.టి.సి షేర్ల ధరలు క్షీణించినా, హెచ్.పి.సి.ఎల్, యాక్సిస్ బ్యాంక్, గెయిల్ షేర్లలో లాభాలతో 'నిఫ్టీ' నిలదొక్కుకోగలిగింది. రోజంతా స్టాక్ మార్కెట్లు ఉత్థాన పతనాలను చూస్తూనే ఉన్నాయి. ఫెడ్ రేటు పెంపుదలలు ఏ విధంగా ఉండగలవో అంచనా వేసేందుకు అమెరికా ద్రవ్యోల్బణ డాటా ఇచ్చే సంకేతాల కోసం మదుపరులు ఎదురు చూశారు. టాటా కన్సల్టెన్సీ (టి.సి.ఎస్) షేర్ ధర 5.22 శాతం క్షీణించి రూ. 2,892.45కి పతనమైంది. దాని ప్రమోటర్ టాటా సన్స్ ఈ ఐ.టి దిగ్గజంలో వాటా విక్రయం ద్వారా దాదాపు రూ. 8,200 కోట్లు సమీకరించే యోచనలో ఉందని వార్తలు రావడంతో టి.సి.ఎస్ షేర్ ధర పడిపోయింది. ఎఫ్.ఎం.సి.జి మేజర్ ఐ.టి.సి 0.5 శాతం తగ్గింది. కోటక్ బ్యాంక్, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ 1.46 శాతం క్షీణించడంతో ట్రేడింగ్ మొదట్లో కనిపించిన లాభాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఆసియాలోని ఇతర మార్కెట్ల నుంచి సంకేతాలు బలహీనంగా ఉండడంతో 'సెన్సెక్స్' 33,818.22 పాయింట్ల బలహీన స్థితి వద్దనే మొదలైనా, వెంటనే 34,000 పాయింట్ల స్థాయిని అందుకుంది. స్థూల ఆర్థిక డాటా సానుకూలంగా ఉండడంతో 34,077.32 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసింది. అయితే, చివర్లో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో, 33,856.78 పాయింట్ల వద్ద ముగియడానికి ముందు 33,722.96 పాయింట్లకు పడిపోయింది. ''ద్రవ్యోల్బణం సడలడం, ఐ.ఐ.పి డాటా ఊహించిన దానికన్నా మెరుగ్గా ఉండడంతో, మార్కెట్ సానుకూల గతినే సంతరించుకుంది. అయితే, ఐ.టి రంగ షేర్లలో అమ్మకాలు, బ్యాంకుల షేర్లలో లాభాల స్వీకరణతో రోజంతా మార్కెట్ ఆ సానుకూలతను నిలబెట్టుకోలేకపోయింది'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు.

రిటైల్ ద్రవ్యోల్బణం ఆశ్చర్యకరంగా మందగించి 2017 డిసెంబరులో ఉన్న 5.2 శాతం నుంచి 2018 జనవరికి 5.1 శాతానికి, వరుసగా రెండవ నెల ఫిబ్రవరిలో 4.4 శాతానికి తగ్గింది. పారిశ్రామిక ఉత్పత్తి వరుసగా మూడవ నెలలోనూ బలమైన వేగంతో వృద్ధి చెంది జనవరిలో 7.5 శాతంగా నిలిచింది. ''మందగొడిగా ఉన్న ఇతర ఆసియా మార్కెట్లు దేశంలోని స్టాక్ మార్కెట్లను తీవ్ర హెచ్చు తగ్గులకు లోను చేశాయి. దేశానికి చెందిన సానుకూల స్థూల ఆర్థిక డాటా దేశీయ సెంటిమెంట్‌ను స్వల్పంగా పెంచింది'' అని బీఎన్‌పి పరిబస్ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్ల విభాగ డిప్యూటి సి.ఇ.ఓ ఆనంద్ షా చెప్పారు.

దిగుమతి సుంకాలపై అమెరికాతో మాట్లాడతాం




న్యూఢిల్లీ: ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని పెంచుతూ అమెరికా తీసుకున్న ''దురదృష్టకర'' నిర్ణయాన్ని మార్చుకోవలసిందిగా కోరుతూ, ఆ అంశాన్ని అమెరికా అధికారుల దృష్టికి తీసుకెళతామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభు చెప్పారు. ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం దిగుమతి సుంకాన్ని పెంచుతున్నట్లు ట్రంప్ ప్రభుత్వం గత వారం ప్రకటించింది. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం తలెత్తవచ్చనే భయాలను అది రేకెత్తించింది. ''ఈ నిర్ణయాలు దురదృష్టకరమైనవి. అమెరికా వాణిజ్య మంత్రితో నేను వీటిపై మాట్లాడతాను. బహుళ ట్రేడింగ్ ప్లాట్‌ఫాం, ద్వైపాక్షిక వాణిజ్య వేదిక రెండింటి ద్వారాను కలసి పనిచేయాల్సిన అవసరం గురించి వారికి వివరించేందుకు నేను తప్పకుండా ప్రయత్నిస్తాను'' అని ఆయన అన్నారు. భారతదేశం ఆ రెండు ఉత్పత్తులను ఏటా 1.3 బిలియన్ డాలర్ల విలువైనవి అమెరికాకు ఎగుమతి చేస్తోంది. కనుక సుంకాల పెంపు ప్రభావంపై మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధ్యయనం ప్రారంభించింది. అమెరికా ప్రభుత్వ సుంకాలతో అమెరికన్ మార్కెట్‌కు ఈ ఉత్పత్తుల ఎగుమతుల ధరలు వ్యయదాయకమైనవిగా తయారవుతాయి. ఫలితంగా, దేశీయ వస్తువుల పోటీ సామర్థ్యంపై ప్రభావం పడుతుంది. దీనిపై యూరోపియన్ యూనియన్, చైనాలు ప్రతి చర్యలకు దిగవచ్చని, ఆ వాణిజ్య యుద్ధం ప్రపంచ ఆర్థిక వృద్ధిని దెబ్బతీస్తుందని ఎస్ అండ్ పి గ్లోబల్ రేటింగ్స్ పేర్కొంది. ఈ చర్య వల్ల వివిధ దేశాల నుంచి అమెరికాకు ఉక్కు ఎగుమతి 9-14 మిలియన్ టన్నులు తగ్గే అవకాశం ఉందని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ నివేదిక కూడా పేర్కొంది. అమెరికాకు ఎగుమతయ్యే ఉక్కు ఉత్పత్తుల్లో 60 శాతం కెనడా, బ్రెజిల్, దక్షిణ కొరియా, మెక్సికో, రష్యా దేశాల నుంచే ఉంది. ఇండియా నుంచి 2017లో అమెరికాకు 0.9 మిలియన్ టన్నుల ఉక్కు ఎగుమతి అయింది. ఈ విషయమై అమెరికాను ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ) వివాద పరిష్కార యంత్రాంగానికి లాగాలని కొందరు వాణిజ్య నిపుణులు సూచిస్తున్నారు. మార్చి 19-20 తేదీల్లో ఇండియాలో డబ్ల్యు.టి.ఓ సభ్యుల మంత్రిత్వ స్థాయి సమావేశం జరుగనుంది. అమెరికా, చైనాల ప్రతినిధులు కూడా పాల్గొనడానికి అవకాశం ఉన్న ఈ సమావేశంలో ఆ అంశాలు చర్చకు రావచ్చు. ఈ సమావేశాన్ని ''ఒక స్నేహపూర్వక వాతావరణం సృష్టించడం కోసమే ఏర్పాటు చేశాం. అంతర్జాతీయ వాణిజ్య, బహుళ వ్యాపార వర్తక వ్యవస్థ చుట్టూ ఉన్న ఈ ప్రతికూలత తగ్గుతుంది. స్వేచ్ఛా వర్తకం ద్వారా అన్ని దేశాలు లబ్ధి పొందుతాయి'' అని సురేశ్ ప్రభు ఒక ఇంటర్వ్యూలో అన్నారు.



సౌర శక్తికి పెరిగిన నిధులు

న్యూఢిల్లీ: భారతీయ సౌర విద్యుదుత్పాదన రంగం 2016లో 400 కోట్ల అమెరికన్ డాలర్లను ఆకర్షించగా, 2017లో వెయ్యి కోట్ల డాలర్ల పెట్టుబడులను ఆకర్షించిందని కాలుష్య రహిత విద్యుత్ పరిశోధన సంస్థ మెర్కామ్ క్యాపిటల్ మంగళవారం వెల్లడించింది. సౌర విద్యుదుత్పాదనకు గత ఏడాది నిధులు వృద్ధి చెందాయి. గ్రిడ్‌కు సుమారుగా 9.6 గిగావాట్ల సౌర శక్తి కేంద్రాలు తోడయ్యాయి. గత ఏడాది 9.6 గిగావాట్ల సౌర శక్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రాజెక్టు ఫైనాన్సింగ్ సుమారు 6.4 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగింది. ఈ కేటగిరీలో 2016లో వచ్చిన పెట్టుబడులు 3.5 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయి. సౌర కంపెనీలు 2017లో సేకరించిన కార్పొరేట్ నిధులు (వెంచర్ క్యాపిటల్, ప్రైవేట్ ఈక్విటీ, పబ్లిక్ మార్కెట్, రుణం) మొత్తం 3.6 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయి. ఈ విషయంలో ప్రపంచ మొత్తంలో అది 28 శాతం కింద లెక్కకు వస్తుంది. దీనిలో వెంచర్ క్యాపిటల్, ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 80 కోట్ల డాలర్ల మేరకు ఉంటాయి. ఈ విషయంలో ప్రపంచ మొత్తంలో అది 50 శాతం కింద వస్తుంది. రెండు పెద్ద ప్రైవేటు ఈక్విటీ ఒప్పందాల వల్ల 2017లో సౌర శక్తికి కార్పొరేట్ ఫండింగ్ పెరిగింది. రెన్యూ పవర్, గ్రీన్‌కో ఎనర్జీ, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్, క్లీన్ మ్యాక్స్ సోలార్ వంటి కంపెనీలు సౌర విద్యుదుత్పాదనకు పెట్టుబడులు పెట్టిన వాటిలో ఉన్నాయి.



భారత్ డైనమిక్స్ ఐ.పి.ఓ

ముంబయి: షేర్‌కు రూ. 413-428 ధర బ్యాండ్‌తో భారత్ డైనమిక్స్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ మంగళవారం ప్రారంభమైంది. ఈ సంస్థలో ప్రభుత్వం తన వాటాను సుమారు 12 శాతం తగ్గించుకుంటూ మొత్తం 22,451,953 షేర్లను విక్రయిస్తోంది. గుత్తగా కనీసం 35 షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ ఇష్యూ మార్చి 15వ తేదీతో ముగుస్తుంది. ఈ పబ్లిక్ ఇష్యూని ఎస్.బి.ఐ క్యాపిటల్ మార్కెట్స్, ఐ.డి.బి.ఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్, యస్ సెక్యూరిటీస్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. రక్షణ రంగానికి భూమి మీద నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణులు, యాంటి-ట్యాంక్ గైడెడ్ క్షిపణులు, జలగర్భ ఆయుధ లాంచర్లు, కౌంటర్ మెజర్స్ అండ్ టెస్ట్ ఎక్విప్‌మెంట్ తయారీలో భారత్ డైనమిక్స్ నిమగ్నమై ఉంది. పెట్టుబడి ఉపసంహరణ ద్వారా రూ. 960 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.


'తనఖాలో లేని ఆస్తుల వివరాలు తెలుపండి'

- యూనిటెక్‌కు సుప్రీం కోర్టు ఆదేశం
- ఆస్తులు వేలం వేసి గృహ కొనుగోలుదార్లకు నగదు వాపసు చేయవచ్చని వెల్లడి

న్యూఢిల్లీ: సమస్యల వలయంలో చిక్కుకున్న స్థిరాస్తుల అగ్ర సంస్థ యూనిటెక్ లిమిటెడ్‌కు చెందిన తాకట్టు పెట్టని ఆస్తుల వివరాలను సుప్రీం కోర్టు సోమవారం కోరింది. వాటిని వేలం వేసి వచ్చిన డబ్బును దాని దగ్గర గృహాలు కొనుగోలు చేసిన వారికి నగదు వాపసు చేయవచ్చని పేర్కొంది. యూనిటెక్ లిమిటెడ్‌కి హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ఇచ్చిన కొన్ని రుణాలను బదలాయించుకున్న జె.ఎం. ఫైనాన్షియల్ ఎసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం రూ. 25 లక్షల జరిమానా విధించింది. గృహ కొనుగోలుదారులకు నగదును రిఫండు చేయగలననే అభిప్రాయాన్ని ఆ ఎసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ కల్పించిందని, ఇప్పుడు మొత్తం విచారణ పక్కదోవ పట్టిందని న్యాయమూర్తులు ఎ.ఎం. ఖాన్విల్‌కర్, డి.వై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ''దీనిని మేం ప్రధాన కేసు నుంచి దృష్టిని అనవసరంగా పక్కకు మళ్ళించడంగా పరిగణిస్తున్నాం'' అని జరిమానా విధిస్తూ ధర్మాసనం పేర్కొంది. తాకట్టుపెట్టని ఆస్తుల వివరాలు వెల్లడించవలసిందని ధర్మాసనం ఆ రియల్ ఎస్టేట్ కంపెనీని ఆదేశించింది. చిక్కుల్లో పడిన గృహ కొనుగోలుదార్లకు చెల్లించవలసి ఉన్న మొత్తాలను పరిష్కరించేందుకు ఆ ఆస్తులను వేలం వేసేందుకు అవకాశం ఉందని కూడా స్పష్టం చేసింది. సోమవారం నుంచి పదిహేను రోజులలోగా ఆస్తుల వివరాలు సమర్పించాలని ఆదేశించింది. నిర్మాణంలో ఉన్న తమ ప్రాజెక్టులకు రుణాలు సమకూర్చేందుకు ముంబయి కేంద్రంగా ఉన్న జె.ఎం. ఫైనాన్షియల్ లిమిటెడ్ ఆసక్తి చూపుతోందని యూనిటెక్ మార్చి 5న సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించింది. యూనిటెక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ చంద్ర ప్రస్తుతం జైలులో ఉన్నారు. డిసెంబరు నెలాఖరుకల్లా తన రిజిస్ట్రీ వద్ద ఆ రియల్ ఎస్టేట్ గ్రూప్ నగదును డిపాజిట్ చేస్తేనే సంజయ్ చంద్రకు బెయిలు మంజూరు చేసే అవకాశం ఉంటుందని సుప్రీం కోర్టు గత ఏడాది అక్టోబరు 30న పేర్కొంది. నిర్మాణంలో ఉన్న గృహ నిర్మాణ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు, గృహ కొనుగోలుదార్లకు రిఫండు ఏర్పాట్లు చేసేందుకు వీలుగా కంపెనీ అధికారులు, న్యాయవాదులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించవలసిందిగా అంతకుముందు కోర్టు జైలు అధికారులను ఆదేశించింది. బెయిలు ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు ఆగస్టు 11న తిరస్కరించింది. దాంతో సంజయ్ చంద్ర తాత్కాలిక బెయిలు కోసం సుప్రీం కోర్టుకు అప్పీలు చేసుకున్నారు. గురుగ్రామ్‌లోని యూనిటెక్ ప్రాజెక్టులు 'వైల్డ్ ఫ్లవర్ కంట్రీ', 'అంతియా ప్రాజెక్ట్'లకు చెందిన 158 మంది గృహ కొనుగోలుదార్లు 2015లో సంజయ్ చంద్రపై క్రిమినల్ కేసు దాఖలు చేశారు.



మనం వికాస్
బుధవారం 14 మార్చి 2018
www.manamnews.com



రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలెన్నో ముందుకు వస్తున్న తరుణమిది. పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే అభ్యర్థుల దృక్కోణం వేరుగా ఉండాలి. పోటీ పరీక్షల్లో ఇది అక్షరసత్యం. కెరియర్‌కెంతో విలువైన ఈ పరీక్షల మెట్లు ఎక్కుతుంటే ఏదో ఒక మెట్టు దగ్గర పట్టు తప్పడం సహజం. దానికి చింతించకుండా జరిగిన తప్పులను సరిదిద్దుకుని ముందుకు సాగాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా అభ్యర్థులు సాధారణంగా వేసే తప్పటడుగులూ, వాటిని సవరించుకునే విధానం తెలుసుకుందాం!

పరీక్షల్లో నెగ్గాలంటే...

పుస్తకాల ఎంపికలో లోపం



మంచి మెటీరియల్, పుస్తకాల ఎంపికతోనే పోటీపరీక్షల విజయ యాత్ర ప్రారంభమవు తుంది. సిలబస్ స్వరూపం ఆధారంగా, అభ్యర్థి విద్యా నేపథ్యం ప్రాతిపదికగా నిర్దేశిత పుస్తకాలు, మెటీరియల్ ఎంపిక జరగాలి. పోటీపరీక్షలకు సంబంధించి ప్రాథమిక పుస్తకాలు, రిఫరెన్స్ మెటీరియల్‌గా వర్గీకరించి ఎంపిక చేసుకోవడం, ఏ సమయానికి ఏది చదవాలన్న ప్రణాళిక ఎప్పటికప్పుడు చేసుకుంటూ, ఆయా మెటీరియళ్లను అనుసరించడం ద్వారా పోటీపరీక్షార్థి విజయానికి చేరువ కావాలి. అయితే ఇందుకు భిన్నంగా చాలామంది పుస్తకాలు, మెటీరియళ్ల ఎంపికలో పొరపాట్లు చేయడంతో అపజయం అనివార్యమవుతుంది.

బలంగా లేకపోవడం

పోటీ పరీక్షల్లో విజయం సులభం కాదు. సాధారణంగా జేఈఈ నుంచి సివిల్స్, బ్యాంకులు, స్టాఫ్ సెలక్షన్స్, ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ వరకు ఏ సంస్థ నిర్వహించినా పోస్టులు వేలల్లో ఉంటే పోటీపడేవారు లక్షల్లో ఉంటారు. ఏపీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్-2 కేటగిరీలో వెయ్యి పోస్టులుంటే పోటీపడేవారి సంఖ్య గడువు డిసెంబర్ 10 నాటికి ఏడెనిమిది లక్షలకు చేరడం ఖాయం. అంటే ప్రతి పోస్టుకూ 800 మంది తలపడే అవకాశం ఉంది. పోటీ ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇంత పోటీని ఎదుర్కోవాలంటే బలమైన సంకల్పం, తృష్ణ ఉండాలి. అయితే చాలామందిలో ఇది కొరవడుతుంటుంది. కొంతమందిలో తొలిదశలో ఉన్నట్లు కనిపించినా క్రమేపీ ఆరిపోతుంది. అయితే ఆశ్చర్యకరంగా ఈ విషయాన్ని వారు గుర్తించరు. తాము చదువుతున్నామనే అనుకుంటారు కానీ ఫలితం మాత్రం ప్రతికూలంగా వస్తుంది.

నేర్చుకునే అవసరం

అసలు ఓటమి ఎదురు కాకపోతే నేర్చుకోవాల్సిన అవసరమే రాదు. నేర్చుకునే అవసరమే రాకపోతే మార్పుకు అవకాశమే లేదు. ఇతర రంగాల్లోలా పోటీ పరీక్షల్లోనూ పరాజయం అనేది మళ్లీ కొత్తగా ప్రారంభించడానికి ఒక అవకాశం. అయితే ఈసారి మరింత తెలివిగా ప్రయత్నం మొదలుకావాలి. అప్పుడు ఓటమీ గెలుపు పాఠమే! పోటీ పరీక్షలు కొన్ని ప్రత్యేక నైపుణ్యాలను డిమాండ్ చేస్తాయి. రాయబోయే పోటీ పరీక్ష సిలబస్ ఏంటి? దాని నుంచి ఆశించే నైపుణ్యాలు ఏమిటన్న మౌలికప్రశ్నలను వేసుకుని పరీక్షలకు ఉద్యుక్తులు కావాలి. సన్నద్ధత దశ ఆద్యంతం అదే కోణంతో అధ్యయనం చేయాలి.

సమీక్షకు దూరం

రాయబోయే పోటీపరీక్షకు సంబంధించి చదివినదాన్ని పరీక్షించుకోవడం ద్వారా సబ్జెక్టుల రీత్యా ఎక్కడెక్కడ ఇబ్బందులు ఉన్నాయో బహిర్గతం అవుతాయి. పరీక్ష పేపర్లు అన్నింటినీ ఇలా పరీక్షించుకోవడం ద్వారా పరీక్ష కంటే ముందే ఎక్కడెక్కడ సమస్యలు ఎదురవుతున్నాయో కూడా స్పష్టమవుతుంది. దీన్నే సమీక్షించుకోవడంగా పరిగణిస్తారు. పోటీ పరీక్షల ప్రస్థానంలో కనీసం రెండు దశల్లో ఈ ప్రక్రియ జరగాలి. దీని ఆధారంగా సన్నద్ధతలో పునశ్చరణ ఎక్కడెక్కడ చేసుకోవాలో నిర్ణయించుకోవచ్చు. కానీ ఎక్కువమంది అభ్యర్థులు ఈ ప్రక్రియను నివారించడం వల్ల ప్రతికూల ఫలితమే శరణ్యమవుతోంది.



ప్రత్యర్థులు లేని మైండ్‌గేమ్

క్రీడా మైదానంలో ఉండేవి ఆటలు అయితే మానసిక వేదికపై జరిగేవి మైండ్ గేమ్స్. ప్రత్యర్థులపై ఆధిపత్యం కోసం మానసికంగా వారిని చిత్తు చేయడం కోసం జరిగేదే మైండ్‌గేమ్. పోటీపరీక్షలు కూడా మైండ్‌గేమ్‌లో భాగం. అయితే ఇందులో ప్రత్యక్షంగా ప్రత్యర్థులుండరు. వేర్వేరు సొంత మానసిక స్థితులతో అభ్యర్థులకు అంతర్మథనం జరుగుతుంటుంది. ఇది మూడు దశల్లో ఉంటుంది.

తొలి దశ: ఈ దశలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యావకాశాలు, వాటి ద్వారా వచ్చే హోదా, వేతనం, సామాజిక గుర్తింపు యువతీ యువకులను ఉత్తేజపరుస్తాయి. మరోపక్క వివిధ పరీక్షల్లో టాపర్ల విజయాలు స్ఫూర్తిని కలిగిస్తాయి. తమలాగే సాధారణ తెలివితేటలు, సామాన్య కుటుంబాల నుంచి వచ్చినవారే విజయాలు సాధించినందువల్ల తామూ ఆ తరహా విజయాన్ని అందుకోగలమన్న ఆత్మవిశ్వాసం కొత్త లక్ష్యాలకు పురిగొల్పుతుంది. ఇది సానుకూల మానసికస్థితిని ప్రేరేపించే దశ.

మలి దశ: ఉత్సాహపూరిత వాతావరణంలో పోటీపరీక్షల కదన రంగంలోని దూకి సన్నద్ధమయ్యే దశ. పోటీపరీక్ష సిలబస్, పరీక్షవిధానం, రిఫరెన్స్ పుస్తకాలు, కాలవ్యవధి, ఎదురయ్యే పోటీ తదితర అంశాలపైనా సన్నద్ధత కొంత ప్రారంభించడంతో అందులోని వాస్తవికత అవగాహనకు వస్తుంది. కష్టనష్టాలు అర్థమవుతాయి. అప్పటివరకూ ఉత్తేజపూరితంగా ఉన్న మెదడుకు ప్రతికూల సంకేతాలు చేరతాయి. దాంతో ఇంత కష్టమైన గమ్యాన్ని అసలు చేరగలమా అన్న సందేహాలు మొదలవుతాయి. మెదడు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తుంటుంది. ఈ దశలోనే చాలామంది పోటీ నుంచి నిష్క్రమిస్తారు. అంటే సదరు పోటీపరీక్షలకు దరఖాస్తుదారులు సంఖ్యాపరంగా ఉంటారు కానీ, పోటీకి మాత్రం స్వస్తి చెబుతారు.


ఫలప్రద దశ: మలిదశలోని ప్రతికూల మానసిక స్థితిని అధిగమించి పోరాటానికి సిద్ధపడే దశ ఇది. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా సరే పరీక్షను బాగా రాసి ఫలితాన్ని పరీక్షించుకోవాలనే మానసిక స్థితి ఇది. మెదడుకు ఈ విధమైన సంకేతాలు అందగానే ఇక అన్ని సమస్యలకూ పరిష్కారాలు కన్పిస్తుంటాయి. కొన్నింటికి పరిష్కారాలు కనిపించకపోయినా, పోరాటపటిమ ఏర్పడుతుంది. ఇలా అంతిమ పోరుకు సిద్ధపడినవారి నుంచే విజేతలు అవతరిస్తారు.





అవగాహన లోపం

ఉద్యోగ పోటీ పరీక్షలకు ఉద్యుక్తులయ్యేవారిలో సగానికి సగం మందికి సరైన అవగాహన ఉండదు. చేయబోయే ఉద్యోగం, రాయబోయే పరీక్ష విధానం, శ్రమించాల్సిన మార్గంపై తగిన స్పష్టత కొరవడుతుంది. తమకు ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో మంచి మార్కులు వచ్చాయని, పోటీ పరీక్షలనూ వాటిలాగే తేలికగా రాసేయవచ్చు అన్న అపోహలో ఉంటారు. దీనివల్ల చేయవలసినంత శ్రమ చేయరు. నిజానికి అకడమిక్ పరీక్షలు వేరు, పోటీ పరీక్షలు వేరు. ఉత్తర, దక్షిణ ధ్రువాల వంటి ఈ రెండింటి మధ్య వ్యత్యాసాన్ని గుర్తిచలేక చివరికి ఓటమినే ఆహ్వానిస్తారు.



పత్తాలేని ప్రణాళిక

పటిష్ఠ ప్రణాళికలేని విజయాలు కాగితాలకే పరితమవుతాయి. పోటీపరీక్షల్లో విజయం సాధించాలన్న ఆకాంక్ష ఉన్నా తగిన ప్రణాళిక ఉండదు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురుకుల ఉపాధ్యాయుల ఎంపికకు ఉద్యోగ ప్రకటన వెలువరిస్తున్నా, లేక ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్ష నిర్వహిస్తున్నా ఇందుకో నిర్ణీత షెడ్యూల్ ఉంటుంది. దీన్ని ఆధారం చేసుకుని పరీక్ష తేదీ వరకు ఉన్న వ్యవధి దృష్టిలో ఉంచుకుని దానిని ఎలా చేరాలన్న ప్రణాళిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చేసుకోలేకపోతే విజయం దూరంగానే ఉంటుందనడంలో సందేహం లేదు.

స్ఫూర్తి కొరవడటం

పోటీపరీక్షల ప్రస్థానం సుదీర్ఘంగా ఉంటుంది. సివిల్స్ నుంచి రాష్ట్ర స్థాయి సర్వీసుల పరీక్షల వరకు కనీసం మూడు, నాలుగేళ్ల సమయం వెచ్చిస్తేనేకానీ ఫలితం అందదు. ఈ ప్రయాణంలో తొలి అడుగు నుంచి ఫలితం అందుకునే వరకూ ఒకేరకమైన ఉత్తేజాన్ని నిలుపుకోగలిగితేనే లక్ష్యాన్ని అందుకోగలరు. కానీ చాలామందికి తొలిరోజుల్లో ఉన్న స్ఫూర్తి ఆపై కొరవడుతుంది. సహచరుల వ్యాఖ్యలు, సొంత అపజయాలు, మధ్యలో తారసపడే ఇతర పోటీ పరీక్షలు, తనపై తనకు నమ్మకం సన్నగిల్లడం వంటి కారణాలరీత్యా మసకబారుతుంది. నిజానికి ఇది సహజం. కానీ ఎప్పటికప్పుడు ఆ జ్వాల ప్రజ్వరిల్లేలా చేసుకోవాలి. అదీ విజయయాత్రలో భాగమే. కానీ మెజారిటీ అభ్యర్థులు ఈ విషయంలో వెనుకబడటం వల్ల ముందున్న ఉత్సాహం తగ్గిపోతుంది. దీంతో గమ్యంవైపు చేసే పరుగులో వేగం మందగిస్తుంది. క్రమేపీ చల్లబడిపోతుంది. పోటీపరీక్షల్లో ఎక్కువమంది పరాజయాలకూ, కొద్దిమంది విజయాలకూ ఇదే కారణం. పోటీపరీక్షలు రాసే అభ్యర్థులు చాలామందికి ఈ పది మెట్లలో ఎక్కడోచోట పొరపాటు చేసి, ఓటమిని చవిచూస్తుంటారు. పూర్తిగా పోటీపరీక్షలకు కొత్త అభ్యర్థులైతే పొరపాట్లు చేసే అవకాశం ఉన్న దశలు ఇవే. అయితే అపజయాలు జీవితంలో భాగమైనట్టే పోటీపరీక్షల్లోనూ అనివార్యం.



అమలు చేయకపోవటం

సివిల్స్ వంటి జాతీయస్థాయి పోటీ ఉన్న పరీక్షతో సహా కొంతమందికి ప్రణాళికకు కట్టుబడి ఉండలేకపోవడం, దాన్ని చిత్తశుద్ధితో అమలు చేయకపోవడంలో విఫలమవుతుంటారు. కార్యాచరణ ప్రారంభంలో కొంత ఉత్సాహం ఉన్నా.. దీర్ఘకాలం దానిని నిలుపుకోలేకపోవడం వల్ల చివరికి సరైన పోటీ ఇవ్వలేరు. కొన్నిసార్లు సన్నద్ధతలో ఎదురయ్యే అవరోధాలను సమర్థంగా ఎదుర్కోలేరు. అసమంజసమైన ప్రణాళికలు రూపొందించుకోవడం, అసాధ్యమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం వల్ల కూడా ఓటమిని తప్పించుకోలేరు.

పోటీ పరీక్షల లోపం


పోటీ పరీక్షలు కొన్ని ప్రత్యేక నైపుణ్యాలను డిమాండ్ చేస్తాయి. రాయబోయే పోటీ పరీక్ష సిలబస్ ఏంటి? దాని నుంచి ఆశించే నైపుణ్యాలు ఏమిటన్న మౌలికప్రశ్నలను వేసుకుని పరీక్షలకు ఉద్యుక్తులు కావాలి. సన్నద్ధత దశ ఆద్యంతం అదే కోణంతో అధ్యయనం చేయాలి. పోటీపరీక్ష కోణాన్ని ఏ సబ్జెక్టు విషయంలోనూ విడువకూడదు. అయితే చాలామంది ఈ విషయంలో విఫలమవుతుంటారు. అసలు ఈ కోణాన్ని గుర్తించకపోవడమో లేదా మధ్యలో ఆ ట్రాక్ నుంచి పక్కకు వచ్చేయడమో జరుగుతుంది. ఫలితంగా అనుకున్న లక్ష్యాన్ని చేరలేరు.

పక్కదారి పట్టడం

విజయసాధకుడైన పోటీ పరీక్షార్థి తనకు ఆసక్తిగల పోటీపరీక్షను నిర్ణయించుకునే దశలోనే తగిన సమయం తీసుకుని లక్ష్యాన్ని నిర్దేశించుకుంటాడు. తరువాత ఇక పరీక్ష పూర్తయ్యేంతవరకూ దానికే కట్టుబడి ఉంటాడు. కానీ అత్యధిక అభ్యర్థులు మధ్యలో చాపల్యానికి గురవుతున్నారు. సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా నిర్దేశించుకున్న అభ్యర్థి మధ్యలో సంబంధం లేని ఇతర పరీక్షలకు సిద్ధమవుతూ పక్కదారి పట్టడం ద్వారా ఏ లక్ష్యాన్నీ చేరలేకపోతున్నాడు.

మూల్యాంకీకరణకు విముఖం

పోటీపరీక్షలకు సిద్ధమయ్యేవారిలో ఎక్కువమంది తమ సన్నద్ధతను ఏ దశలోనూ పరీక్షించుకోరు. మూడు నెలలు చదివినా, ఆరు నెలలు చదివినా ఏకంగా నియామక సంస్థ నిర్వహించే పరీక్షకే హాజరవుతారు. పరీక్ష హాలులోనే తొలిసారి తాము చదివిన దాన్ని పరీక్షించుకుంటారు. నిజానికి చదివినదాన్ని పునరుత్పత్తి చేయడమనే ప్రక్రియలో మధ్యలో



మరో దశ ఉంటుంది. ఈ దశలోనే జ్ఞాపకం లేనివి బయటపడతాయి. ఎంత చదివినా అభ్యర్థిధారణ శక్తిని బట్టి కొన్ని అంశాలు జ్ఞాపకం ఉండవు. దీన్ని పరీక్షహాలు బయటే, పరీక్షకంటే ముందే పరీక్షించుకుని ఉంటే పరాజయ ఉపద్రవం తప్పుతుంది. కానీ చాలామంది ఇందుకు ఇష్టపడరు.

తొలి అడుగు... ఆర్టికల్‌షిప్

సీఏ విద్యార్థులకు పరిజ్ఞానంతోపాటు భవిష్యత్తులో వారు చేయబోయే ఉద్యోగాలకు/ ప్రాక్టీసుకి సంబంధించి తర్ఫీదునిచ్చే వేదిక ఇది. దీని ద్వారా విద్యార్థి అనేక కొత్త విషయాలూ, మెలకువలూ తెలుసుకోవచ్చు! అందుకే దీని ప్రాముఖ్యం గమనించి సద్వినియోగం చేసుకోవాలి. సీఏ ఉత్తీర్ణుడైన విద్యార్థి ఉద్యోగానికి వెళ్లవచ్చు. సొంతంగా ప్రాక్టీసూ పెట్టుకోవచ్చు. ఈ రెండు సందర్భాల్లోనూ ఆర్టికల్‌షిప్ ఉపయోగకరమే. ప్రాక్టీసుకు వెళ్లాలనుకుంటే దీని ప్రాముఖ్యం ఇంకా ఎక్కువేనని చెప్పాలి. సీఏ-ఐపీసీసీ ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. సీఏ కోర్సులో ఐపీసీసీ దశ పూర్తిచేసినవారు 3 సంవత్సరాల ఆర్టికల్‌షిప్ (ప్రాక్టికల్ ట్రైనింగ్) పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇది ప్రతి విద్యార్థికీ తప్పనిసరి. ఒక ప్రాక్టీసింగ్ చార్టర్డ్ అకౌంటెంట్ దగ్గర కానీ, ఒక ఆడిట్ సంస్థలో కానీ దీన్ని పూర్తిచేయాలి. ఆర్టికల్‌షిప్‌లోని 3 సంవత్సరాల్లో రెండున్నర సంవత్సరాలు పూర్తయి మరో ఆరు నెలల్లో ఆర్టికల్‌షిప్ సమయం పూర్తవుతుందనగా సీఏ ఫైనల్ పరీక్ష రాయవచ్చు. సీఏ చదివేటప్పుడు కోర్సులోని ప్రతి అంశంపై విద్యార్థికి లోతైన అవగాహన అవసరం. ఇది కేవలం తరగతి జ్ఞానంవల్లే రాదు. ఆర్టికల్‌షిప్ ద్వారా



విద్యార్థి తరగతిలో నేర్చుకున్న అంశాలు నిజజీవితంలో ఎలా అనుసరిస్తారన్నది తెలుసుకుంటాడు. కాబట్టి, సబ్జెక్టుపై మంచి పట్టు సాధించవచ్చు. తద్వారా సీఏ ఫైనల్ పరీక్షకు సులువుగా సన్నద్ధమవవచ్చు. ఆర్టికల్‌షిప్ సమయంలో విద్యార్థి ఆడిటింగ్ పనిమీద వేర్వేరు ప్రదేశాలకు వెళ్లవలసి వస్తుంది. అక్కడ రకరకాల వ్యక్తులనూ, అధికారులనూ కలిసే వీలుంటుంది. ఆడిటింగ్‌లో భాగంగా రకరకాల అంశాలను పరీక్షించవలసి ఉంటుంది. ఇటువంటి వాటిద్వారా విద్యార్థి తన భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చు.

నెట్‌లో నెగ్గుదాం!



ఇష్టమైన సబ్జెక్టులో లోతైన పరిశోధనలు చేసి మరింత నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి సాయపడుతోంది సీఎస్ఐఆర్ నెట్. ఆర్థిక సాయంతోపాటు ఉద్యోగాలకు కావాల్సిన అర్హతలనూ అందిస్తోంది. ఈ పరీక్షలో నెగ్గితే జేఆర్ఎఫ్‌గా పరిశోధన రంగంలో ప్రవేశించవచ్చు. విశ్వవిద్యాలయాలూ, కళాశాలల్లో యూజీసీ గుర్తింపు పొందిన అధ్యాపకులుగా చేరే వీలుంది. సొంత ల్యాబ్‌లు పెట్టుకోవడం, రిసెర్చ్ బృందాలకు నాయకత్వం వహించడం వంటి వాటికి అవకాశం ఉంటుంది. మనదేశంలో శాస్త్రీయ, సాంకేతిక మానవ వనరులను అభివ ద్ధి చేస్తున్న అతిపెద్ద సంస్థ సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్). ప్రపంచంలోనే పెద్దదైన ఇండస్ట్రియల్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ ఇది. బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్, ఇతర మౌలిక సైన్స్ రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థ కూడా ఇదే. దీని పరిధిలో దేశం మొత్తంలో 38 జాతీయ ప్రయోగశాలలు, 80 ఫీల్డ్ స్టేషన్లు ఉన్నాయి. ఎంఎస్సీ లేదా ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీలో 55% మార్కులతో ఉత్తీర్ణులైన జనరల్, ఓబీసీ విద్యార్థులూ 50% మార్కులతో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ విద్యార్థులూ ఈ పరీక్షకు అర్హులు. ఎంఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ తుది సంవత్సరం చదువుతున్నవారూ అర్హులే. జేఆర్ఎఫ్‌కు అర్హత సాధించడానికి జనరల్ కేటగిరీ విద్యార్థులకు గరిష్ఠ వయసు పరిమితి 28 సంవత్సరాలు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్, మహిళా విద్యార్థులకు వయసులో అయిదేళ్ల సడలింపు ఉంది. నాన్ క్రీమిలేయర్ ఓబీసీ విద్యార్థులకు మూడేళ్ల సడలింపు ఉంది.

ఫార్మా కోర్సులకు నైపర్

సైన్స్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో అంతే స్పీడుతో కొత్త కొత్త వ్యాధులూ పుట్టుకొస్తున్నాయి. వాటి నివారణకు ఔషధాలను కనిపెట్టడం ఎప్పటికప్పుడు సవాలుగా మారుతోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఫార్మా పరిశ్రమ రోజురోజుకీ విస్తరిస్తూనే ఉంది. మనదేశంలో కూడా ఈ పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇందుకు కావాల్సిన నిపుణుల అవసరాలూ పెరుగుతున్నాయి. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జాతీయ ఫార్మాస్యూటికల్ విద్య, పరిశోధన సంస్థలను నెలకొల్పింది. అవి పలు రకాల కోర్సులను అందిస్తున్నాయి. వాటిని పూర్తి చేసినవారి కోసం ఎన్నో ఉద్యోగావకాశాలు ఎదురుచూస్తున్నాయి. మనదేశం ఫార్మా పరిశోధనలకు పెద్ద పీట వేసింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ రిసెర్చ్‌లు ఎక్కువగానే జరుగుతున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల దాదాపు 200కు పైగా ఫార్మా కంపెనీలు ఉన్నాయి. బల్క్‌డ్రగ్‌కు భాగ్యనగరం కీలక కేంద్రం. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న వ్యాక్సిన్లలో సుమారు 33 శాతం ఒక్క



హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయి. ఆఫ్రికా దేశాలకు తక్కువ ధరకే వ్యాక్సిన్లను అందిస్తున్న ఘనత కూడా మనదే. జాతీయ ప్రాధాన్య సంస్థగా గుర్తింపు పొందిన నైపర్ వివిధ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీతోపాటు, పీహెచ్ డీలను కూడా అందిస్తోంది. కెమికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ల నుంచి పది విభాగాల్లో పీహెచ్‌డీలను నైపర్ ఆఫర్ చేస్తోంది. పీజీలో మెడికల్ కెమిస్ట్రీ కోర్సుకు మాత్రం ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) చేసి సీఎస్ఐఆర్ నెట్ లేదా యూజీసీ నెట్ ఉత్తీర్ణత సాధించాలి. ఫార్మా టెక్నాలజీ పీజీ కోర్సుకు కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి గేట్‌లో క్వాలిఫై కావాలి.

మన్‌ప్రీత్‌కు హాకీ జట్టు పగ్గాలు



న్యూఢిల్లీ : వచ్చే నెల్లో జరిగే కామన్‌వెల్త్ క్రీడల హాకీ పోటీల్లో తలపడే భారత హాకీ జట్టుకు మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ సారథ్యం వహిస్తాడు. ఈ టోర్నీలో ఆడే 18 మంది భారత బృందాన్ని భారత హాకీ సంఘం ప్రకటిం చింది వచ్చే నెల్లో 21వ కామన్‌వెల్త్ క్రీడలకు ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్ నగరం ఆతిథ్యమివ్వనుంది. ఏప్రిల్ 4 నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయి. కామన్‌వెల్త్ క్రీడల హాకీలో భారత జట్టు పూల్-బిలో పాకిస్తాన్, మలేసియా, వేల్స్, ఇంగ్లండ్‌తో పోటీపడుతుంది. ఏప్రిల్ 7న దాయాది పాకిస్తాన్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో భారత్ ఈ చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ఆడే భారత జట్టుకు మన్‌ప్రీత్ సింగ్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించిన హాకీ సంఘం సింగల్సేనా సింగ్ కంగుజమ్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించింది. 2007లో భారత జట్టు మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో ఆసియా కప్ గెలుచుకుంది. ఆ తర్వాత 2017లో జరిగిన మెన్స్ హాకీ వరల్డ్ లీగ్‌లో కాంస్య పతకం సాధించింది. ఇటీవల మలేసియాలో జరిగిన అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత జట్టుకు కెప్టెన్సీ చేసిన సర్దార్ సింగ్‌కు జట్టులో చోటు దక్కలేదు. ఇక డ్రాగ్ ఫ్లిక్‌లో స్పెషలిస్ట్ రూపిందర్ సింగ్ పాల్, హర్మన్ ప్రీత్ సింగ్, వరుణ్‌కుమార్, కొత్తాజిత్ సింగ్, గురిందర్ సింగ్, అమిత్ రోహిదాస్‌లకు ఈ జట్టులో అవకాశం కల్పించారు. కొత్త గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్‌కు ఈ జట్టులో ఛాన్సిచ్చారు. 2017 ఆసియా కప్ నుంచి భారత ఆటగాళ్లు చూపెట్టిన ప్రతిభ ఆధారంగా ఈ జట్టును ఎంపిక చేశారని, కామన్‌వెల్త్ కీడల్లో భారత్ మంచి ఫలితాలు సాధించగలదని చీఫ్ కోచ్ సెజెర్డ్ మారిజెన్ తెలిపాడు. ఇంతకు ముందు గ్లాస్గోలో జరిగిన కామన్‌వె త్ క్రీడల్లో భారత జట్టు ఆస్ట్రేలియా తర్వాత రెండో స్థానంలో నిలిచింది. గ్రూప్ దశ పోటీల్లో మంచి ఫలితాలు సాధించటమే మొదటి లక్ష్యంగా పెట్టుకున్నామని కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ చెప్పాడు. భారత్‌తో పాటు పూల్‌బీలో చాలా బలమైన జట్లు ఉన్నాయని సెమీస్ చేరాలంటే అద్భుతాలు సాధించాలని, అందుకు సిద్ధంగా ఉన్నామని అన్నాడు.

కామన్‌వెల్త్ క్రీడలకు భారత హాకీ జట్టు

శ్రీజేష్, సూరజ్ కర్కెరా (గోల్‌కీపర్లు), డిఫెండర్లు : రూపిందర్ పాల్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, వరుణ్‌కుమార్, కొథాజిత్ సిగవ్, గురిందర్ సింగ్, అమిత్ రోహిదాస్, మిడ్‌ఫీల్డర్లు: మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), చింగల్సేనా సింగ్ (వైస్‌కెప్టెన్), సుమిత్, వివేక్ సాగర్ ప్రసాద్, ఫార్వార్డ్స్ : ఆకాష్‌దీప్ సింగ్, ఎస్.వి.సునీల్, గుర్జంత్ సింగ్, మన్‌దీప్ సింగ్, లలిత్‌కుమార్ ఉపాధ్యాయ్, దిల్‌ప్రీత్ సింగ్. సెజోర్డ్ మారిజెన్ (కోచ్)

సింధు, శ్రీకాంత్‌లపైనే ఆశలు



నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఆల్ ఇంగ్లండ్ ఓపెన్...బ్యాడ్మింటన్ క్రీడలో అత్యుత్తమ టోర్నీ. టెన్నిస్‌లో గ్రాండ్‌శ్లామ్‌లా, క్రికెట్‌లో ప్రపంచ కప్‌లా ఈ మెగా టోర్నీలో ఆడాలని, గెలవాలని ప్రతి క్రీడాకారుడి కల. 1980లో ప్రకాశ్ పడుకొనే.. ఆ తర్వాత 21 ఏళ్ల విరామం అనంతరం పుల్లెల గోపీచంద్ (2001) ఈ టోర్నీలో గెలుపొంది భారత్ బ్యాడ్మింటన్‌లో కొత్త చరిత్రను తిరగరా శారు. ఆ తర్వాత సైనా నెహ్వాల్ రెండేళ్ల క్రితం మెరుపులు మెరిపిం చినా పతకం గెలుచుకోలేక పోయింది . ఇప్పుడు భారత బ్యాడ్మింటన్‌కు స్వర్ణ యుగం నడుస్తోంది. రియో ఒలింపిక్ స్టార్ సింధు, గ్రాండ్‌ప్రి విజేత శ్రీకాంత్‌లతో పాటు యువ సంచలనాలు చాలా మంది ఈ సారి ఈటోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోను న్నారు. 17 ఏళ్ల నుంచి అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఈ ఆల్ ఇంగ్లండ్ టోర్నీ టైటిల్‌ను భారత ఆటగాళ్లు గెలుచుకొస్తారని అభిమానులు ఎదురుచూస్తున్నారు.

బర్మింగ్‌హామ్ : ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌కు అంతా రెడీ అయింది. నెల రోజుల పాటు హైదరాబాద్ లో కోచ్ గోపీచంద్ శిక్షణలో రాటుదేలిన భారత ప్లేయర్ల సత్తాకు ఈ టోర్నీ అగ్నిపరీక్ష కానుంది. ఇవాళ్టి నుంచి జరిగే ప్రతిష్ఠాత్మక టోర్నీలో భారత సెన్సేషనల్ స్టార్ సైనాకు కఠినమైన డ్రా ఎదురవవగా రైజింగ్ స్టార్ సింధుకు పోటీ అనుకూలంగా ఉంది. టైటిల్ కోసం సైనా అసాధారణంగా పోరాడాల్సిందే. తొలి రౌండ్‌ను అధిగమించాలంటే రాకెట్ క్వీన్ ప్రపంచ నెంబర్‌వన్‌ను ఓడించాలి. సైనా తొలి పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ తై జు యింగ్‌ను ఢీకొనబోతోంది.. తైజుతో గత ఏడు మ్యాచ్‌ల్లో ఒక్క విజయమైనా సైనా సాధించలేదు. ఇక సైనాతో పోలిస్తే రైజింగ్ స్టార్ సింధుకు సులువైన డ్రా ఎదురైంది. నాలుగో సీడ్‌గా బరిలో దిగుతున్న రియో ఒలింపిక్స్ క్వీన్... ఫస్ట్ మ్యాచ్‌లో థాయ్‌లాండ్ ప్లేయర్ పోర్న్‌పవి చోచువాంగ్ తో తలపడనుంది. రెండో రౌండ్లో ఇండియా ఓపెన్ విజేత చైనా ప్లేయర్ బివెన్ జాంగ్ ఎదురయ్యే అవకాశముంది. వరల్డ్ బ్యాడ్మింటన్‌లో ఒక్కో డ్రీమ్‌ను నెరవేర్చుకుంటున్న యంగ్ రాకెట్....ఈ సారి ఆల్ ఇంగ్లండ్ సాధించాలని పట్టుదలగా ఉంది. 2017లో క్వార్టర్ ఫైనల్ దాకా వచ్చిన సింధు ఈ సారి పతకం ఖాయమని ధీమాగా చెబుతోంది.

హాట్ ఫేవరెట్ శ్రీకాంత్

పురుషుల విభాగంలో మూడో సీడ్, భారత యువ సంచనలంఠ కిదాంబి శ్రీకాంత్ హాట్‌ఫేవరెట్‌గా బరిలో దిగుతున్నాడు. ప్రపంచ ర్యాంకుల్లో తొమ్మిదో స్థానంలో ఉన్న శ్రీకాంత్ తొలి రౌండ్‌లో ఫ్రాన్స్ ఆటగాడు బ్రిస్ లావర్డెజ్‌తో ఆడతాడు. 2017లో నాలుగు సూపర్ సిరీస్‌లు గెలుచుకుని సంచలనం సృష్టించిన శ్రీకాంత్ ఈ టోర్నీలో డెన్మార్క్ ఆటగాడు వరల్డ్ నంబర్ వన్ విక్టర్ అలెక్సెన్‌తో పాటు మలేసియా స్టార్ లీ చాంగ్ విల నుంచి గట్టిపోటీ ఎదుర్కొనే అవకాశముంది. ఇక భారత రైజింగ్ స్టార్ సింగపూర్ ఓపెన్ విజేత సాయి ప్రణీత్, 12వ ర్యాంక్ ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్‌లు కూడా సింగిల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మాజీ వరల్డ్ నంబర్ వన్ ఆటగాడు సోన్ వాన్ హో (కొరియా)తో ప్రణీత్ తొలి రౌండ్‌లో ఆడతాడు. చైనీస్ తైపీకి చెందిన తిన్‌చెన్‌తో ప్రణయ్ తొలి మ్యాచ్‌ను ఆడతాడు. ఇటీవలే కాలి గాయం నుంచి కోలుకున్న ప్రణయ్ ఈ టోర్నీలో సత్తాచూపెట్టబోతున్నాడు. డబుల్స్ విభాగంలోనూ భారత్ ఈ టోర్నీలో సత్తా చూపెట్టేందుకు రెడీ అయింది. ఇండోనేసియా ఓపెన్ సెమీఫైనల్ జోడి చిరాగ్ శెట్టి, స్వస్తిక్ సిరాజ్‌లకు తొలి రౌండ్‌లో గట్టిపోటీ ఎదురైంది. మహిళల డబుల్స్‌లో అశ్విన్ పొన్నప్ప, సిక్కిరెడ్డిలు రెండో సీడ్ జపాన్ జోడి మిసాకి , అయెకాలతో పోటీపడుతుంది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ప్రణవ్ చోప్రా, సిక్కిరెడ్డి జంట జర్మన్ జంట మార్విన్, లిండాలతో పోటీపడుతుంది.



కల నెరవేరుస్తా : సింధు

ఆల్ ఇంగ్లండ్‌లో గెలవాలనే నా కోరిక ఈ సారి తీరుతుందని ఆశిస్తున్నా. ఈ టోర్నీలో గెలిచి నంబర్ వన్ కావాలన్న నా లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలనుకుం టున్నా... ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టేందుకు ఇటీవలే కొత్తగా సొంత ఫిజియోను కూడా నియమించుకున్నా. ముంబైకి చెందిన గాయత్రి నాతో కలిసి పని చేస్తోంది. గాయత్రి శిక్షణతో నాలో చాలా మార్పు కూడా వచ్చింది. శరీరంపై అధిక భారం పడకుండా, అదే విధంగా ఎలాంటి లోపాలు లేకుండా ప్లానింగ్‌తో ఫిట్‌నెస్ ట్రైనింగ్ చేయడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. మానసికంగా కూడా మరింత ద ఢంగా మారాను. ఇటీవల నా ఆటలో కొన్ని మార్పులు చేయడం తప్పనిసరిగా మారిపోయింది. తై జు లాంటివాళ్లు తెలివిగా తప్పు దోవ పట్టించే షాట్‌లను ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా జపాన్ క్రీడాకారిణులు కూడా సుదీర్ఘ ర్యాలీలపైనే ద ష్టి పెట్టారు. గతంలో నా బలం స్మాష్‌ను సమర్థంగా ఉపయోగించుకునేదాన్ని. అయితే నా ప్రత్యర్థులు షటిల్‌ను ఏమాత్రం పైకి లేపకుండా ఆడుతూ స్మాష్‌కు అవకాశం ఇవ్వడం లేదు. దాంతో నేను కూడా కొత్తగా ఆలోచించాల్సి వచ్చింది.

పతకం ఖాయం : గోపీచంద్

ఆల్ ఇంగ్లండ్ టోర్నీ కోసం గత రెండు వారాలుగా పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యాం. ఇతర సూపర్ సిరీస్ టోర్నీలతో పోలిస్తే ఆల్ ఇంగ్లండ్‌కు అందరి ద ష్టిలో క్రేజ్ ఉన్నా... ఆ పేరుతో ఆటగాళ్లపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేయడం లేదు. ఈ ఏడాది పూర్తి స్థాయిలో సిద్ధమై ఆడుతున్న తొలి టోర్నీ ఇదే. మంచి ఫలితాలు సాధించేందుకు తీవ్రంగా శ్ర మించాం. ముఖ్యంగా సింధు, శ్రీకాంత్‌లకు మంచి అవకాశం ఉందని చెప్పగలను. సానుకూల ఫలితాలు ఆశిస్తున్నాం. ఆల్ ఇంగ్లండ్ తర్వాత వెంటనే కామన్వెల్త్ క్రీడలు ఉన్నాయి కాబట్టి ఆ దిశగా కూడా ద ష్టి పెట్టి ప్రాక్టీస్ చేశాం. బీడబ్ల్యూఎఫ్ కొత్త షెడ్యూల్ కారణంగా మన ఆటగాళ్లకే ఎక్కువగా నష్టం జరగనుంది. 2018కి సంబం ధించిన పూర్తి షెడ్యూల్‌ను ఆటగాళ్లకు ఇప్పటికే అందించాను. కొత్త షెడ్యూల్ పరీక్ష ఇప్పుడు మొదలైంది. ఏడాదికి 12 టోర్నీల్లో కచ్చితంగా ఆడాల్సిన స్థితిలో టోర్నీ, ప్రిపరేషన్ కలిపి కామన్వెల్త్, ఆసియా క్రీడలకు రెండు నెలల టైమ్ పోతుంది. బ్యాడ్మింటన్ ప్రపంచంలో భారత్‌కు, మలేసియాకు మాత్రమే ఇప్పుడు సమస్య ఉంది. దేశం తరపున పతకం కోసం కాబట్టి మా ఆటగాళ్లెవరూ పెద్ద ఈవెంట్లకు దూరం కావడం లేదు.

పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నా : శ్రీకాంత్

గత ఏడాది నాకు అద్భుతంగా గడిచింది. ఈ సంవత్సరం ఇండియా ఓపెన్‌లో సానుకూల ఫలితం రాలేదు కానీ ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో విజయం సాధించాలని పట్టుదలగా ఉన్నా. ఫిట్‌నెస్ పరంగా ప్రస్తుతం 100 శాతం బాగున్నాను. ప్రత్యేకంగా సన్నాహాలు లేకపోయినా గత రెండు వారాలుగా బాగా శ్రమించాను. ఈ కష్టం ఫలితాల రూపంలోకి మారాలని కోరుకుంటున్నా. సింగిల్స్ కోచ్‌గా మంచి ఫలితాలు అందించిన ముల్యో జట్టుకు దూరం కావడంతో మరీ పెద్ద ప్రభావం ఉండకపోవచ్చు కానీ ఆయన శిక్షణ సమయంలో కొన్ని రకాల ఆలోచనలు, ప్రత్యర్థిని ఎదుర్కొనే విషయంలో కొన్ని వ్యూహాలకు అలవాటు పడ్డాం. ఇప్పుడు మళ్లీ మార్చుకోవాల్సి ఉంటుంది. అయితే గోపీ సర్ ఉన్నారు కాబట్టి సమస్య లేదు.

కొత్త రూల్స్‌పై విముఖత

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ ద్వారా కొత్తగా అమల్లోకొచ్చిన నిబంధలపై కోచ్‌లతో పాటు క్రీడాకారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. మ్యాచ్ మధ్యలో కోచింగ్ సమయాన్ని తగ్గించటం, ఇప్పటి వరకూ ఉన్న మూడు సెట్లను ఐదు సెట్లుగా మారి గేమ్ పాయింట్‌ను 21 నుంచి 11కు తగ్గించాలన్న రూల్స్‌తమపై ఒత్తిడి పెంచుతాయని పలువురు ప్లేయర్లు చెబుతున్నారు. ఇప్పటికే ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య కొన్ని నిబంధనలు అమల్లోకి తెచ్చింది.మరికొన్నింటిని త్వరలో అమలు చేయనున్నారు.

కొత్త నిబంధనలు

- సర్వీస్ సమయంలో షటిల్‌ను తాకేప్పుడు రాకెట్ కోర్టు నుంచి 1.15 మీటర్లు మించి ఎత్తు ఉండకూడదు. ఈ నిబంధన పీవీ సింధు లాంటి ప్లేయర్లకు ఇబ్బంది.
- ఇప్పటి వరకూ 21 పాయింట్ల గేమ్ మూడు సెట్లుగా ఉండేది .ఇప్పుడు గేమ్‌ను ఐదు సెట్లుగా మార్చి 11 పాయింట్లకు తగ్గించారు. దీంతో ఆరంభంలో వెనుకబడ్డ ప్లేయర్లు తర్వాత పుంజుకునే లోగా సెట్ అయిపోతుంది.
- సెట్‌మధ్యలో 11 పాయింట్లు అయ్యాక బ్రేక్ ఉంటుంది. ఈ సమయంలో కోచ్‌తో ఆటగాళ్లు మాట్లాడుకోవచ్చు. తప్పుగా ఆడుతుంటే కోచ్ సూచనలు సలహాలు ఇవ్వొచ్చు. అయితే ఈ సమయాన్ని తగ్గించారు
- టాప్ -15 ర్యాంక్ ప్లేయర్లు ఏడాదిలో కనీసం 12 టోర్నీలు ఆడాలన్న నిబంధన అమల్లోకి రానుంది. ఇది చాలా కష్టమని కోచ్‌లు, ఆటగాళ్ల అభిప్రాయం.

ఫైనల్ రేస్

భారత్ బంగ్లా కీలక పోరు నేడు

కొలంబో : శ్రీలంకతో జరిగిన టి20 మ్యాచ్‌లో సాధించిన విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న భారత జట్టు నిదహాస్ కప్-2018 టోర్నీలో ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకునేందుకు బుధవారం బంగ్లాదేశ్‌తో చివరి లీగ్ మ్యాచ్‌ను ఆడుతుంది. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 215 పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేసిన బంగ్లాతో మ్యాచ్‌ను భారత జట్టు తేలిగ్గా తీసుకునే అవకాశాలు కనిపించటం లేదు. తొలి మ్యాచ్‌లో లంక చేతిలో ఓడినప్పటికీ ఆ తర్వాత జరిగిన రెండు మ్యాచ్‌లో గెలుపొందిన రోహిత్ శర్మసారథ్యంలోని భారత్ ఈ ముక్కోణపు వన్డే టోర్నీ ఫైనల్ చేరే అవకాశాన్ని సుగమం చేసుకుంది. ఒక వేళ ఈ మ్యాచ్‌లో ఫలితం తారుమారైనా భారత్‌కు పెద్దగా నష్టం లేదు. శుక్రవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక -బంగ్లా జట్లు పోటీపడతాయి. ఆ మ్యాచ్ ఫలితం తర్వాత దీంతో నెట్ రన్‌రేట్ ఆధారంగా ఫైనల్ చేరే జట్లను నిర్ణయిస్తారు. ఇప్పటికే భారత్ మెరుగైన రన్‌రేట్ (+0.21)తో టాప్ ప్లేస్‌లో ఉంది. భారత జట్టులో ఓపెనర్ శిఖర్‌ధావన్ బ్రహ్మాండంగా రాణిస్తున్నప్పటికీ కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం ఇంకా ఫామ్‌లోకి రాలేదు. రోహిత్ వరుసగా విఫలమవడం మిగతా బ్యాట్స్‌మెన్‌పై భారం పడుతోంది. సురేశ్ రైనా, మనీష్ పాండే మిడిలార్డర్‌లో ఫర్వాలేదనిపిస్తున్నారు. వీరికి తోడు దినేశ్ కార్తీక్ , రిషబ్ పంత్‌లు కూడా బ్యాట్‌కు పదును పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. శ్రీలంకతో జరిగినమ్యాచ్‌లో కార్తీక్ 39 రన్స్ చేసి ఫామ్‌లోకి రావటం భారత శిబిరంలో కొత్త ఉత్సాహం తెచ్చిపెట్టింది. ఇక భారత్ బౌలింగ్ విభాగంలో ఎలాంటి ప్రయోగాలు చేయకపోవచ్చు. దీపక్ హుడా, సిరాజ్, అక్షర్ పటేల్ లాంటి యువ బౌలర్లకు ఇంకా అవకాశం రానప్పటికీ ఈ మ్యాచ్‌లోనూ ఆడే ఛాన్స్ దక్కకపోవచ్చు. విజయ్‌శంకర్, పాండ్యా, శార్దూల్ ఠాకూర్‌లు చక్కగా రాణిస్తుండటంతో ఈ మ్యాచ్‌లోనూ వారికి ఆడే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి. ఇక బంగ్లా జట్టు విషయానికొస్తే భారత్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 139 రన్స్ మాత్రమే చేసిన జట్టు ఆ తర్వాత శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 215 పరుగుల లక్ష్యాన్ని సాధించి ఎలాంటి సంచలనమైనా సాధించగలదని నిరూపించింది. తమిమ్ ఇక్బాల్, లిటోన్ దాస్, ముషాఫికర్ రెహ్మాన్ శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడి భారీ టార్గెట్‌ను చేజ్ చేసి భారత శిబిరంలో కలవరం రేపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ చివరి లీగ్ మ్యాచ్‌లో ప్రయోగాల జోలికెళ్లకుండా ఉండటమే మేలని భారత్ భావిస్తోంది.



భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్‌ధావన్ (వైస్‌కెప్టెన్), లోకేశ్ రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేశ్ కార్తీక్ (వికెట్ కీపర్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనద్కత్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

బంగ్లాదేశ్ : మహ్మదుల్లా (కెప్టెన్), తమిమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ఇమ్రుల్ కయాజ్, ముసాఫికర్ రెహ్మాన్ (వికెట్ కీపర్), షబ్బీర్ రెహ్మాన్, షబ్బీర్ రెమ్మాన్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, రుబెల్ హుస్సేన్, తస్కిన్ అహ్మద్, అబు హైదర్, అబు జయేద్. అరిఫుల్ హక్, నజిముల్ ఇస్లామ్, నూరుల్ హసన్, మెహిదీ హసన్, లిటన్ దాస్.

సాయంత్రం 7 గంటల నంచి డి. స్పోర్ట్స్, డిడి స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం.

ధోని రికార్డు బ్రేక్

చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చిన సురేశ్ రైనా సోమవారం కొలంబోలో జరిగిన టి20 మ్యాచ్‌లో మాజీ కెప్టెన్ ధోని రికార్డును దాటేశాడు. అంతర్జాతీయ టి20ల్లో అత్యధికపరుగులు సాధించిన భారత ఆటగాళ్లలో మూడో స్థానంలో నిలిచాడు.ఇ ప్పటిదాకా భారత్ తరపున టి20ల్లో ధోనీ 1444 రన్స్‌తో మూడో స్థానంలో ఉండగా, శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 27 పరుగులు చేసిన రైనా 1452 రన్స్ చేశాడు. ఈ జాబితాలో కోహ్లీ (1983 రన్స్), రోహిత్ శర్మ (1696 రన్స్) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

లోకేశ్ రాహుల్ హిట్ వికెట్ రికార్డు

కొలంబోలో సోమవారం శ్రీలంకతో జరిగిన టి20 లీగ్ మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్ లోకేశ్ రాహుల్ అరుదైనరికార్డును సొంతం చేసుకున్నాడు. జీవన్ మెండిస్ వేసిన బంతిని ఆడేందుకు ప్రయత్నించిన రాహుల్ వికెట్లను తగిలి హిట్‌వికెట్‌గా అవుటయ్యాడు. దీంతో టి20ల్లో హిట్‌వికెట్ అయిన తొలి క్రికెటర్‌గా రాహుల్ రికార్డులో ్కెక్కాడు. టెస్టుల్లో లాలా అమర్‌నాథ్, వన్డేల్లో మోంగియాలు ఈ రికార్డుల్లో ఉన్నారు.

కోహ్లీ ర్యాంక్ పదిలం

న్యూఢిల్లీ : తాజా టెస్ట్ ర్యాంకుల్లో దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ రబడా మళ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్ట్‌లో రబడా 11 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికాను గెలిపించాడు. దీంతో రబడా 902 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇక బౌలింగ్ విభాగంలో భారత ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ నాలుగో స్థానంలో నిలిచాడు. రవీంద్ర జడేజా మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. బ్యాటింగ్ విభాగంలో 943 పాయింట్లతో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ 912 పాయింట్లతో రెండో స్థానాన్ని పదిలపరచుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్‌లో సూపర్ సెంచరీ కొట్టిన డివిలియర్స్ ఐదు స్థానాలు ఎగబాకి 779 పాయింట్లో ఏడో ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. టీమ్ ర్యాంకుల్లో భారత్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.



ఆ బ్యాట్‌తోనే ఆడతా : వాట్

ఢిల్లీ : టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి ట్విట్టర్లో పెళ్లి ప్రపోజ్ చేసి వార్తల్లోకెక్కిన ఇంగ్లండ్ మహిళా క్రికెటర్ డేనియల్ వాట్ ఇంకా తన ప్రేమను మరచిపోలేదు. నాలుగున్నరేళ్ల క్రితం వాట్ కోహ్లీకి చేసిన పెళ్లి ప్రపోజల్ పెద్ద సంచలనమైంది. అయితే ఈ అమ్మడు ఇప్పుడు ఇండియాకొస్తోంది. ఇంగ్లండ్ జట్టు త్వరలో భారత్‌లో ట్రయాంగులర్ టి20 సిరీస్ ఆడుతుంది. ఆ సిరీస్‌లో కోహ్లీ ఇచ్చిన బ్యాట్‌తోనే ఆడతానని వాట్ చెబుతోంది. 2014లో భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించినప్పుడు డేనియల్‌కు కోహ్లీ ఓ బ్యాట్ కానుకగా ఇచ్చాడు. అప్పటి నుంచి కోహ్లీ ఇచ్చిన బ్యాట్‌నే వాడుతున్నానని, ఇప్పుడు అదే బ్యాట్‌తో ఆడతానని తెలిపింది. మార్చి 23 నుంచి ప్రారంభం కానున్న ముక్కోణపు సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మహిళా జట్లు పాల్గొంటున్నాయి.

వీనస్ విలియమ్స్ విజయం

ఇండియన్ వెల్స్ : ఇండియన్స్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అమెరికన్ స్టార్ సెరెనా విలియమ్స్‌పై అక్క వీనస్ విజయం సాధించింది. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో జరిగిన ఈ పోరులో వీనస్ 6-3, 6-4 స్కోరుతో సెరెనాను ఓడించింది. దాదాపు గంటకు పైగా సాగిన ఈ మ్యాచ్‌లో వీనస్ పూర్తి ఆధిక్యత కనబరిచింది. ఇటీవలే పండంటి బిడ్డకు జన్మనిచ్చిన సెరెనా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడలేకపోయింది.



ఫెదరర్ ముందంజ

ఇక పురుషుల విభాగంలో వరల్డ్ నంబర్ వన్ రోజర్ ఫెదరర్ ఈ టోర్నీలో జైత్రయాత్ర కొనసాగిస్తున్నాడు. సోమవారం జరిగిన మూడో రౌండ్‌లో 6-2, 6-1 స్కోరుతో ఫిలిప్ క్రజనోవిక్‌ను ఓడించి టైటిల్‌కు చేరువయ్యాడు. తదుపరి రౌండ్‌లో ఫెదరర్ జెర్మీ చార్డేతో పోటీపడతాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.